

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 357 • పేజీలు : 12 • గురువారం 19 సెప్టెంబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati



# కేంద్రం మరో సంచలనం

◆ జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినేట్ ఓకే
◆ రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి ఆమోదం
◆ రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు
◆ 2026 నవంబర్‌లో జమిలి ఎన్నికలు?
◆ ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకు రావాలి
◆ లోక్‌సభ,రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు

న్యూఢిల్లీ,సెప్టెంబరు 18 : దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొం దించిన నివేదికను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే పార్లమెంట్ మిగతా 7లో



◆ అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేలా పథకం
◆ అందుబాటులోకి రూ.99కే నాణ్యమైన మద్యం
◆ భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు
◆ చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు
◆ వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై కేబినేట్‌లో చర్చ
◆ గతేడాది ఆగస్టులోనే వాలంటీర్ల కాలపరిమితి ముగిసిందని తెలిపిన అధికారులు
◆ గత ప్రభుత్వంలో సాక్షి పత్రిక కొనుగోళ్ల పేరిట జరిగిన అవకతవకలపై కేబినెట్‌లో చర్చ
◆ నిబంధనలకు విరుద్ధంగా సాక్షికి జరిపిన చెల్లింపులపై విచారణకు ఆదేశిద్దాం
◆ బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాలి

కొత్త మద్యం పాలసీకి ఎపి కేబినెట్ ఆమోద ముద్ర

అమరావతి,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక): కొత్త మద్యం పాలసీకి ఎపి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రైవేట్ మద్యం దుకాణాలకు అనుమతిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.100 లోపు నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవాలని మంత్రివర్గం నిర్ణయించింది. రూ.99కే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవడానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు మిగతా 7లో

## నా హయాంలో భారత్‌లో బంధం బలోపేతం

- అమెరికా వస్తున్న మోదీతో తప్పకుండా భేటీ అవుతా..
- రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ వెల్లడి
- అధ్యక్ష పదవికి పోటీ చేయడం ప్రమాదకరమని వ్యాఖ్య



7లో

## మరోమారు కోవిడ్ పంజా

- కొత్త వేరియంట్ గుర్తింపు

న్యూఢిల్లీ,సెప్టెంబరు 18 : కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా కలవర పెట్టిందో అందరికి తెలిసిందే. ఆ తరవాత ఇప్పుడు మంకీపాక్స్ కూడా కలవర పెడుతోంది. ఈ క్రమంలో కోవడి కొత్త వేరియంట్ మళ్లీ విజృంభిస్తోందన్న వార్త భయపెడుతోంది. కొవిడ్-19కు సంబంధించిన కొత్త వేరియంట్ ఎక్స్‌ఈసీ రూపంలో ఇప్పటికే యూరప్‌లో అంటు వ్యాధిలా మిగతా 7లో



## కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం

- ఎక్స్ వేదికగా ఓటర్లకు రాహుల్ వినతి

న్యూఢిల్లీ,సెప్టెంబరు 18 : ఇండియా బ్లాక్‌కి ఓటు వేస్తే.. మీరు వేసే ఓటు జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. బుధవారం జమ్మూకాశ్మీర్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మిగతా 7లో



## ప్రతి ఒక్కరికీ విజన్ డాక్యుమెంట్ ఉండాలి



అమరావతి,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక): రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పు.. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసింది, కేంద్రం నిధులను పక్కదారి పట్టించిందని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ధికారంలోకి వచ్చినప్పుడు ఖజానాలో ఎక్కడా డబ్బులు లేవు. జీతాలు మిగతా 7లో

◆ నియోజకవర్గాల వారీగా తయారు చేసుకోవాలి
◆ జీతాలు ఇచ్చేందుకు కూడా పైసా లేదు..
◆ రూ.10లక్షల కోట్ల అప్పు..రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు
◆ అయినా ధైర్యంగా ముందుకు వెళుతున్నాం
◆ ఎన్‌డిఎ శాసనసభాపక్ష భేటీలో చంద్రబాబు వెల్లడి
◆ చంద్రబాబు దార్శనిక నేత అన్న పవన్ కళ్యాణ్
◆ ఆయన పక్కన పనిచేయడం అదృష్టమని వ్యాఖ్య



## రైతులకు శుభవార్త

◆ వరదబాధిత రైతులకు అండగా ప్రభుత్వం
◆ ఇన్‌పుట్ సబ్సిడీ కింద నిధులను విడుదల
◆ రాష్ట్రంలో చాలా మేరకు రహదారులు ధ్వంసం

7లో

## పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి




- అమల్లోకి ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం.. - ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభం

న్యూఢిల్లీ,సెప్టెంబరు 18 : పిల్లల కోసం బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రారంభించారు. పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఈ పెన్షన్ ఖాతాను వినియోగించుకోవచ్చు.ఎన్‌పీఎస్ మిగతా 7లో

## వైసిపికి బాలినేని రాజీనామా



◆ వైసిపికి మరో భారీ షాక్
◆ నేడు పవన్‌తో బాలినేని భేటీ..
◆ జనసేనలో చేరేందుకు సిద్ధం
◆ జగన్ విధానాలు నచ్చకే రాజీనామా..
◆ బాలినేనితో వైసిపి పెద్దలు పలుమార్లు చర్చలు..

ఒంగోలు,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక): వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ముఖ్యనేత బాలినేని శ్రీనివాస రెడ్డి పార్టీని మిగతా 7లో

## రాహుల్‌గాంధీని అంతం చేస్తామంటారా?

◆ అంతంత మాటలంటున్నా మౌనం వహిస్తారా..
◆ మోదీ,అమిత్ షాల మద్దతుతోనే కొందరి వ్యాఖ్యలు
◆ బిజెపి నేతల తీరుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా
◆ ఈ దేశంలో ఎవరు తీవ్రవాదులు? ఏది తీవ్రవాదం?
◆ చర్యలు తీసుకోవాలంటూ వైఎస్ షర్మిల డిమాండ్



విజయవాడ,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపెద్ద టెర్రరిస్టు అంటూ బీజేపీ, శివసేన చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం నాడు వన్ టౌన్ గాంధీ విగ్రహం దగ్గర ఏపీసీసీ ఆధ్వర్యంలో వైఎస్ షర్మిల భారీ మిగతా 7లో



## ఇంకా విచారణ జరగాలి

◆ ముంబయి నటి కేసులో ప్రాథమిక విచారణ పూర్తి
◆ ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధం
◆ డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఏలూరు,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ డీజీపీ ద్వారకా మిగతా 7లో

## కశ్మీర్‌లో ప్రశాంతంగా పోలింగ్..



◆ పుల్వామాలో అత్యల్పంగా 46 శాతం పోలింగ్
◆ కిశ్త్‌వాడ్‌లో అత్యధికంగా 77 శాతం పోలింగ్
◆ ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదు
◆ తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు పూర్తి

శ్రీనగర్,సెప్టెంబరు 18 : జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దాదాపు 59 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ముఖ్య కమిషనర్ పీకే పోలె వెల్లడించారు. కిశ్త్‌వాడ్‌లో అత్యధికంగా 77శాతం, పుల్వా మాలో అత్యల్పంగా మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# ఇద్దరు ఒక్కటై...?

ఆ మధ్య ఇద్దరు వ్యాపార సామ్రాజ్య సార్వభౌములు కలిశారు.ఇద్దరూ కలిసి వాటాలు పంచుకున్నారు. ఓ ప్రాజెక్టు విషయంలో మొదలైన ఈ భాగస్వామ్య బంధం ముందు ముందు ఎలా సాగుతుందో అనే ఉత్కంఠ వ్యాపార ప్రపంచంలో మొదలైంది.ముఖ్యంగా, మనదేశంలో ఈ అనూహ్య పరిణామం పెద్ద వార్తగా మొదలై,చర్చల పరంపరను సృష్టిస్తోంది.నేడు కలిసిన ఆ ఇద్దరూ నిన్నటి వరకూ వ్యాపార ప్రత్యర్థులు.నెంబర్ :1 స్థానం కోసం నువ్వా? నేనా? అని పోటీపడినవారు.ఇప్పుడు మొదలైన ఈ బంధంతో కలిసి వ్యాపారం చేయనున్నారు. ఆ ఇద్దరూ అంబానీ –ఆదానీ.ఓ పవర్ ప్రాజెక్టు విషయంలో వీరిద్దరి మధ్య భాగస్వామ్యం కుదిరింది. మధ్యప్రదేశ్ లోని అదానీకి చెందిన మహాన్ ఎనర్జన్ లిమిటెడ్ లో రిలయన్స్ 5కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. దీని ద్వారా అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ 26 శాతం వాటా దక్కించుకుంది.500మెగావాట్ల విద్యుత్ ను తమ సొంత అవసరాలకు రిలయన్స్ వినియోగించుకోనుంది.ఈ ఇద్దరు దిగ్గజాలు ఎన్నో ఏళ్ళుగా వేర్వేరు వ్యాపారాల్లో కొనసాగుతున్నప్పటికీ,అగ్రస్థానాన్ని అధిరోహించడం కోసం ఎవరి శైలిలో వారు పోటీపడుతున్నారు.ఆయిల్, గ్యాస్, రిటైల్,టెలికాం విభాగాలలో ముఖేష్ అంబానీ విజయపరంపరతో ముందుకు వెళ్తున్నారు.ఇన్ఫ్రా, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మైనింగ్ వ్యాపారాలలో అదానీ అఖండంగా సాగుతున్నారు.మీడియా, పునరుత్పాదాక ఇంధన రంగాలలో ఇద్దరూ పోటీపడుతున్నారు.ఆసియాలోని సంపన్నులలో అందరి కంటే అగ్రభాగాన నిలవాలన్నది ఇద్దరి సంకల్పం.ఇప్పుడు ఈ ప్రాజెక్టుతో ఇద్దరికీ వియ్యం కుదిరినా, కయ్యం ఉండదని చెప్పలేం.వీరి వియ్యాలు –కయ్యాలు ఎలా ఉన్నా, వీరి వల్ల మనదేశానికి ఏదైనా మేలు జరిగితేనే జాతికి నిజమైన ప్రయోజనం.భారత్ ను నెంబర్ :1 గా నిలబెట్టడం కోసం వీరిద్దరూ కలిసి ప్రయత్నిస్తే అందరూ హర్షిస్తారు. ఇద్దరూ గుజరాతీలే. ఇద్దరిదీ ఒకటే సామాజిక వర్గం దిల్లీ పెద్దల ఆశీస్సులు ఇద్దరికీ పుష్కలంగానే వుంటాయి. కాకపోతే, నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రధాని మోదీ ఆశీస్సులు అదానీకే ఎక్కువ ఉన్నాయనే ప్రచారం బలంగానే వుంది.ఈ పదేళ్ల బిజెపి పాలనలో ఆదానీ అందనంత ఎత్తుకు ఎదిగిపోయారన్నది వాస్తవం.ప్రస్తుతం ఆయన ప్రపంచంలోనే 15వ అత్యంత సంపన్నుడుగా నిలుస్తున్నాడు.అంబానీల వలె ఈయనది కూడా దాదాపు ఒకే రకమైన నేపథ్యం.చిన్న వ్యాపార వాతావరణం నుంచే వచ్చారు.2014 నుంచి 2023 వరకూ బండి బాగానే నడిచింది కానీ, హిండెన్ బర్గ్ రిపోర్ట్ వ్యవహారంతో వివాదాల్లోకి వెళ్లారు.ఈ అంశంలో సుమారు 30శాతం సంపదను ఆయన కోల్పోయారని వార్తలు వచ్చాయి.ఈ అంశం మన పార్లమెంట్ ను కుదిపేసింది.ప్రతిపక్షాలు అధికార పార్టీని నిలదీయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయి.ఆదానీకి అన్నిరకాలుగా అండగా నిలిచి,అభివృద్ధి చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నానా యాగీ చేసింది.రిలయన్స్ కు ఒకప్పుడు అధికారంలో వున్న కాంగ్రెస్ పెద్ద అండగా నిలిచిందనే పుకార్లు వున్నాయి.మొత్తంగా చూస్తే రిలయన్స్,అదానీ సంస్థలకు ఏలినవారి అండదండలు మెండుగా వున్నాయని, ఈ నేపథ్యంలో, సంప్రదాయ వ్యాపార సంస్థలుగా ఎన్నో ఏళ్ళ పాటు ఎంతో ప్రతిష్ఠను సొంతం చేసుకున్న టాటా, బిర్లా గ్రూపులు ఈ రేసులో వెనుకబడిపోయాయని ఎందరో అనుకున్నారు.ముఖేష్ అంబానీ కంటే గౌతమ్ అదానీ సుమారు 5ఏళ్ళు చిన్నవారు.ఎం.బి.ఏ.,చదువుతూ,వ్యాపారం కోసం, అంబానీ చదువు మధ్యలో వదిలేశారు.బి.కామ్ చదువుతూ అదానీ రెండో సంవత్సరం తర్వాత చదువు మానేశాడు. చదువుల సంగతి ఎట్లా వున్నా, ఇద్దరూ వ్యాపారంలో బాగా రాణించారు,ఇంకా రాణిస్తూనే వున్నారు. "వ్యాపారంలోనూ, రాజకీయాలలోనూ శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు " అంటారు.వీరిద్దరి మధ్య మిత్రత్వమే వికసించి వికాస భారతానికి మూలస్థంభాలుగా నిలవాలని ఆకాంక్షిద్దాం. భారతదేశానికి ఏమాత్రం అప్రతిష్ఠ రాకుండా ఆర్ధిక సామ్రాజ్యాలు నిర్మించాలని, దేశ ప్రజకు వీరిరువురి కార్యకలాపాలు ఎంతో ఉపయోగపడాలని ఆశిద్దాం.మళ్ళీ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.మోదీ ప్రధాని అయ్యారు.ఇంకొకపక్క,విపక్ష ఇండియా కూటమి బలం గణనీయంగా పెరిగింది.మన్ మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా వున్న సమయంలో రిలయన్స్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం,అధినేత్రి సోనియాగాంధీ పెద్దఎత్తున సహకారం అందించారనే ప్రచారం పెద్దఎత్తున సాగింది.ఇప్పుడు వీరిద్దరికీ ఈ పక్షాల సహకారం,సంపదసృష్టి ఎలా ఉండబోతాయో? చూద్దాం తమాషా!

# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం

## సెప్టెంబర్ 19...కాటం లక్ష్మీ నారాయణ జయంతి



ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహ మాటంగా నిలబడటం ఆయనకే చెల్లింది. సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడాన్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకు లందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమకు, కార్యదీక్షతకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ. కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందారుల అకృత్యాలను ఎదిరించిన దైర్యవంతులు. తాత పేరుతో పాటు దైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీ నారాయణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువుగా బావించారు. పోలీసులు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచారు. తర్వాత లక్ష్మి నారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గులతో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజికి సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించారు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మినారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. లక్ష్మి నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యంగా మారింది.నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పు డితనికి బాగా ఉపక రించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొక పత్రికను 1969లో ప్రారంబించారు. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. 1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటి పైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం.లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్‌లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మి నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరించక పోవడంతో లక్ష్మి నారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మి నారాయణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నా ము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశుల తోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీయులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మి నారాయణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం.నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజయ్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర సమర యోధులు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధుడు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**

# ఒకే దేశం ఒకే ఎన్నిక

**చరిత్ర ఇలా**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం మనది. ఇక్కడ ఎన్నికల నిర్వహణ కూడా ఎప్పుడూ ప్రత్యేకమే. సాధారణంగా భారత్‌లో కేంద్రానికి, రాష్ట్ర అసెంబ్లీలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుంటాయి. పార్లమెంట్‌కు, రాష్ట్రాల అసెంబ్లీలకూ ప్రతి ఐదేళ్లకు ఓ సారి ఎలక్షన్లు జరుగుతాయి. అయితే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగవు. శాసనసభ గడువు ముగిసే ఏడాది మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఈ కారణంతో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోందని, ప్రభుత్వ ఖర్చు పెరిగిపోతోందని కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా జమిలీ ఎన్నికలపై ఆలోచిస్తోంది.ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుదీర్ఘ కాలంపాటు విచారించి14 మార్చి, 2024న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ నివేదిక అందించింది. 18 వేల పేజీలకు పైగా ఉన్న ఈ నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్లకు ఒకే ఓటరు జాబితా సిద్ధం చేయాలని నివేదికలో సూచించారు. 2023, సెప్టెంబర్ 2 న ఏర్పాటైన ఈ కమిటీ నివేదికను రూపొందించడానికి 191 రోజులు పట్టింది.



సెప్టెంబర్ 18, 2024న కేంద్ర కేబినెట్ జమిలీ ఎన్నికలు జరపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మీకు తెలుసా.. జమిలీ ఎన్నికల ఆలోచన ఇప్పటిది కాదు. సుమారు 41 ఏళ్ల క్రితమే1983లో జమిలి ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

**చరిత్ర ఇదే..**

1983లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరపాలని ఎన్నికల సంఘం సూచించింది. 1999లో లా కమిషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల చట్ట సంస్కరణలపై 170వ నివేదికను సమర్పించింది. 2018లో లా కమిషన్ ఆఫ్ ఇండియా జమిలీ ఎన్నికలపై నివేదిక విడుదల చేసింది. 15 ఆగస్టు, 2019 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దేశమంతటా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట సాక్షిగా ప్రకటించారు. 1 సెప్టెంబర్, 2023న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 'ఒక దేశం, ఒకే ఎన్నిక'పై కమిటీ ఏర్పాటైంది. 2 సెప్టెంబర్ 2023న కమిటీ సభ్యులను ప్రకటించారు.హోం శాఖ మంత్రి అమిత్ షా సహా ఏడుగురు సభ్యులు ఇందులో ఉన్నారు. వారిలో రామ్‌నాథ్ కోవింద్ కూడా ఒకరు. 23 సెప్టెంబర్ 2023న కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ అంశంపై ముందుగా అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్‌మ్యాప్‌కు సంబంధించి లా కమిషన్‌తో చర్చించి ముందుకు వెళ్లాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుని నివేదిక రూపొందించారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం కూడా ఓకే చెప్పడంతో.. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్రాల ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయనమాట.

# ఒదులుకోకు



నీకోసం ఎదురుచూసే హృదయాన్ని ఒదులుకోకు నీబాధను భరించే స్నేహాన్ని ఒదులుకోకు నీవు నమ్మిన నమ్మకానికి ఎప్పటికీ దూరం కాకు నీధైర్యం నీకు దారి దీపం కావాలి నీకు సాయం చేసిన వ్యక్తులను సంస్థలను మరిచిపోకు నీ ఉన్నతికై త్యాగాలు చేసిన తల్లి తండ్రులను మరువకు కుటుంబ పెద్దల సలహాలు పాటించు నీకు విద్యాబుద్ధులు చెప్పి నీలో ప్రతిభను గుర్తించి నిన్ను తీర్చి దిద్దిన గురువులను మరువకు నీ చిన్న నాటి స్నేహితులను ఒదులుకోకు నిన్ను తక్కువ చేసి మాట్లాడినపుడు మౌనంగా ఉండటం నేర్చుకో తిట్టినపుడు కోపాన్ని ప్రదర్శించకు పొగిడినప్పుడు గర్వపడకు సహనం నీస్థాయిని పెంచుతుంది జీవితంలో వాస్తవం ఉండాలి వాస్తవాన్ని అంగీకరించలేని అహం ఒక నయం కాని రోగం. ఊహలు ఆశలు కలలు కనటానికి ఇంపుగా ఉంటాయి సాధించాలంటే సాధన చేయాలి తోటి వారిని ప్రేమించడంవారికి సాయపడటంనిన్ను ఉత్తమ స్థితికి చేర్చుతాయి ఉన్నతునిగా నిలుపుతాయి. మంచి మిత్రున్ని వదులు కోకు దారం తెగి హారంలోని ముత్యం పడిపోతే వదిలివేయం కదా తిరిగి కూర్చుదాం మంచి మిత్రుడు ముత్యం కన్న ఎక్కువ సెల్ ఫోన్ ఛార్జింగ్ అయిపోతే దాన్ని పడేయలేం తిరిగి ఛార్జింగ్ పెట్టుకొని వాడుతాం మనుష్యులకు ఇదే వర్తిస్తుంది బాధలోనే ఒత్తిడితోనే ఉంటే మీరు ఇంకా దేనికి పనికి రారని అనుకోకండి కాస్త విశ్రాంతి తీసుకొని మనసు కుదుట పడ్డాక నూతన ఉతేజంతో మళ్ళీ పోరాటం ప్రారంభించండిఓపిక పట్టే వారు ఎప్పుడూ ఓడిపోరు గెలుపు అనేది నీడ లాంటిది దాన్ని పట్టుకోవాలని చూడకు నీదారిలో నీవు సాగిపో దానంతట అదే నీ వెంట వస్తుంది నీ అడుగులు వెలుగు వైపు పడితేనే నీడ వుంటుంది నీ పట్టుదల ప్రతిభ నిన్ను ప్రగతి వైపు నడిపిస్తాయి పాజిటివ్ దృక్పథాన్ని పెంచుకో ప్రగతి శీల సమాజాన్ని నిర్మించు

**నేదునూరి కనకయ్య**

## ఈ దేవాలయంలో ఒకే పానపట్టంపై..

# శివుడు, యముడు వెలిశారు



కాళేశ్వర క్షేత్రానికి అనేక ప్రత్యేకతలున్నాయి. ఇక్కడ ..గోదావరి, ప్రాణహిత నదులతో పాటు, అంతర్వాహినిగా సరస్వతీనది ప్రవహించడం వలన త్రివేణి సంగమ తీరమై దక్షిణకాశీగా పసిద్ధి చెందినది.శ్రీశైల,ద్రాక్షారామ, కాళేశ్వరం అనే త్రిలిం గక్షేత్రాలలో ఒకటిగా ఈ క్షేత్రం ప్రసిద్ధిగాం చినది. భారతదేశంలో ఎక్కడైనా ఒకే పానవట్టం మీద.. ఒకే లిం గం ఉంటుంది. కానీ ఇక్కడ మా త్రం ఒకే పానవట్టంపై ..రెండు లింగాలు ఉండటం విశేషం.ఒకటి కాళేశ్వరలింగం..రెండవది **ముక్తీశ్వర** లింగం.ముక్తీశ్వరలింగానికి రెండు నాశికారంధ్రాలున్నాయి. అట్టి రంధ్రాలలో ఎంత నీరు పోసినా పైకి రావు. త్రివేణిసంగమతీరంలో ఆ నీరు కలుస్తుంది. ఈ క్షేత్రం గురించి స్కాందపురాణం, గౌతమీ పురాణంలో కూడా పేర్కొన్నారు. ఈ దేవాలయంలోని కాళేశ్వరునికి ముందు పూజచేసి..అనంతరం ముక్తీశ్వరుని పూజిస్తే, స్వర్గలోకం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. మన దేశంలోప్రముఖ సరస్వతీ ఆలయాలు మూడు ఉన్నాయి. కాళేశ్వరంలో మహాసరస్వతి,అదిలాబాద్ జిల్లా బాసరలో జ్ఞానసరస్వతీ,కాశ్మీరులో బాలసరస్వతీ ఆలయాలు..అదే విధంగాసూర్యదేవాలయాలు కూడా మూడు ఉన్నాయి. కాళేశ్వరంలో ఒకటి కాగా ఒరిస్సాలోని కోణార్క్, శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి సూర్యదేవాలయాలు కాళేశ్వరంలో బ్రహ్మతీర్థం నరసింహతీర్థం హనమత్ తీర్థం జ్ఞానతీర్థం.. వాయుస తీర్థం.. సంగమతీర్థం,ఇత్యాది తీర్థాలున్నాయి.ఈ ఆలయం చుట్టుప్రక్కల ప్రకృతి సిద్ధంగా విభూతి రాళ్లు లభించడం విశేషం ఆలయంలో లోనికి వేళ్లే చోట యమకోణం ఉంది.. ఇందులో నుండి బయటకి వెళ్ళినట్లయితే యమ దోషం పోతుంది ..అని భక్తులు విశ్వసిస్తారు.. ఇందులో నుండి వెళ్లుటకు దిక్సూచి ఉంటుందిదానిని అనుసరించి వెళ్లాలి..

**సేనాధిపత్యం రమేష్**

# దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం

- మెరుగైన ఆవిష్కరణతో అమ్మవారి దర్శనం ఏర్పాట్లు
- సామాన్య భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనమే లక్ష్యం
- అధికారుల సమన్వయంతో దసరా ఉత్సవాల విజయవంతానికి కృషి
- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన
- పోలీస్ కమీషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు
- ఎంఎల్ఏ వై. సుజనా చౌదరి



**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** సామాన్య భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ఎటువంటి లోటుపాట్లు కు తావు లేకుండా అధికారులు సమన్వయంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అందుకు తగిన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. సృజన, పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, శాసనసభ్యు లు వై. సుజనా చౌదరి లు సంబంధిత శాఖల అధికారులతో స మావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ ఇంద్రకీలాద్రి పై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవస రమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. భక్తుల మనోభావా లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సామాన్య భక్తులకు సైతం సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందని అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా మరింత అప్రమత్తంగా అధికారులు ఉండాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దసరా ఉత్సవాలలో ప్రతి రోజు లక్ష మందికి పైగా మూలా నక్షత్రం రోజు రెండు నుండి మూడు లక్షల మంది వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్‌లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దాతల సహకారంతో త్రాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గౌరవ ముఖ్యమంత్రి వర్యులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి. సృజన తెలిపారు. పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాధి మంది అమ్మవారి దర్శనానికి తరలివస్తారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. జిల్లాకు చెందిన పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుండి 3,500 మంది సిబ్బంది సేవలను దసరా ఉత్సవాలలో వినియోగించనున్నామన్నారు. ఏర్పాట్ల పరిశీలనకు ప్రతి నిర్ణీత ప్రాంతం, సెక్టార్ (రంగం)కి ఒక ప్రత్యేక అధికారి పరిశీలనలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. దుర్గా ఘాట్ సమీపంలో గల కమాండ్ కంట్రోల్ ద్వారా దసరా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక శాసనసభ్యులు వై. సుజనా చౌదరి మాట్లాడుతూ గతం కంటే మరింత మెరుగ్గా దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు భక్తుల సలహాలు సూచనలు పొందేందుకు ప్రత్యేక వైబ్ సైట్‌ను రూపొందించాలని తెలిపారు. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు విఐపిలు, వివి ఐపిలకు ప్రత్యేక టైమ్ స్లాట్‌లను కేటాయించి వారికి ముందుగానే తెలియపరిచి ఆయా సమయాలలోనే అమ్మవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయని ఆయన సూచించారు. భక్తులకు హోల్డింగ్ ప్రాంతా లను ఏర్పాటు చేసి నిరీక్షణ లేకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. ఆలయ ఈవో కె.ఎస్. రామరావు మాట్లాడుతూ ఈ ఉత్స వాలలో అమ్మవారు పది అవతారాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారన్నారు. అక్టోబర్ 3వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి, 4న శ్రీ గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి, 7న శ్రీ మహాచండీ దేవి, 8న శ్రీ మహాలక్ష్మి దేవి, 9న శ్రీ సరస్వతి దేవి, (మూలా నక్షత్రం) 10న శ్రీ దుర్గాదేవి, 11న శ్రీ మహిషాశురమర్ధినీ దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి అలంకారంతో దర్శనం ఇస్తారన్నారు. అక్టోబర్ 9వ తేదీన అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారన్నారు. ఆన్లైన్ టికెట్ లేకుండా వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రిసెప్షన్, టోల్‌గేట్, హెూమ్ టర్నింగ్, పున్నమి ఘాట్, వియంసి ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద కరెంటు టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వినాయకుడి గుడి నుండి టోల్‌గేట్ ద్వారా కొండపైన హెూం టర్నింగ్ వరకు మూడు క్యూ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓం టర్నింగ్ వద్ద ఉచిత దర్శనం, వి ఐ పి క్యూ లైన్లతో కలిపి మొత్తం 5 క్యూ లైన్లు ఉంటాయన్నారు. భక్తులకు త్రాగునీరు అందించేందుకు ఈ ఏడాది వాటర్ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిల్సు సరఫరా చేయనున్నామన్నారు. కనకదుర్గానగర వద్ద ప్రత్యేక ప్రసాదం కౌంటర్లుతో పాటు కొండపైన ఓం టర్నింగ్ వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని 25 లక్షల లడ్డులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రథం సెంటర్, మున్సిపల్‌ఆఫీసు, సీతమ్మ వారి పాదాలు, కుమ్మరి పాలెం, పున్నమి ఘాట్ వద్ద ఉచిత చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్నానమాచరించేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద 500 షవర్స్, పున్నమి ఘాటు వద్ద 100, భవాని ఘాట్ వద్ద 100 షవర్స్‌లతో పాటు 150 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు అమ్మవారి ఉచిత ప్రసాదం కింద పులిహెూర, కట్టు పొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం మహామండపం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, సూచనలు సలహాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది సహకారంతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని ఆలయ ఈవో అన్నారు. సమావేశంలో డిసిపిలు గౌతమి శాలి, యం. కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డిసిపిలు జి. రామకృష్ణ, యం. రాజరావు, డిఆర్‌వో వి. శ్రీనివాసరావు, ఆర్‌డివో భవాని శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్. రమ, కోటేశ్వరరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గతేడాది 98 శాతం మిరప రైతులు గ్రాసియాను ఉపయోగించారు




**గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** గతేడాది 98 శాతం మిరప రైతులు గ్రాసియాను ఉపయోగించారని, ఇది మిరప పంటలకు సమర్థవంతమైన చీడ పీడల నివారిణి అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ వెల్లడించింది. దక్షిణాదిలోని మిరప మార్కెట్‌లలో నిర్వహించిన సర్వే ఫలితాలను విడుదల చేస్తూ, 57 శాతం మంది రైతులు 15-35 రోజులు మధ్య గ్రాసియాను ఉపయోగించారని కంపెనీ వెల్లడించింది. మిరప పంటలో 15-25 రోజుల దశలో గ్రాసియాను పిచికారీ చేస్తే తామర పురుగు (త్రిప్స్) నుంచి దీర్ఘకాలిక నియంత్రణను అందిస్తుంది. రైతుల్లో 71 శాతం మంది గత సంవత్సరం రెండు సార్లు కంటే ఎక్కువగా గోద్రెజ్ అగ్రోవెట్ గ్రాసియాను ఉపయోగించారు. గ్రాసియా అనేది రైతులకు అత్యంత ప్రజాదరణ పొందిన, గో-టు-బ్రాండ్ అని ఇది పునరుద్ఘాటిస్తుందని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె అన్నారు.

## ఇసుజు డి-మ్యాక్స్ వాణిజ్య వాహన శ్రేణిలో కొత్త క్యాబ్ ఛాసిస్ వేరియంట్




**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** తన డి-మ్యాక్స్ వాణిజ్య పికప్ వాహన శ్రేణిని విస్తరించినట్లు ఇసుజు ప్రకటించింది. కొత్త ఇసుజు డి-మ్యాక్స్ 1.7 సింగిల్ క్యాబ్ క్యాబ్ ఛాసిస్ ఎస్‌టిడి వేరియంట్ పాడైపోయేవి, ఎఫ్ఎంసిజి, ఫుడ్ అండ్ క్యాటరింగ్, లాస్ట్ మైల్ డెలివరీ మొదలైన వివిధ వ్యాపారాలలో సుదూర ప్రయాణాలలో వాహనాల అప్లికేషన్స్ నిర్వహించే వినియోగదారుల అవసరాలను నెరవేరుస్తుంది. ఇటువంటి వినియోగదారులు ఇప్పుడు తమ వ్యాపార అవసరాలకు తగిన తమ సొంత లోడ్ బాడీలను నిర్మించుటకు అనుకూలత కలిగి ఉంటారు. ఇసుజు డి-మ్యాక్స్ వేరియంట్ ప్రగతిశీల వ్యాపార వినియోగదారులకు బహుముఖ ప్రజ్ఞ, విలువను అందించే ఉత్తమ పికప్ ఎంపిక అవుతుందని ఇసుజు మోటార్స్ ఇండియా డెప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ టోరుకిషిమోటో పేర్కొన్నారు.

## ఐదు కొత్త తరం పంట సంరక్షణ మరియు ప్రత్యేక మొక్కల పోషకాహార ఉత్పత్తులను విడుదల చేసిన శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్




**అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** డిసిఎం శ్రీరామ్ లిమిటెడ్యొక్క విభాగం, శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్, తమ నూతన పంట రక్షణ మరియు స్పెషాలిటీప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని హెూటల్ మినర్వా గ్రాండ్ , విజయవాడ లో ఈ కార్యక్రమం జరిగింది, ఈ వినూత్న పరిష్కారాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖ ఛానెల్ భాగస్వాములు హాజరయ్యారు.తన క్రిమిసంహారక పోర్ట్‌ఫోలియోను బలోపేతంచేయడానికి, ప్రపంచంలో ఆవిష్కరణలతో రాణిస్తున్న కంపెనీల భాగస్వామ్యంతో కలిసి శ్రీరామ్ సైషో, శ్రీరామ్ క్రోన్ మరియు శ్రీరామ్ ట్రెక్చర్‌లనువిడుదల చేసింది. ఈ శక్తివంతమైన క్రిమిసంహారకాలు వరుస పంటలు మరియు ఉద్యాన పంటలలోఎక్కువగా కనిపించే రసం పీల్చే మరియు ఆకు నమిలే పురుగుల నుండి మెరుగైన పంట రక్షణను అందించడానికిపేటెంట్ పొందిన సాంకేతికతలతో సూక్ష్మంగా రూపొందించబడ్డాయి. ప్రతిఘటన అభివృద్ధినితగ్గించడానికి రూపొందించబడిన ఈ ఉత్పత్తులు ఆరోగ్యకరమైన పంటలను మరియు అధికదిగుబడులను ప్రోత్సహిస్తాయి.స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ విభాగంలో, శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్ శ్రీరామ్ప్రోటోబజ్‌ను పరిచయం చేసింది, ఇది యునైటెడ్ స్టేట్స్ నుండి పేటెంట్ పొందినడెలివరీ టెక్నాలజీ 'నానో లిక్విడ్ టెక్నాలజీ'ని చేర్చడం ద్వారా అభివృద్ధి చేయబడిన విప్లవాత్మక ఉత్పత్తి. దాని విశేషమైనపనితీరుతో, శ్రీరామ్ ప్రోటోబజ్ం వేగంగామెరుగైన ప్రభావాన్ని నిర్ధారిస్తుంది, సాగుదారులకు మెరుగైన లాభాలను అందిస్తుంది.శ్రీరామ్ డ్రిప్ ఇట్ వెజిటబుల్స్, కూరగాయలకు పూర్తి పోషకాహార పరిష్కారం, ఇది గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని హామీ ఇచ్చారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిజినెస్ హెడ్‌సంజయ్ఛాబ్రా మాట్లాడుతూ, " వ్యవసాయ ఆవిష్కరణలసరిహద్దులను శ్రీరామ్ ఫార్మ్ సొల్యూషన్స్అధిగమిస్తూనే ఉంది, ఈ కొత్త ఉత్పత్తి ఆవిష్కరణలు పెంపకందారులను వారిఅభివృద్ధి చెందుతున్న అవసరాలను పరిష్కరించే స్థిరమైన వ్యవసాయ పద్ధతులను నడిపే అత్యాధునిక పరిష్కారాలతోసాధికారత కల్పించడానికి కంపెనీ నిబద్ధతకు అనుగుణంగా ఉన్నాయి" అని అన్నారు.

# బుడమేరు కాలువ పూర్తి విస్తీర్ణ వివరాల నివేదికివ్వండి

- సర్వే నంబర్ల వారీగా రూరల్, అర్బన్, నగర పరిధిలో వివరాలను సమర్పించండి
- జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** బుడమేరు వరద ముంపు నుంచి జిల్లా,నగరానికి శాశ్వత పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, దీనిలో భాగంగా సర్వే, ల్యాండ్ రికార్డ్స్‌బీ ఇరిగేషన్, వీఎంసీ సిటీప్లానింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో వాస్తవ సర్వేనంబర్లతో సహా ఎంత మేరకు ఆక్రమణలకు గురైనది సంబంధిత పూర్తినివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు.ఇందులో భాగంగా ఆక్రమణల గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సృజన.. బుధవారం సర్వే, భూ రికార్డులు, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల బుడమేరు వాగు పరీవాహక ప్రాంతంలో కురిసిన కుంభవృష్టితో ఊహించని విధంగా ప్రమాద కరస్థాయిలో దాదాపు 43 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో విజయవాడ రూరల్, నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం కావడంతో పాటు నగరంలోని రెండు లక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాదాపు పది రోజులకు పైగా కలెక్టరేట్‌లోనే పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులతో సమీక్షిస్తూ బుడమేరు గండ్లను పూడ్చడం, బాధితులను పరామర్శించి, పూర్తి సహాయసహకారాలు అందించారన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ఆపరేషన్ బుడమేరును ప్రకటించారని.. ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించిన జలవనరుల శాఖకు సంబంధించి అర్బన్, సిటీ పరిధిలో కాలువ విస్తీర్ణానికి సంబంధించిన నివేదికలను రూపొందించాల్సిన అవసరముంద న్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఈ నేపథ్యంలో ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నంబర్లతోసహా సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, జిల్లా సర్వే, నగరపాలక సంస్థ సర్వే విభాగం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఆక్రమణలపై సర్వే నెంబర్లతో నివేదిక రూపొందించాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసు, నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా మూడు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించిన అమెజాన్

amazon

**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** రాబోయే పండుగ సీజన్‌కు ముందస్తుగా అమెజాన్ ఇండియా, ఢిల్లీ ఎన్‌సీఆర్, గౌహతి, పాట్నాలలో మూడు కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించామని ప్రకటించింది. ఈ కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ప్రస్తుతం అమెజాన్‌కు ఉన్న ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లకు విస్తరణ కాగా, ఇవి ఉత్తర, తూర్పు భారతదేశంలోని వినియోగదారులకు డెలివరీ వేగాన్ని గణనీయంగా పెంచుతాయి. ఈ పెట్టుబడులు ఈ రాష్ట్రాల్లోని విక్రేతలకు వినియోగదారులను చేరువ చేయడం ద్వారా వారికి మెరుగైన సేవలందించడంలో సహాయపడతాయి. అదే విధంగా ఈ ప్రాంతానికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తూ వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయి. ఈ ఉద్యోగాలు అమెజాన్ కార్యకలాపాల నెట్‌వర్క్‌లో పూర్తి సమయం, పార్ట్ టైమ్ అవకాశాలతో సహా అనేక రకాల పాత్రలను కలిగి ఉంటాయి. ఈ భవనాలన్నీ రాబోయే పండుగ సీజన్‌కు సిద్ధంగా ఉంటూ, పని చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

## మార్కెట్లోకి కర్వ్ ఎస్.యు.వి.కు పే కారును విడుదల చేసిన టాటా మోటార్స్..

### ఆకర్షణీయమైన ధరలలో ప్రజలకు అందుబాటులో ఉందన్న షోరూం ప్రతినిధులు..



**విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** వాహనాల తయారీలో దిగ్గజంగా పేరుగాంచిన టాటా మోటార్స్ వారు "కర్వ్ ఎస్.యు.వి.కూ పే" నూతన కారును విజయవాడ, నిడమానూ రులో ఉన్న డీలర్ గారపాటి ఆటోవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో లాంఛనంగా విడుదల చేశారు.. ఎం.డి. కె.వి.ఎస్. ప్రకాశరావు, హైకోర్ట్ న్యాయవాది జి.వి. మాధవరాజు , పిన్నమనేని సాయికృష్ణ, మోడల్ డైరి ఎండి ఐశ్వర్య, అతుల్ ఆటోస్ ఎండీ నీరజ్ చంద్ర, మరియు ఫైనాన్స్ కంపెనీల మేనేజర్లు సంయుక్తంగా కారును బుధవారం సాయంత్రం మార్కెట్లోకి విడుదల చేశారు.. "కర్వ్ ఎస్.యు.వి.కూ పే" కారు ఎలక్ట్రిక్, పెట్రోల్, డీజిల్ వేరియట్స్లో ఉంటాయని, 6 స్పీడ్ మాన్యువల్ లేదా 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్తో తయారవుతాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు., ఈ ట్రాన్స్ మిషన్ సిగ్మెంట్లో తొలి డీజిల్ కారు ఇదేనని వారు తెలియజేశారు.. ఈ కార్లు ఆధునిక హంగులతో అమర్చబడి ఉన్నాయనీ ప్రతి ఒక్క వాహ న ప్రేమికుడుకి నచ్చుతుందని చెప్పారు. ఈ కారు ఆకర్షణీయమైన ఎక్షోరూం ప్రారంభపు ధర రూ.9.99 లక్షలు మాత్రమే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టాటా కంపెనీ ప్రతినిధులు, గారపాటి టాటా సీఈఓ కునుమిల్లి జాహ్నవి వినియోగదారులు, ఫైనాన్షియర్స్, తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతో ఆరోగ్యం పదిలం

100మంది మహిళలకు ఉచిత రక్త పరీక్షలు.
మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు..
పోషకవిలువల కిట్ల పంపిణీ.
పౌష్టిక ఆహారం ప్రాధాన్యత అందరు గుర్తించాలి.
లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి



**గాజువాక,విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక) :** పోషక విలువల గొప్పతనం ప్రతి ఒక్కరు గుర్తించాలని,పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చుని,ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి ఉద్యమంలా మొక్కలు నాటేందుకు స్వంచ్ఛంధంగా ముందుకు రావాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం పిలుపుమేర న్యూట్రిషన్ మంత్ సందర్భంగా వి ఎస్ ఇ జెడ్ లో లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమెయిన్ ఇండియా సంస్థల అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమెయిన్ ఇండియా సంస్థల సంయుక్త అద్వర్యంలో ప్రాజెక్ట్ స్మూత్ వాక్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పిలుపుమేర పోషణ మాఘ్ 2024 సందర్భంగా సంస్థ ప్రతినిధి ఆళ్ళ లీలారాణి చేతులమీదుగా వి ఎస్ ఇ జెడ్ పరిపాలన కార్యాలయ సముదాయ ప్రాంగణంలో పోషక అవగాహన సదస్సు మరియు జె డి సి రోషిని చే ఏక్ పేడ్ మాకి నామ్ పే లో భాగంగా మొక్కను నటించే కార్యక్రమం జరిగింది. అనంతరం 100 మందికి పైగా మహిళలకు ఉచిత రక్త పరీక్షలను వెల్నెస్ సెంటర్లో నిర్వహించారు.ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి మాట్లాడుతూ మహిళలు నిరంతరం ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని,రోగనిరోధక శక్తిని పెంచుకునే ఆహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు.తల్లి ఆరోగ్యంగా ఉంటేనే చిన్నారులు,పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.మనిషి జీవన విధానంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతలు మనపై ఉన్నాయని,అందరు ఎవరికి చేతనైన విధంగా గ్రామల్లో,పట్టణాల్లో ,ఇళ్ళలో మొక్కలు నాటేందుకు కృషి చేయాలని లీలారాణి కోరారు.ఈ కార్యక్రమంలో లీ ఫార్మా ఉద్యోగులు, హెూబుల్ బెలోస్ సంస్థ ఉద్యోగులు, ఎస్ఇజెడ్ పారిశ్యుద్ధ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు


ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
విజయనగరం,అనకాపల్లి జిల్లాలోని నియోజకవర్గాలకు మరియు మండలాల వారిగా విలేఖర్లు కావలెను.
అచ్యుతాపురం, మునగపాక, యలమంచిలి, వి.మాడుగుల, బుచ్చయ్యపేట, పాయకారావు పేట, నర్సీపట్నం, విజయనగరం, ఎస్.కోట, జామి, వేపాడ, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, ఎల్.కోట, రాజాం.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

# జిల్లాలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, సెప్టెంబర్ 18 (ఆంధ్ర పత్రిక):** జిల్లాలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ గృహ నిర్మాణం పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించి మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణం పురోగతి నిదానంగా ఉందన్నారు. ముఖ్యంగా అవనిగడ్డ, గుడివాడ, పెడన నియోజకవర్గాలలో గృహ నిర్మాణం వెనుకబడి ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి 729 ఇల్లు పూర్తి కావాల్సి ఉందని, వచ్చే అక్టోబర్ మాసానికి 2,168 ఇల్లు పైకప్పు స్థాయి వరకు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వచ్చే సంవత్సరం మార్చి మాసాంతానికి 12,613 ఇల్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా అవనిగడ్డ, నాగాయలంక, మోపిదేవి, గుడివాడ, నందివాడ, పెడన బంటుమిల్లి మండలాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో ఇంజనీరింగ్ సహాయకులు గృహ నిర్మాణం పై సరైన దృష్టి పెట్టడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం ఇచ్చే నిధులు వచ్చే సంవత్సరం మార్చి తో ముగుస్తుందని ఆలోగానే లబ్ధి దారులు తమ ఇల్లు పూర్తి చేసుకుంటే సంబంధిత ఇంటి నిర్మాణం బిల్లులను చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. సమయం దాటితే నిధులు రావని, బిల్లులు చెల్లింపు కావని, సమస్యలు తలెత్తుతాయని స్పష్టంగా లబ్ధిదారులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. గృహ నిర్మాణ యూనిట్ విలువ పెరుగుతుందని ఆలోచనలో కొందరు ఇల్లు నిర్మించుకొనుటకు ముందుకు రావడంలేదని తన దృష్టికి వచ్చిందని, పాత ఇల్లు మంజూరైన వారికి ముందు నిర్ణయించిన యూనిట్ విలువలోనే ఇల్లు పూర్తి చేసుకోవాలని వివరించాలన్నారు. ఈ విషయమై లబ్ధిదారులను చైతన్యపరిచడంతో పాటు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ఇళ్ల నిర్మాణం పురోగతి వేగవంతం చేయాలన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గృహ నిర్మాణం పట్ల శ్రద్ధ చూపకపోవడం సరైనది కాదని స్పష్టం చేస్తూ పరిస్థితి ఇలాగే కొనసాగితే వారిని సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా గృహ నిర్మాణ అధికారి జివి సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వర్ నాయక్, గృహ నిర్మాణ సంస్థ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

# నాలుగు గ్రామాల పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం చూపిన విక్కుర్తి



**కోడూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** అవనిగడ్డ నియోజకవర్గం లో కోడూరు మండలం లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ కోడూరు మండలానికి చెందిన నాలుగు గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు పరిష్కారం చూపారు.. కోడూరు మండల పరిధిలోని సాలెంపాలేం పిట్టల్లంక గ్రామాల మధ్య కరకట్ట క్రింద ఉన్న సింకు పూర్తిగా పూడిక పడిపోవడంతో సాళెంపాలెం, బడే వారి పాలెం, బావిసెట్టి వారి పాలెం, నారే పాలెం గ్రామాలలో సాగయ్యే పొలాలు కొద్ది పాటి వర్షానికే ముంపు బారిన పడుతూ ఉండటంతో రైతులు నష్టపోతున్నారు.

. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు ఆ ప్రాంత రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యను పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వచ్చి ప్రొక్లయినర్ సమకుర్చాలని రైతులంతా కలసి కట్టుగా డ్రయిన్ పూడిక తీసుకుంటామని కోరారు.. వెంటనే స్పందించిన శ్రీనివాస్ శింకు పూడిక తీతకు ప్రొక్లయినర్ సామకూర్చగా వరదలకు ముందు దాదాపు 20 గంటలు పని చేయగా అప్పటి వరకు ఉగ్గబట్టిన డ్రైన్ పారుదల వేగం పెరిగింది.. అయితే వరదల కారణంగా పనులు నిలచిపోగా గడచిన రెండు రోజులుగా పనులు తిరిగి ప్రారంభం అయ్యాయి.. బుధవారం గ్రామస్తులు, రైతులు దగ్గర ఉండి చేయించుకుంటున్న పనులను శ్రీనివాస్ సోదరుడు విక్కుర్తి రాంబాబు పరిశీలించగా రైతులు శ్రీనివాస్, రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు..

# యల్,బి,ఆర్,సి,ఈ విద్యార్థులకు సేవా సర్టిఫికెట్లు అందించిన మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్



**మైలవరం, సెప్టెంబర్18: (ఆంధ్రపత్రిక):** విద్యతో పాటు అన్ని రంగాలలో ముందుంటూ సమాజిక భాద్యతగా సమాజానికి సేవలందిస్తున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లోను, ఫీజు రీయంబర్స్, స్కాలర్షిప్ లోను ఎంతో ఉపయోగపడే సేవా సర్టిఫికెట్స్ ని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ నందు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ, కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు విద్యార్డులకు బుధవారం అందించారు. మొత్తం 40 మంది విద్యార్థిని, విద్యార్థులకు సేవా సర్టిఫికెట్స్ అందించారు.

ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ కాలేజ్ విద్యార్థులు చదువుకి మాత్రమే పరిమితం కాకుండా ట్రస్ట్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారని, ఇటీవల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ కార్యక్రమం నందు వారు చేసిన సర్వీసు పట్ల విద్యార్థులను అభినం దించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ చదువుతో పాటు సామజిక సేవ చేయాలనీ ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలకు హాజర వ్వాలని కోరారు. మరీ ముఖ్యంగా మన కాలేజ్ నందు నార్త్ సౌత్ ఫౌండేషన్ వారిచ్చే స్కాలర్షిప్ రెన్యువల్ కొరకు ఈ సేవా సర్టిఫికెట్ ఎంతగానో ఉప యోగపడుతుందని ఇటువంటి సర్టిఫికెట్స్ అందించినందుకు ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్షిప్ కోఆర్డినేటర్ గూడూరు నాగిరెడ్డి పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ పథకం వినియోగదారులకు ఎంతో ఉపయుక్తం

## కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** పి ఎం సూర్యఘర్ పథకం వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరమని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ సౌర విద్యుత్ పథకం పై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలి యోజన పేరుతో సౌర విద్యుత్ పథకాన్ని దిగువ, మధ్యతరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం అమలు చేస్తుంద న్నారు. ఈ పథకం చాలా మంచి పథకమని, దీని వలన వినియోగదా రులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఇంటిలో విద్యుత్ ఛార్జీల బిల్లు ఖర్చు ఎక్కువగా ఉంటుందన్నారు.

గతంలో పరిస్థితులు గమనిస్తే మొదట్లో 60 వ్యాట్ బల్బులు వాడే వారమని, దాని వలన ఎక్కువ విద్యుత్తు ఖర్చు అవ్వడంతో ట్యూబ్లైట్ ల వాడకానికి మారామని, తదుపరి ఎల్ఈడీ దీపాలు వినియోగించి విద్యుత్ ఆదా చేస్తున్నామన్నారు. తాజాగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్ పథకాన్ని వినియోగదారుల శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టాయన్నారు. ఒక్కసారి పెట్టుబడి పెడితే తదుపరి విద్యుత్ చార్జీలు తగ్గిపోతాయన్నారు. ఇంటి పైకప్పు పై సౌరఫలకాలను అమర్చుకుంటే తద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుందన్నారు. దీంతో విద్యుత్చార్జీల బిల్లు మనకు ఆదా అవుతుందన్నారు. నెలవారి విద్యుత్తు వినియోగం సరాసరి 150 యూనిట్ల లోపు ఉంటే 1.2 కిలో వాట్ సౌరఫలకాలు బిగించు కోవచ్చని, దానికోసం 30 వేల నుంచి 60 వేల రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. అలాగే 150 నుండి 300 యూనిట్ల వరకు 2.3 కిలో వాట్ సౌరఫలకాలు బిగించుకుంటే 60 వేల రూపాయల నుంచి 78 వేల రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. అదేవిధంగా 300 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం ఉంటే 3 కిలోవాట్ల కు పైగా సౌర ఫలకాలు అమర్చుకుంటే 78,000 వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ పథకం కింద సౌరఫలకాలు అమర్చుకునే వినియోగదారులకు బ్యాంకర్లు కూడా రుణ సహాయం అందిస్తారని నెలవారి కంతులలో దానిని తీర్చుకోవచ్చన్నారు. అన్ని రకాల సంఘాల ప్రతినిధులు ఈ సౌర విద్యుత్ పథకాన్ని విస్తృతంగా వారికి తెలిసిన వాట్సాప్ గ్రూపులలో షేర్ చేయాలని వీలైనంత ఎక్కువమంది సద్వినియోగం చేసుకునేలా సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ చింత రవి బాలకృష్ణ నాట్య బృందం వారిచే ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్యాలు ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ఈ కార్యాశాలలో విద్యుత్శాఖ ఈఈ భాస్కరరావు మచిలీపట్నం గుడివాడ మున్సిపల్ కమిషనర్లు జి బాలసుబ్రమణ్యం ఎల్డీఎం జయవర్ధన్, జడ్పిసిఈఓ ఆనంద్ కుమార్ పౌరసరఫరాల సంస్థ డిఎం సతీష్, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి రమేష్, గిరిజన సంక్షేమ అధికారి ప్రకాష్ రావు,పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్ తదితర జిల్లా అధికారులు విద్యుత్ శాఖ డీఈలు రామకృష్ణ, మాణిక్యాలరావు, శ్రీనివాసులు, సుందర్రావు సచివాలయ కార్యదర్శులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, రైస్ మిల్లర్ సంగం సభ్యులు, వినియోగదారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంకర్రావు జన్మదిన వేడుకలు

## భారీగా తరలివచ్చిన వైసిపి కార్యకర్తలు





- అధైర్య పడవద్దు అండగా ఉంటానని శంకర్రావు హామీ- గజమాలతో సత్కారం- వృద్ధులకు రగ్గులు పంపిణీ చేసిన శంకర్రావు-జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అజి ఎమ్మెల్యే శంకర్రావు-మాజీ ఎమ్మెల్యే శంకర్రావును గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు కార్యకర్తలు

**పెదకూరపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** నంబూరు శంకర్రావు పుట్టినరోజు వేడుకలు బుధవారం గుంటూరులోని పెద్దకూరపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు మండలాల నుండి పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తరలి వచ్చి నంబూరు శంకర్రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు భారీ గజమాలతో శంకర్రావు ను సత్కరించారు. వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. భారీ కేకును కట్ చేశారు. అధైర్య పడద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# క్రీడలు నాయకత్వాన్ని పెంపొందిస్తాయి

## తాసిల్దార్ మహమ్మద్ హుస్సేన్



**చిలకలూరిపేట సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** క్రీడలు నాయకత్వాన్ని పెంపొందిస్తాయని చిలకలూరిపేట తాసిల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఏ ఎం జి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెలక్షన్స్ కోసం అండర్ 17, 14 విభాగాల్లో బాలబాలికలకు జూడో పోటీలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన తాసిల్దార్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పై చిన్ననాటి నుండే దృష్టి పెట్టాలన్నారు. క్రీడలు శరీర ధారుధ్యాన్ని ,మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని వివరించారు. ఏ ఎం జి డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వాన్ని, నైపుణ్యతని పెంపొందించుకోవాలన్నారు . జూడో, మార్షల్ ఆర్ట్స్ లాంటి క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు క్రమశిక్షణ చాలా ముఖ్యమని సూచించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కరీముల్లా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ గా ఇచ్చేందుకు ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో గుంటూరు, పల్నాడు , బాపట్ల జిల్లాలో చెందిన 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నూతక్కి రవి, షేకు ఖాసిం బుడే, శివరామకృష్ణ, దుర్గ, పిడి ఇమాన్యుల్ రాజ్, శ్రీనివాసరావు , సాయిరాం, సతీష్, ఎం వి సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు

# వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం



**బాపట్ల సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) :** భారీ వర్షాలు, వరద విపత్తుతో నష్టపోయిన కుటుంబాలకు ఈనెల 20వ తేదీన నష్టపరిహారం పంపిణీకి సిద్ధంగా ఉండాలని ఏపీ విపత్తు నిర్వహణ, రెవిన్యూశాఖ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్. పి.సిసోడియా ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర రాజధాని నుంచి బుధవారం ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో జరిగిన నష్టంపై ఏపీ విపత్తు నిర్వహణ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సిసోడియా జిల్లా కలెక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టం అంచనాలపై నివేదిక పంపాలని ఆదేశించారు. మత్స్యకారులు, చేనేతలు, వ్యవసాయ, ఉద్యానవన పంటలు తదితర అంశాలపై తదుపరి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. తీర ప్రాంతమైన బాపట్ల జిల్లాలో 7,970 గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకుని దెబ్బతిన్నాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. విపత్తుతో 3 మండలాల్లోని 24 గ్రామాలు నీట మునిగి దెబ్బతిన్నాయన్నారు. 30 వేల మంది బాధితులయ్యారని కలెక్టర్ తెలిపారు. 194 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 214 కచ్చా గృహాలు, 245 పూరీలు దెబ్బతిన్నట్లు వివరించారు. 438 గేదెల షెడ్లు దెబ్బ తిన్నాయని చెప్పారు.

24 గేదెలు, ఒక దున్నపోతు, 34 గొర్రెలు, మేక లు, 351 కోళ్లు మృతి చెందాయన్నారు. నష్టపోయిన కుటుంబాలలో నాలు గు యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు లేవని ఆయనకు వివరించారు. సదరు కుటుంబాలకు పరిహారం నేరుగా అందిం చడానికి అనుమతి ఇవ్వాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించిన మేరకు అత్యవసరంగా జిల్లాకు రూ.7.09 కోట్లు నిధులు కావాలని విన్నవించారు. పంట నష్టం వివరాలను లిఖితపూర్వకంగా నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కృత్తివెన్నులో ఘనంగా బాలశౌరి పుట్టినరోజు వేడుకలు



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) :** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి జన్మదిన వేడుకలు పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్ప గ్రామంలో రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి ఒడుగు ప్రభాస్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో సర్పంచ్ బస్వాని బంగార్రాజు ఎంపీటీసీ జిల్లా మల్లికార్జున రావు ఎంపీటీసీ 2 జల్లా రమేష్ , నీటి సంఘం అధ్యక్షులు బొర్ర ఏడుకొండలు , బిజెపి మండల అధ్యక్షులు కొక్కిలిగడ్డ ఏసు రాజు , నీలిపూడి ఉపసర్పంచ్ పుప్పాల పాండురంగారావు , జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు వివియన్ నరేష్ కొప్పినేటి , కాజా వీర మణికంఠ, టిడిపి ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, జనసేన కార్యదర్శిలు పితాని సురేష్ ,అడ్డాల శేఖర్ , టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ , బిజెపి సీనియర్ నాయకులు దాసరి వెంకట శ్రీనివాస్ , జిల్లా దానయ్య ,నడకుదుటి వెంకటరెడ్డి , ఎల్లికట్ల బాలకృష్ణ , బొర్రా రాధాకృష్ణ , జల్లా లోకేష్ బస్వాని భగవాన్, తెలగంశెట్టి శ్రీను , బొలిశెట్టి అయ్యప్ప మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని వారంరోజులలో నెరవేర్చిన మంత్రి పార్ధసారథి

## బాలికల వసతి గృహంలో స్వంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసిన మంత్రి పార్ధసారథి



**నూజివీడు సెప్టెంబర్, 18 (ఆంధ్రపత్రిక ):** రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి తాను ఇచ్చిన హామీని వారం రోజుల్లో నెరవేర్చారు. మంత్రి పార్థసారథి గత వారం తన పర్యటనలో భాగంగా నూజివీడు పట్టణంలోని మదుపల్లి తాతయ్య కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా వసతి గృహంలో మినరల్ వాటర్ ప్లాంట్, ప్రహరీ గోడ పాడైందని అధ్యాపకులు, విద్యార్థినులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన మంత్రి సదరు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే తన స్వంత నిధులతో మినరల్ ప్లాంట్ ను, కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేశారు. మంగళవారం మినరల్ వాటర్ ప్లాంట్ ను కళాశాల అధ్యాపకులు ప్రారంభించి, విద్యార్థినీలకు విద్యార్థినులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందిం చారు. తమ సమస్యలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, వారం రోజులు కాకుండానే పరిష్కరించిన మంత్రి పార్థసారథి కి మదుపల్లి తాతయ్య కళాశాల బాలికల వసతిగృహ విద్యార్థినులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ ఆర్ ఆర్ లో క్రీడాకారుల సెలక్షన్





**నూజివీడు ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక ):** నూజివీడు మండల బాలికల ఆటల పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యస్ ఆర్ ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ నూజివీడులో పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమలత మరియు మండల విద్యాశాఖాధికారి జమలయ్య ప్రారంభించారు. అండర్ 14మరియు అండర్ 17 బాలికల ఆటల పోటీలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ,బ్రాడ్మింటన్, చెస్, యోగా సెలక్షన్స్ నిర్వహించడం జరిగినది. మండలం సెలెక్ట్ అయిన బాలికలు నియోజకవర్గ పోటీల్లో పాల్గొంటారని తెలియచేశారు. ఈ కార్యకమంలో అన్నామణి, లక్ష్మి, వనజ, నాగరాజు, రవీంద్ర ,స్వప్న, రాణి, సరళ ,ఆరతి, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, రాజేశ్వరి, నాగమణి, భవాని పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వంలో ప్రజలపై మోయలేని భారాలు

## మునుగోటి శ్రీనివాసరావు



**పెదకూరపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్ర పత్రిక):** వంట నూనెలపై 20 నుండి 32.5.శాతం వరకు దిగుమతి సుంకం విధించి మోడీ ప్రభుత్వం వంట నూనెలను మంట నూనలుగా మార్చి పేద మధ్య తరగతి ప్రజల మీద మోయలేని భారం మోపిందని పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాస రావు బుధవారం ప్రకటనలు విమర్శించారు అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో పెద్ద మొత్తంలో దిగుమతి సుంకం విధించిన తొలి ప్రభుత్వంగా మోడీ ప్రభుత్వం నూతన రికార్డు సృష్టించింది అన్నారు సామాన్య మధ్యతరగతి ప్రజల ఆహార పదార్థాలు అల్పాహారాలు కోని తినే పరిస్థితి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ దిగుమతి సుంకం పెంపు వల్ల స్వీట్ షాపులు హెూట ళ్ళు తోపుడు బండ్లపై విక్రయించడం ద్వారా చిరు వ్యాపారాలతో జీవనం సాగించే వారి ఆదాయానికి గండి పడుతుందని తద్వారా అనేకమంది ఉపాధి అవకాశం కోల్పోతున్నారని అన్నారు ప్రతిరోజు 30 లక్షల లీటర్ల వంట నూనెలు ఉపయోగించుకుంటున్న ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మీద కేంద్ర ప్రభుత్వ విధించిన దిగుమతి సుంకం భారం పెద్ద ఎత్తున. పడబోతుందని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడంమే ముఖ్యమని భావించింది తప్ప పేద మధ్యతరగతి ప్రజల పొట్ట నింపుకోవటానికి అవసరమైన ఆహార పదార్థాలు ఆకాశాన్నంటే విధంగా చేస్తున్నామనే విషయం విస్మరించారని శ్రీనివాసరావు విమర్శిం చారు కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కష్టాల కడలి ఈదుతున్న ప్రజలపై పెనుబారాలు మోపి నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# వరద బాధితులకు వెల్లల చెరువు వాసి సాయం



**సంతమాగులూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** విజయవాడ వరద బాధితులకు సీఎం సహాయ నిధికి మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన చింత శ్రీధర్ లక్ష రూపాయలను ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి చెక్కును అందజేయడం జరిగింది.

# నిషేధిత భూముల జాబితాలో తొలగింపు నివేదిక ఇవ్వాలి



బాపట్ల, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) : నిషేధిత భూముల జాబితా (22-ఏ) నుంచి తొలగించిన భూముల వివరాలపై తహసిల్దార్లు నివేదికివ్వాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఆర్డీవోలు, తహసిల్దార్లతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. భూములపై సమగ్రంగా రూపొందించిన నివేదికను ఈ నెల 21వ తేదీలోగా కలెక్టరేట్ కు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రెవిన్యూ అధికారులు మనస్సు దగ్గర పెట్టుకుని బాధ్యతతో పనిచేయాలన్నారు. నివేదిక తయారీలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తప్పులు, పొరపాట్లు లేకుండా నిక్కచ్చిగా వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. ఇందుకొరకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలు వేశామన్నారు. ఆర్డీవో, తహసిల్దార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, మండల సర్వేయర్ కలిసి మండల స్థాయి కమిటీలో ఉంటారని చెప్పారు. తహసిల్దార్, సర్వేయర్, విఆర్ఓ లు గ్రామస్థాయి కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల క్రయవిక్రయాలు క్రమ పద్ధతిలో జరిగాయా, చట్టం ఉల్లంఘన జరిగిందా అనే అంశాలను స్పష్టంగా నివేదించాలన్నారు.

చుక్కల భూమి వివరాలు, షరతులు గల పట్టా భూమి వివరాలు స్పష్టంగా పొందుపరచాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. సర్వీస్ ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టం ఉల్లంఘనకు గురైందా లేదా అనే విషయాలను స్పష్టంగా పరిశీలించి నివేదిక పంపాలన్నారు. డీకే పట్టాల దస్త్రాలు, అసైన్మెంట్ భూములకు సంబంధించిన దస్త్రాలు, ఆర్ ఓ ఆర్ దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సీలింగ్ ల్యాండ్ వివరాలు పునః పరిశీలన చేయాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆర్ఎస్ఆర్ తో సరి చూసుకోవాలన్నారు. లేదా ఆర్ ఎస్ ఏ, ఎఫ్ ఎల్ ఆర్ దస్త్రాలను పరిశీలించాలన్నారు. అసైన్డ్ భూముల్లో గత 20 ఏళ్లుగా ఉన్న వ్యక్తులు మాత్రమే ఆ భూముని అనుభవిస్తుంటే ఆ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసిల్దార్లు పరిశీలించి నివేదించాలన్నారు.

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టాలను ఉల్లంఘించిన వాటిని తహసిల్దార్లు ధ్రువీకరించి నివేదిక పంపాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దస్త్రాల విచారణ తదుపరి తాసిల్దార్లు పరిశీలించినట్లు స్పష్టంగా నివేదిక ఇవ్వాలన్నారు. బాపట్ల జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల నుంచి స్పష్టమైన నివేదిక అందించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, కె ఆర్ ఆర్ సి ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్ డి ఓ లు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థినికి ఇన్నర్ వీల్ క్లబ్ ఆర్థిక సహాయం

### అధ్యక్షురాలు గట్టు సరోజిని




చిలకలూరిపేట, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): విద్యార్థుల ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట పేద విద్యార్థులను ఆదుకుంటుందని క్లబ్ అధ్యక్షు రాలు గట్టు సరోజిని చెప్పారు. మాలినేని లక్షయ్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ ఇంజనీ రింగ్ చదువుతున్న భవ్య అనే విద్యార్థినికి రూ 5వేల ఆర్థిక సహాయాన్ని మంగళ వారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ గోరంట్ల పద్మజా ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. పేదరిక అసమానతలు తొలగిపోవాలన్నా తలరాతలు మారాలన్నా పేద వర్గాల్లో నుంచి ప్రతి కుటుంబంలో ఇంజనీర్లు, డాక్టర్లు పుట్టుకురావాలని ఆకాంక్షించారు. గతంలోనూ ఇన్నరవీల్ క్లబ్ తరపున ఎంతోమంది పేద విద్యార్థులకి సహాయం అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో దాత గోరంట్ల పద్మజా ,సెక్రటరీ నార్నే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఛలో తెనాలి మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రుద్రపోగు సురేష్




చిలకలూరిపేట, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన పోస్టర్ ఆవిష్క రణ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్ ని ఆవిష్కరించారు. తదనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఒకటవ తేదీ భారత సుప్రీంకోర్టు వర్గీకరణను అమ లు చేయాలని కోరుతూ తీర్పునివ్వటం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముప్పై సంవత్సరాల పాటు సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే ఏబిసిడి వర్గీకరణ సాధ్యమైందన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా మాదిగల ఆత్మీయ ఆత్మగౌర సమ్మేళనం తెనాలి పట్టణంలో సెప్టెంబర్ ఇరవై ఒకటివ తేదీ శనివారం మధ్యా హ్నం మూడు గంటలకు తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు నందు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్గీకరణ రథసారథి, ఎమ్మా ర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ పై మాట్లాడటం జరుగుతుందని అన్నారు. కాబట్టి పల్నాడు జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొ నాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో వర్గీకరణ పై బిల్లు పెట్టి తక్షణమే వర్గీకరణ రాష్ట్రంలో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ, మహేంద్ర పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు విజయసాగర్ మాదిగ,చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు కొండే పాగ క్రాంతి కుమార్ మాదిగ, ఎడ్లపాడు మండల అధ్యక్షులు కిరణ్ మాదిగ, నాదెండ్ల మండల అధ్యక్షులు కృష్ణ మాదిగ, చిలకలూరిపేట పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కేసనపల్లి కిషోర్ మాదిగ, నియోజకవర్గ మాజీ అధ్యక్షులు పల్లె పోగు చంటి మాదిగ, మహిళ నాయకురాలు మేరీ అక్క మాదిగ, అడ్వకేట్ అనిల్, బొంతా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మలపాడులో చోరీకి గురైన ట్రాన్స్ఫార్మర్




సంతకంమాగులూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): మండలంలోని కొమ్మలపాడు గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ లోని రాగి తీగను దొంగతనం చేయడం జరిగింది. గ్రామ సమీపంలోని వీరాంజి బ్రిక్స్ వాళ్ళ ట్రాన్స్ఫార్మర్ మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది.ట్రాన్స్ఫార్మర్ పగుల కొట్టి అందులో ఉన్న రాగితీగ దోచుకొని పోయారు. గతంలో ఇదే గ్రామంలో రెండు నెలల క్రితం పొలాల్లోని మోటార్లు, విద్యుత్ తీగలను దొంగిలించడం జరిగింది. ఈ ట్రాన్స్ఫార్మర్ల దొంగతనం వల్ల కోమ్మలపాడు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కావున ఇకనైనా అధికారులు ఈ చోరీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## మిన్నేకల్లులో అధ్వానంగా మారిన పారిశుధ్యం



సంతమాగులూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): మండలంలోని మిన్నెకల్లులో గ్రామపంచాయతీలో పారిశుద్యం అధ్వానంగా మారింది. కాలువలో మురుగు నీరు నిల్వ ఉండడంతో వరదమయంగా మారింది. కాలువలో పారిశుద్ధ్య కార్మికులు పూడిక సరిగా తీయకపోవడం లేదని దానివల్ల దుర్వాసనతో, దోమల బెడదతో ఇబ్బంది పడు తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వ్యాపించే అవకాశం ఉందని అన్నారు.ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికా రుల దృష్టికి తీసుకువెళ్లిన ఉపయోగం లేదని గ్రామస్తులు ఆరోపించారు. కావున అధికారులు వెంటనే స్పందించి కాలువలో పూడికను తీయాలని కోరారు.

## పొలంలో పాముకాటు.. వ్యక్తి మృతి



బల్లికురవ, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): బల్లికురవ మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పాము కరవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గుంటుపల్లి గ్రామాని కి చెందిన నాగేశ్వర రావు పాము కాటుకు గురికాగా బంధువులు చిలకలూరిపేట వైద్య శాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘట నపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాపట్ల మునిసిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ గా కరుణ



బాపట్ల , సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): బాపట్ల శానిటరీ ఇన్స్పెక్టర్ గా చెవూరి కరుణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చీమకుర్తి నగర పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తూ బదిలీపై బాపట్ల బి1 ఇన్స్పెక్టర్ గా వచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం పనులు ముమ్మరంగా నిర్వహించి స్వచ్ఛ బాపట్లకు కృషి చేస్తానన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహ కారం తప్పనిసరిగా కావాలన్నారు. సందర్భంగా బాధ్యత సిబ్బంది ఇతర ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏపీ హైర్ బస్ ఓనర్ అసోసియేషన్ భారీ విరాళం

### వరద బాధితుల సీఎం సహాయ నిధికి 24 లక్షల చెక్కు



వేటపాలెం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): ఏపీ హైర్ బస్ ఓనర్ అసోసియేషన్ తరపున మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 24 లక్షల చెక్కును వరద బాధితుల సహాయ నిధికి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు అందించినట్లు స్టేట్ ట్రెజరర్, వేటపాలెం మండల వాసి ఆర్ వి రమణమూర్తి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు కి గురై పలువురు తీవ్రంగా నష్టపోయారని తమ వంతు సహాయంగా అసోసియేషన్ తరపున చెక్కును అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో శ్యాం ప్రసాద్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న: సాతులూరి అరుణ





ఐదువందల బ్రెడ్లు, వెయ్యి బత్తాకాయలు - ఐదు వందల మంది -వరద బాధిత కుటుంబాలకు- పంపిణీ దాతలకు మా హృదయపూర్వక ధన్యవాదాలు

చిలకలూరిపేట సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): ప్రకృతి వైపరీత్యం వలన ఏర్పడిన తుఫాను కారణంగా విజయవాడ అతలాకుతలమవ్వటం జరిగింది. అదేవిధంగా కొన్ని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. అక్కడ ప్రజలు పూర్తిగా ఆస్తి నష్టం ప్రాణ నష్టం వాటిల్లింది. అక్కడ ప్రజలకు మానవతా దృక్పథంతో తమ శక్తి కొలది రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్థిక సహాయ కార్యక్రమాలు చేస్తూ ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా చిలకలూరిపేట పట్టణంలోని 12వ వార్డు తూర్పు మాలపల్లి సాతులూరి అరుణ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితల సహాయార్థం ఐదువందల కుటుంబాలకు 500 బ్రేడ్లు వెయ్యి బత్తాకాయలు పంపిణీకి సిద్ధం చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ఆమె అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ కూడా మానవతా దృక్పథంతో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు సాటి మనుషులకు ఉన్నదాంట్లోనే ఎంతో కొంత సాయం చేసి మనం మనుషులమని నిరూపించుకోవాలని ఆమె అన్నారు. మరి ముఖ్యంగా ఈ కార్యక్రమానికి మాకు తోడ్పడినటువంటి తూర్పు మాలపల్లి దాతలకు మా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆమె అన్నారు. కార్యక్రమంలో నడ సుచరిత, గేరా రాము, కొల్లబత్తుల అనిల్ కుమార్, సాతులూరి అనిల్ కుమార్, జొన్నలగడ్డ బాలయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 22వ తేది డాక్టర్ కత్తి పద్మారావుకి "మన కాలపు జాషువా"పురస్కారం ప్రదానం



కొరిశపాడు/పొన్నూరు సెప్టెంబర్18 (ఆంధ్రపత్రిక): ప్రముఖ కవి ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు, డాక్టర్ కత్తి పద్మారావు కి ఈ నెల22 వ తేది పొన్నూరు లోని లుంబినివనం లో మన కాలపు జాషువా పురస్కారం ప్రధానం చేస్తున్నట్లు లోకాయుత పబ్లికేషన్ కోఆర్డినేటర్ కత్తి చేతన్ తెలియజేసారు. ఈ సందర్భంగా చేతన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నాయకులకు, కార్యకర్తలకు, లోకాయితా పబ్లికేషన్స్ బాధ్యులకు మరియు అంబేద్కర్ యువజన సంఘాలకు ప్రజా సంఘాలకు నాయకులకు, దళిత బహుజన మహిళ సంఘా లకు, కేడర్‌కు, అభిమానులకు, మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా 22 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం గం 10:30 ని.లకు పొన్నూరు లుంబిని వనం,కి రావాలని అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌లో పగిడిపల్లి వెంకటేశ్వర్లు జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం వారు మన మహాకవి డాక్టర్ కత్తి పద్మారావుకి "మన కాలపు జాషువా" పురస్కార ప్రధానం చేస్తు న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అందరిని ప్రేమగా ఆహ్వాని స్తున్నామని వేదిక ప్రధాన సదస్సులో మహాకవి గుర్రం జాషు వా జీవిత విశేషాలు మరియు తెలుగు సాహిత్యంలో జాషువా విశిష్టత గురించి మహా కవి కత్తి పద్మారావు ఉపన్యాసం చేస్తారని నిర్వాహకులు తెలిపారు ఈ సదస్సుకు అందరూ తప్పనిసరిగా విచ్చేసి ఉపన్యాసాన్ని విని, మన కాలపు జాషువా గా కత్తి పద్మారావుకి ఇవ్వబోతున్న పురస్కార ప్రధానోత్సవాన్ని ఆద్యంతము తిలకించాల్సిందిగా విన్నవించుకుంటున్నాం. ఈ సందర్భంగా ఏర్పాటు చేయబడిన విందును అందరూ స్వీకరించి వెళ్లవలసిందిగా కోరుతున్నామని లోకాయత పబ్లికేషన్ కోఆర్డినేటర్ కత్తి చేతన్ల ఎడిటోరియల్ బోర్డు మెంబెర్ లు డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్,గడ్డం విజయ రావు,శిఖా ఆకాష్ తెలిపారు.

## డాక్టర్ ఎన్.టి.ఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమం




బాపట్ల ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) : బాపట్ల ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విమల బీర పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. సర్దార్ బేగ్ అధ్యక్షత వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం సర్దార్ బేగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా స్వచ్ఛత, సమాజ సేవ యొక్క సంస్కృతిని పెంపొందించడంలో వాలంటీర్ల యొక్క కీలక పాత్రను నొక్కిచెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కొందరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారుల మార్గ దర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజానికి సేవ చేయడానికి, పరిశుభ్రత పై అవగాహన పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలలో పాల్గొంటారనీ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ అధికా రులు డాక్టర్ బ్లేస్సి సాగర్ కళాశాల ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేపించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలం టీర్లు కళాశాల భవనం పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బోధనా బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు కిలాని దుర్గారావు కుటుంబానికి ఆర్థికసాయం



విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 18, (ఆంధ్రపత్రిక) : ఇటీవల వరద ముంపు ప్రాంతాల్లో వరద సహాయక చర్యలు చేపడుతూ గుండెపోటుకి గురైన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కిలాని దుర్గారావు అకాల మరణానికి చింతిస్తూ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆదేశాల మేరకు 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పశ్చిమ నియోజకవర్గ టిఎన్టియుసి గౌరవాధ్యక్షు లు కాండ్రేగుల రవీంద్ర చేతుల మీదగా వారి కుటుంబ సభ్యులకి అందజేయడం జరిగింది.బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం 44 వ డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, తెలుగుదేశం సీనియర్ నాయకులు కామా దేవరాజ్, పునుగుపాటి చిన్న సుబ్బయ్య, పత్తి నాగేశ్వరరావు, రేగళ్ల లక్ష్మణరావు, పల్లంటి గంగాధర్, గంగాధర్ రెడ్డి, బడుగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక కేసును చెదించిన పోలీసులకు ప్రశంస పత్రం



నూజివీడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక ): ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో పల్లెరముడి గ్రామంలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పూనుకున్న వ్యక్తిని అతి తక్కువ కాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయి యొక్క ఆచూకీ తెలిసుకొని అతనిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచిన ఇంచార్జ్ నూజివీడు డిఎస్పి డి శ్రావణ్ కుమార్, నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ నిడమర్రు ఇన్స్పెక్టర్ ఎం సుభాష్ లను ప్రశంసా పత్రములను అందించి అభినందించిన రాష్ట్ర డిజిపి సదరు మైనర్ బాలిక కు ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కే రామకృష్ణ నూజివీడు రూరల్ ఎస్సైలు సురేంద్ర వాసు మల్లికార్జున రెడ్డి వారు అందరూ కలిసి లక్ష రూపాయలు బాధిత మహిళ తల్లిదండ్రులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారకా తిరుమల రావ యొక్క చేతుల మీదుగా బాధ్యత బాలిక తల్లిదండ్రులకు అంద చేసినారు.

## స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

### ఏఐటీయూసీ డిమాండ్



నూజివీడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక ): స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఆర్డీవో భవాని శంకరి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది,, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించిఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో స్వచ్ఛభారత్ కార్మికులు ( క్లాప్ మిత్రాలు ) పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని , మున్సిపాలిటీలతో సమానంగా స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు పెంచాలని, వీరికి కనీస వేతన చట్టం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, వీరికి పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, మెడికల్ఇన్సూరెన్స్, బీమా సౌకర్యం కల్పించాలి, వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలి, వీరికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెడికల్ అలవెన్స్ ఇవ్వాలి, గ్రామపంచాయతీలలో జనాభాకు తగ్గట్లుగా స్వచ్ఛభారత్ కార్మికులను నియమించాలి, వీరికి షూస్, మాస్కులు, క్రోకో నట్ అయిల్, మాస్కులు ఇవ్వాలి, ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికు బర్రె శ్రీనివాసరావు, ముల్లంగి రాంబాబు, తుళ్ళిమెళ్ళ ఏసుబాబు, యోబు, తిరుపతిరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగునాడు ప్రజాసమితి వారు వరద బాధితులకు ఆర్థిక సహాయం



గుంటూరు , సెప్టెంబర్ 18( ఆంధ్రపత్రిక ): గుంటూరులోని తెలుగు నాడు ప్రజా సమితి కాలనీ అసో సియేషన్ వారు ఇటీవల సంభవించిన అకాల వర్షాలకు ఇల్లు మునిగిపోయి అనాథలు గా మారిన వారికి సహాయం చేయుట కొరకు గుంటూరులోని మల్లికార్జునపురం కాలనీ టీచర్స్ కాలనీ అన్నపూర్ణ నగర్ వెంకటేశ్వర కాలనీల లో వసూలు చేసిన లక్ష ఇరువది వేల రూపాయల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రివర్యులు డాక్టర్ మాకినేని పెద్ద రత్తయ్య ద్వారా అందజేయుటకు గాను వారికి అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు నాడు ప్రజా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా జోషి ప్రధా న కార్యదర్శి గాలి పూర్ణ మల్లికార్జున రావు కోశాధికారి కావూరి రమేష్ వాసిరెడ్డి కోటేశ్వరరావు తోకల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీయే కార్యాలయంలో ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

## కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సుజనాచౌదరి



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 18, (ఆంధ్రపత్రిక) :** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రిభవానిపురంలోని ఎన్డీయే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి స్థానిక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో కూటమి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా మాట్లాడుతూ మోదీ 74వ జన్మదినోత్సవం సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, అగ్రరాజ్యంగా ఎదుగుతుందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో 35 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని 77 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ప్రపంచ దేశాలలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టింది ప్రధాని మోదీ మాత్రమే నని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన అరాచకాలు పోయి మంచి రోజులు వచ్చాయన్నారు. మోడీ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో పయనిస్తుందని అన్నారు. మోడీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ భారత్‌ను శక్తివంతమైన దేశంగా మార్చడానికి నిరంతరం ప్రయత్నిస్తున్న ప్రధాని మోదీని దేశ ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. సూర్యారావు పేటలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శివమకుటం ఆధ్వర్యంలో మోడీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో బిజెపి స్టేట్ జోనల్ సెక్రెటరీ బిట్రా శివన్నారాయణ, మీడియా సెల్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, శివమకుటం, షేక్ బాజీ, ఎమ్మెస్ బేగ్ ,పైలా సోమినాయుడు, బిఎస్‌కె. పట్నాయక్, బోగవల్లి శ్రీధర్, అవ్వారు బుల్లబ్బాయి, పచ్చిపులుసుల ప్రసాద్, వడ్లాని మాధవరావు, నున్నా కృష్ణ, దాడి అప్పారావు, గుడివాడ నరేంద్ర రాఘవ, బాడిత శంకర్, కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరద బాధితులకు చంద్రబాబు సేవలు ఆదర్శప్రాయం

## సీఎం చిత్రపటానికి పూలాభిషేకం చేసిన బుద్దా వెంకన్న



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 18, (ఆంధ్రపత్రిక) :** విపత్తులో వరద బాధితులను ఆదుకోవడం లో చంద్రబాబు సేవలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కొనియాడారు. బుధవారవం వెంకన్న కార్యాలయం లో చంద్రబాబు చిత్రపటానికి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, వరద బాధితులచే పూలాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతు వరద బాధితులకు 25 వేల రూపాయలు చంద్రబాబు సాయం అందిస్తున్నారని, దేశంలో ఎక్కడా ఈ తరహాలో సాయం అందించిన సిఎం ఎవరూ లేరని అన్నారు. జగన్ వరద రాజకీయం చేయడానికి నవ్వుతూ వచ్చి ప్రజల్లో నవ్వుల పాలయ్యాడని విమర్శించారు. జగన్ ప్రకటించిన కోటి రూపాయలు జగన్ ఎవరికి ఇచ్చాడో చెప్పాలని ఎద్దేవాచేసారు. విపత్తుల్లో ప్రజలను ఆదుకోక పోగా జగన్ కుట్రలు చేశారని అన్నారు. చంద్రబాబుకు పుష్పాభిషేకాలు, పాలాభిషేకాలు ప్రజలే స్వచ్ఛందంగా చేస్తున్నారని చెప్పారు. ముంబై నటి జెత్వానీని ముగ్గురు ఐపియస్ అధికారులు చిత్ర హింసలు పెట్టారని, జగన్ ఆదేశాలను పియస్.ఆర్ ఆంజనేయులు అమలు చేశారని,అతని ద్వారా రాణా, విశాల్ గున్నీ దుర్మార్గంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేసారు.విశాల్ గున్నీ రిపోర్ట్ ఆధారంగా పిఎస్‌ఆర్ ఆంజనేయులును అరెస్టు చేసి పోలిస్ కస్టడీలోకి తీసుకోవాలని,అతన్ని విచారిస్తే అనేక వాస్తవాలు బయటకి వస్తాయని, సిఎంఓ లో జగన్ పాత్ర కూడా వెలుగులోకి వస్తుందని అన్నారు.ప్రభుత్వం ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఉమ్మడి చంటి, తుపాకుల రమణమ్మ, బెవర లోకేష్,శివాజీ ముదిరాజ్, కొనికి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి వెళ్లి మిన్నేకల్లు వాసి మృతి



**సంతమాగులూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** మండలం లోని మిన్నేకల్లు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.గత రెండు రోజుల క్రితం వీర ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి వినా యకుని నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం శావల్యా పురం మండలం గంటవారిపాలెం వద్ద ఉన్నటువంటి మైనర్ కాలువ వద్దకు ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోవడం జరిగింది. బుధవారం తన అతని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు.

# హెచ్ పీ గ్యాస్ డీలర్ సుబ్బారావు మృతి



**బాపట్ల/ పొన్నూరు సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల , పొన్నూరు హెచ్ పి గ్యాస్ డీలర్, తిరు మల గ్యాస్ ఏజెన్సీ అధినేత గాదం శెట్టి సుబ్బారావు (గ్యాస్ సుబ్బారా వు (78) బుధవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు.సుబ్బారావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఆయనకు భార్య ,ఒక కుమార్తె ఉన్నారు.సుబ్బారావు 1969 వ సంవత్సరంలో హెచ్ పి గ్యాస్ డీలర్ గా వ్యాపారం ప్రారంభించా రు.బాపట్ల తో పాటు పొన్నూరు పట్టణం పరిసర ప్రాంతాల్లో హెచ్ పి డీలర్ గా సుబ్బారావు పేరు ప్రఖ్యాతలు గడించారు .అప్పటి నుంచి నేటి వరకు ఆయన గ్యాస్ వినియోగదారుల కు ఉత్తమ సేవలు అందిస్తూ వచ్చారు .సుబ్బారావు మరణ వార్త తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్,బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ సంతాపం ప్రకటించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు రాజకీయ,వ్యాపార రంగ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సుబ్బారావు అంతిమ యాత్ర గురువారం ఉదయం 9:30 లకు బాపట్ల లోని ఆయన స్వగృహము శ్రీ తిరుమల టవర్స్ ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# రోటరీ ఆధ్వర్యంలో హరి హర గోశాలకు పశు గ్రాసం వితరణ



**అద్దంకి, సెప్టెంబర్ 18(ఆంధ్రపత్రిక):** బుధవారం అద్దంకి వాసవి నగర్ లోని హరిహర గోశాలలో రోటరీ మిత్రుల సౌజన్యంతో గోవులకు ఇరవై వేల రూపాయలు విలువ చేసే పశుగ్రాసం పంపిణీ కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు మాట్లాడుతూ పురాతన కాలం నుంచి మన సమాజంలో మనిషికి పశువుకి అవినాభావ సంబంధం ఉన్నది పశువుల పెంపకం అనేది మన జీవన విధానంలో ఒక భాగం అని ప్రత్యేకంగా ఆవుకి ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని అటువంటి ఆవుల సంపదని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్న దని పేర్కొన్నారు గోశాలకు రోటరీ తరపున గతం లో కూడా తౌడుదాణా ఇచ్చామని ఈరోజు ట్రక్ వరిగడ్డి రోటరీమిత్రుల సౌజన్యంతో ఇస్తున్నామని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య తెలిపారు ఈకార్యక్రమంలో సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు మలాది శ్రీనివాసరావు సందిరెడ్డి శ్రీనివాసరావు సంకా సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .

# విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి ఎంఈఓ సుధాకర్



**అద్దంకి, సెప్టెంబర్ 18(ఆంధ్రపత్రిక):** ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో మండల విద్యాశాఖధికారి బి సుధాకర్ రావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని తెలి పారు అన్ని పాఠశాలలో 10 గంటలలోపు విద్యార్థుల హాజరు తప్పక నమోదు చేయాలన్నారు అధికారులు పాఠశాలను సందర్శించినపుడు పాఠశాల యొక్క అన్ని వివరాలు తెలిపే ప్రొఫైల్ చూపాలన్నారు రిజిస్టర్ నందు గల అందరు విద్యార్థులు పాఠశాలకు హాజరుగునట్లు ఉపాధ్యాయులు భాద్యత వహించాలన్నారు గత సంవత్సరం పాఠశా లలో చదివిన ఏ విద్యార్థి డ్రాపౌట్ గా మిగలకూడదన్నారు. తరగతిగదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శించి ఉండాలన్నార వారంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు మండల విద్యా శాఖధికారి గంగాధర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరు స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్ సైట్ లో గల టీచర్ రిసోర్స్ బుక్ ఉపయోగించుకొని విద్యార్థుల ప్రమాణాలు పెంచాలన్నారు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నకు సంబందించిన అన్ని రికార్డులు సంసిద్ధంగా ఉండాలన్నారు ఈ సమావేశంలో కాంప్లెక్స్ సెక్రటరీ శ్యామల రిసోర్స్ పర్సన్ ధనలక్ష్మి, పుణ్యవతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళలపై హింసలేని సమాజాన్ని నిర్మిద్దాం స్త్రీ లేనిదే సృష్టి లేదు

## గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు , సెప్టెంబర్ 18( ఆంధ్రపత్రిక ):** మహిళలపై హింస లేని సమాజ నిర్మాణానికై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. శ్రీ బాల గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వాహకులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలు స్త్రీలపై జరుగుతున్న హత్యాచారాలను ప్రతిబింబిస్తూ ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గళ్ళా మాధవి ముగ్గులను తిలకించి, ముగ్గులను వేసిన మహిళలను అభినందించారు. ఈ సందర్బంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదన్నారు. ఆకాశంలో సగం అంటూనే సమాజంలో మాత్రం మహిళలు వివక్షను ఎదురుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత ముందుకు సాగాలని గళ్ళా మాధవి ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, రామిశెట్టి శ్రీనివాస్ , కమిటీ సభ్యులు సాయి, కామేష్, లోకేష్, బాషా, బబ్లు, సలాం, ప్రసాద్, రామకృష్ణ, లక్ష్మణ్ భాష, వడ్డే సుబ్బారావు, దేవరశెట్టి శ్రీను, అభినయ్, రబ్బాని, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# యధావిధిగానే పాడి రైతుల సంక్షేమ కార్యక్రమాలు

## రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు భరోసా



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 18, (ఆంధ్రపత్రిక) :** ఆకస్మికముగా వచ్చిన విపత్తుల వల్ల పాడి రైతలకు ఇస్తున్న మెరు గైన పాలసేకరణ ధరకు కాని, వివిధ సంక్షేమ కార్యక్రమములలో కాని, ఇవ్వవలసిన బోనస్‌లో కాని ఎటువంటి భంగం వాటిల్లదని బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సమితి పాడి రైతుల అందరికి చైర్మన్ చలసాని ఆంజనేయులు భరోసానిచ్చా రు. విజయవాడ ఫ్యాక్టరీ ఆవరణ లో 33వ సర్వ సభ్య సమా వేశం చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరం 2023 2024 లో టర్నోవర్ 1200 కోట్లు అని గత సంవత్సరంతో పోలిస్తే 9 శాతం వృద్ధి సాదించామని, అదే విధంగా పాల సేకరణలో 4 శాతం వృద్ధి సాధించామని చెప్పారు. గతములో అనగా 1996 లో సమితి సంక్షోభంలో ఉన్నప్పుడు సమితి సిబ్బంది స్వచ్ఛంద పదవీ విరమణకై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 4.16 కోట్ల గ్రాంటును ఇచ్చారని, ఎన్‌డిడిబి వారు ఇచ్చిన 4.16 కోట్ల ఋణముకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము తరుపును హామీ ఇచ్చి సమితిని ఆదుకున్నారని చెప్పారు.

అదే విధముగా ఈ వరద ముంపు విపత్తులో సమితి భవిష్యత్తు తగిన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు హామీ ఇచ్చారని చెప్పారు. ఇటీవల వరదలకు సమితి స్టాఫ్ క్వార్టర్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్లు మునిగి పూర్తిగా నష్టపోయిన సుమారు 36 సమితి సిబ్బంది కుటుంబాలకు రూ 17 లక్షలను సమితి సిబ్బంది , పాలకవర్గం వారు విరాళముగా సర్వసభ్య సమావేశ ములో అందించారు.

ఈ కార్యక్రమములో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, సమితి పాలకవర్గ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, ఫీడ్ కమిటీ సభ్యులు, సంఘ అధ్యక్షులు, సమితి అధికారులు, సమితి సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నవరపు బ్రహ్మయ్య 'ప్రథమ చికిత్సక్' పుస్తకావిష్కరణ



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 18, (ఆంధ్రపత్రిక) :** సమాజంలో గొప్ప వారిగా గుర్తింపు పొందిన చాలామంది పేదరికం నుండి ఉన్నత స్థాయికి చేరుకున్నారని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్నాథ్ ఠాగూర్ వ్యాఖ్యానించారు . బుధవారం బెంగళూరులోని రాష్ట్ర ప్రభుత్వం కుమారకృప స్టేట్ గెస్ట్‌హౌస్ లో బీసీ వర్గీయుల గెట్ టుగెదర్ కార్యక్రమంలో విజయవాడకు చెందిన సీనియర్ పాత్రికేయులు అన్నవరపు బ్రహ్మయ్య రాసిన తొలి వైద్యులు పుస్తకం హిందీ అనువాదం "ప్రథమ చికిత్సక్ " అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు . లాల్ బహుదూర్ శాస్త్రి ,కర్పూర ఠాగూర్ వంటి వారే కాకుండా ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కూడా పేదరికం నుండి ఉన్నత స్థాయి చేరుకున్న వారిని చెప్పారు . వెనుకబడినతనాన్ని అధిగమించటానికి చదువు ఒకటే మార్గం అని ఆయన అన్నారు . వెనుకబడిన తరగతులు వారు సమైక్యంగా అభివృద్ధి , అభివృద్ధి చెందినవారు వెనుకబడిన వారికి చేయూతనివ్వాలని ఆయన అన్నారు. బెంగళూరు సవిత సమాజానికి చెందిన శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత అన్నవరపు బ్రహ్మయ్య తో పాటు సవిత సమాజానికి చెందిన రాజన్ , రమణ , ఆంధ్రప్రదేశ్ కి చెందిన బీసీ నేతలు మల్కాపురం కనకారావు , తుళ్లూరు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు .

# డ్రైన్ల పై, రోడ్ల మీద ఆక్రమణలను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే తొలగిస్తాం

## నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు , సెప్టెంబర్ 18( ఆంధ్రపత్రిక ):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో డ్రైన్ల పై, రోడ్ల మీద ఆక్రమణలను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణం తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం లాలాపేట, పట్నం బజార్ లోని పలు ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల మీద ఉన్న ఆక్రమణలను డిసిపి శ్రీనివాసరావు, ఏసిపి అజయ్ కుమార్, టిపిఎస్ సువర్ణ కుమార్ లు అక్రమ ఆక్రమణ దళంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్ల పై ఆక్రమణల వలన వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేయడానికి కూడా డ్రైన్ లో పారుదల లేక సాధ్యం కావడంలేదన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా డ్రైన్ల ఆక్రమణలను వార్డ్ సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అలాగే ట్రాఫిక్ కి ఆటంకం కల్గించే విధంగా ఉన్న రోడ్లపై ఆక్రమణలను కూడా తొలగిస్తామన్నారు. నగర ప్రజలు కూడా ప్రధాన డ్రైన్ల వివిధ వ్యాపారాల పేరుతొ ఆక్రమణ చేసుకోవద్దని, తప్పనిసరిగా డ్రైన్ కి వెనుక వైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రైన్ల మీద, డ్రైన్ కి ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగించడం జరుగుతుందన్నారు.

# మానవసేవయే మాధవసేవ

## కొమ్మాలపాటి శ్రీనివాస్ మానవతా చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్



**గుంటూరు , సెప్టెంబర్ 18( ఆంధ్రపత్రిక ):** స్థానిక వెంగళరావు నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలిక ఉన్నత పాఠశాల నందు మానవతా సంస్థ తరఫున నేడు విద్యార్థులకు విలువైన ఆట వస్తువులను బహుమతిగా అందించడం జరిగినది. ఈ సందర్భంగా మానవతా ట్రస్ట్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత్వం మా ధ్యేయం మానవసేవయే మాధవ సేవ అని నమ్మి ఆపన్న హస్తము అందించుటకు మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని అందులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థలో ఉన్నటువంటి ఈ వెంగళరావు నగర్ బాలిక ఉన్నత పాఠశాలలో పిల్లల మనోవికాసానికి తోడ్పడేటువంటి ఆటలు ఆడుకోవడానికి తగిన పరికరాలను మా సంస్థ ప్రతినిధి ఆర్ భాస్కర్ తల్లిదండ్రులజ్ఞాపకార్థం కీర్తిశేషులు రెడ్డి చర్ల నాగభూషణం నందిపాటి జయమ్మ బహుమతిగా హెచ్‌ఎంటి రమేష్ కి అందించడం జరిగినది.

ఇదే కాకుండా పాఠశాలకు సంబంధించి వివిధ రకాల సహాయ సహకారాలను అందించుటకు మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇవ్వడం జరిగినది. ఈ సమావేశంలో పాఠశాల విద్యా కమిటీ చైర్పర్సన్ వీర్ల త్రివేణి, వైస్ చైర్మన్ జంగం యెహెూషువ, మరియు మానవత సెక్రటరీ కే సతీష్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, గురువా రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పి సుధాకర్, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, శివాజీ తదితరుల పాల్గొన్నారు. ఆట వస్తువులు బహుకరించిన భాస్కర్ మాట్లాడుతూ తన తల్లి కూడా మున్సిపల్ కార్పొరేషన్ శారదా కాలనీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా చేసి రిటైర్ అయి ఈరోజు స్వర్గస్తులయ్యారని ఆ సందర్భంగా వారికి జ్ఞాపకార్థం ఈ పాఠశాల విద్యార్థులకు నా వంతుగా సహకరించాలని నిర్ణయించుకున్నానని ఇలాగే భవిష్యత్తులో మున్సిపల్ విద్యార్థులకు తప్పక సహకరించగలరని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పి .రమేష్ మాట్లాడుతూ ఈ పాఠశాల లోని పేద విద్యార్థులకు మానవతా సంస్థ ద్వారా మేలు జరుగుతుందని ఇలాగే సమాజంలో అందరూ కూడా మానవీయ కోణంలో వారి నిరుపేద సహోదరులకు సహాయం చేసి ఒకరికొకరు మానవత్వాన్ని చాటుకోవాలని ఉండాలని తెలియ చేస్తూ ఈ పాఠశాలకు విద్యార్థులకు ఆట వస్తువులు బహుకరించిన భాస్కర్ ని ప్రోత్సహించి మానవతా సంస్థ సభ్యులుగా ఉండేలా చేసిన మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఈ పంట నమోదు తోనే ప్రభుత్వ పథకాల లబ్ధి: ఏవో



**వేటపాలెం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** పంట సాగు చేసే ప్రతి రైతు బాధ్యతగా ఈ పంట నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వేటపాలెం వ్యవసాయ అధికారి ఐ కాశీ విశ్వనాథ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాయిపేట పరిధిలోని వరి పంట క్షేత్రాన్ని పరిశీలించి పొలంబడి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ పంట నమోదు వల్ల ఉచిత పంట బీమా, వరి కొనుగోలు, పంట ధాన్యం సేకరణ ప్రక్రియ, పంట నమోదుకు విస్తీర్ణ గణాంకం, పంట కోత ప్రయోగాలకు ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. ఖరీఫ్ 2024 పంట నమోదు కార్యక్రమం జరుగు తుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న ఈ పంట, ఈ కెవైసీ నిర్వహిస్తారని, 25 నుండి 29 వరకు సామాజిక తనిఖీ జరుగుతుందని, 30న తుది జాబితా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు. అలాగే రైతు సేవ కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందించుటకు ప్రభుత్వం తెగులు వ్యాధుల నిఘా వ్యవస్థ, పంట జీవిత వ్యవస్థల పై విఏఏ లకు, రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఈనెల 24న జరిగే పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం పై రైతులకు అవగాహన కల్పించాలని విఏఏలకు తెలియజే యడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విఏఏలు మనీషా, కావ్య, రూఫియా, సునీల్, రైతులు పాల్గొన్నారు.

# వైసిపికి బాలినేని రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అధినేత వైఎస్ జగన్‌కు రాజీనామా లేఖను మెయిల్ చేశారు. జగన్ విధానాలు నచ్చకే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడారు. కొన్ని రోజులుగా వైకాపా అధిష్ఠానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నాను. గురువారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవ బోతున్నాను. ఆ పార్టీలో చేరబోతున్నాన ని బాలినేని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి పార్టీ తీరుపై బాలినేని అసం తృప్తితో ఉన్నారు. ఇటీవల అధినేత జగన్ మోహన్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఆ భేటీ తర్వాత కూడా అసంతృప్తితో ఉన్నారు. వైసీపీని వీడాలని నిర్ణయం తీసుకున్నారు. జనసేన అధినేత, ఏపీ డిప్యూ టీ సీఎం పవన్ కల్యాణ్‌తో బాలినేని శ్రీనివాస రెడ్డి గురువారం సమావేశం కానున్నారు. ఆ భేటీ తర్వాత జనసేన పార్టీలో చేరికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వైసీపీ అధినేత జగన్‌తో బాలినేని శ్రీనివాస రెడ్డికి సాన్నిహిత్యం ఉంది. వైసీపీ ముఖ్యనేత వైవీ సుబ్బారెడ్డి సోదరిని బాలినేని వివాహం చేసుకు న్నారు. దివంగత వైఎస్ఆర్, జగన్ మోహన్ రెడ్డికి బాలినేని బంధువు కూడా అవుతారు. ఒంగోలు అసెంబ్లీ నుంచి బాలినేని 1999, 2004, 2009, 2012లో నాలుగుసార్లు పోటీ చేసి గెలుపొం దారు. 2012లో బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి, వైసీపీలో చేరారు. 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి దామచర్ల జనార్ధన రావు చేతిలో ఓడిపోయారు. 2019లో మాత్రం టీడీపీకి అభ్యర్థి జనార్ధన రావును ఓడించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ వెంటనే బాలినేని శ్రీనివాస రెడ్డికి మంత్రి పదవి దక్కింది. రెండేళ్లు అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా పనిచే శారు. 2023లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ సమయంలో బాలినేని మంత్రి పదవి పోయింది. అప్పటి నుంచి పార్టీతో అంటీముట్టనట్టుగానే వ్యవహ రిస్తున్నారు. బాహాటంగానే విమర్శలు చేశారు. బాలినేనితో వైసీపీ పెద్దలు పలుమార్లు చర్చలు జరిపారు. అయినప్పటికీ నో యూజ్. చివరికి పార్టీని వీడారు. వాస్తవానికి గత ఎన్నికల సమయంలోనే బాలినేని పార్టీ వీడతారనే ప్రచారం జరిగింది.

# కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓటర్లను ఉద్దేశించి పోస్టు చేశారు. 'దేశ చరిత్రలో తొలిసారి జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను తొలగించి.. దాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. ఇది మీ అందరి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే. ఇది జమ్మూకాశ్మీర్‌ను అవమానించడమే' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. సందర్భంగా 'మీ ప్రతి ఓటు ఇండియా బ్లాక్‌కు వేస్తే.. అది మీ హక్కులను పునరుద్ధరిస్తుంది. ఉపాధి అవకాశాల్ని కల్పిస్తుంది. మహిళలను బలపరుస్తుంది. స్త్రీలను చీకటి యుగం నుండి బయటకు తెస్తుంది. జమ్మూకాశ్మీర్‌ని మళ్లీ సుసంపన్నం చేస్తుంది. అందుకే ఈరోజు ఇళ్లనుంచి బయటకు వచ్చి మీ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోండి. 'ఇండియా'కు ఓటు వేయండి' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీన ఇక్కడ పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, సిపిఐ(ఎం), పాంథరిన్ పార్టీ కలిసి పోటీ చేస్తున్నాయి. ఇక పిడిపి, బిజెపి, ఇతర పార్టీలు ఎన్నికల్లో తలపడనున్నాయి.

# మరోమారు కోవిడ్ పంజా

(మొదటిపేజీ తరువాయి)

విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఎక్స్‌ఈసీ వేరియంట్‌ను తొలి సారి యూరప్‌లో గుర్తించారని తెలిపారు. అనంతరం ఈ వేరియంట్ యూకే, యూఎస్, డెన్మార్క్‌తోపాటు ఇతర దేశాలకు సైతం విస్తరించిందని పేర్కొన్నారు. ఇది రెండు ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ నుంచి ఎక్స్‌ఈసీ హైబ్రిడ్ రకంగా అవిర్భవించిందని వివరించారు. శీతాకాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. తద్వారా ఆసుపత్రిలో చేరడం కానీ, అనారోగ్యం బారిన పడడం కాని ఉండదని చెప్పారు. ఇప్పటికే 27 దేశాల నుంచి 500 శాంపిల్స్ సేకరించగా.. ఆ నమూనాల్లో ఎక్స్‌ఈసీ వేరియంట్ గుర్తించినట్లు వెల్లడించారు. డెన్మార్క్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్‌లలో ఈ ఎక్స్‌ఈసీ బలంగా పెరుగుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. జ్వరం, గొంతు మంట, దగ్గు, వాసన తెలియక పోవడం, ఆకలి లేకపోవడం, ఒంటి నొప్పులు ద్వారా కొత్త రకం కోవిడ్ ఎక్స్‌ఈసీ లక్షణాలను గుర్తించ వచ్చన్నారు. పరిశ్రుభతను పాటించడం తోపాటు స్వచ్ఛమైన గాలిని పీల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన (సీడీసీ) ఈ సందర్భంగా సూచించింది.

# కేంద్రం మరో సంచలనం

(మొదటిపేజీ తరువాయి)

శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు అమలుచేసి చూపుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టంచేశారు. గతనెల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఏటా ఏదోఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగు తున్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీని నుంచి బయట పడాలంటే జమిలి ఎన్నికలే పరిష్కారమని అన్నారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకురావాలని పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే కోవింద్ కమిటీని వేసి నివేదకి రూపొందించారు. దీనిని ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ బుధ వారం మధ్యాహ్నం ఆమోదించింది. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టనుంది. కేంద్ర సర్కార్ వన్ నేషన్ – వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం రామ్‌నాథ్ కోవింద్ సహా 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కమిటీ సభ్యులతో రామ్‌నాథ్ కోవింద్ చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రా యాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది. సుదీర్ఘ చర్చోపచర్చల అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. జమిలీ ఎన్నికల ప్రతిపాదన 1980లో వచ్చింది. జస్టిస్ బీపీ జీవన్ రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ మే 1999లో తన 170వ నివేదికలో లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగాలని అభిప్రాయపడింది. అందుకు తగినట్లే కేంద్రంలోని బీజేపీ సర్కార్ అధ్యయనానికి కమిటీ వేసి.. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను తీసుకుంది. అంతా సానుకూలంగా తమ అభిప్రాయాలు వెల్లడించినట్లు సమాచారం. ఇకపోతే జమిలితో తరచూ ఎన్నికల నివారణతో పాటు, దేశంపై అధిక ఖర్చుల భారం తప్పనుంది.

# ఇంకా విచారణ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

తిరుమలరావు తెలిపారు. ఏలూరులో మీడియాతో ఆయన మాట్లాడారు. పోలీసుశాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పోలీసులు ధైర్యంగా పనిచేసేలా సంసిద్ధం చేస్తున్నామని చెప్పారు."పోలీసుల సంక్షేమం కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టాం. పోలీస్ క్యాంటీన్ల వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.4.7 కోట్లు ఇచ్చాం. ఎస్‌హెచ్‌వోలకు ఇన్వెస్టిగేషన్ ఛార్జీలు రాలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. లైంగిక దాడులను నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముంబయి నటి కేసులో ప్రాథమిక విచారణ పూర్తయింది. ఇంకా లోతైన విచారణ జరగాల్సి ఉంది"అని డీజీపీ తెలిపారు.

# రైతులకు శుభవార్త

**అమరావతి,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక)**: ఏపీలో వరద బాధితులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యానవన పంటలకు జరిగిన నష్టపరిహారంలో భాగంగా 5 కోట్ల 78 లక్షల 18 వేల రూపాయలను విడుదల చేశారు. వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో చాలా మేరకు రహదారులు ధ్వంసమయ్యాయి. ఈ దెబ్బతిన్న రాష్ట్ర హైవేలకు ప్యాచ్ వర్క్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. రూ. 290.40 కోట్లు నిధులు విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

# పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి

(మొదటిపేజీ తరువాయి)

వాత్సల్య ఖాతాను ఆన్‌లైన్‌లో లేదా బ్యాంక్ శాఖను లేదా పోస్టాఫీసులో ప్రారంభించొచ్చు. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాలో కనీసం రూ.1000 మదుపు చేయొచ్చు. ఎన్‌పీఎస్ విత్‌డ్రాలకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ప్రతిఫలం అందుకోవాలనుకునేవారు ఎన్‌పీఎస్ ఖాతాను ఎంచుకోవచ్చని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో 1.86 కోట్ల మంది ఎంపిక చేసుకున్నారని, వారి మదుపు విలువ రూ.13 లక్షల కోట్లుగా ఉందని పేర్కొన్నారు. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులు ఈక్విటీలో 14 శాతం, కార్పొరేట్ డెట్‌లో 9.1 శాతం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో 8.8 శాతం చొప్పున ప్రతిఫలం ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌పీఎస్ ఖాతాకు వాత్సల్య అదనం. చిన్నారుల పేరు మీద ఎవరైనా ఖాతా తెరిస్తే వారికి 18 ఏళ్లు వచ్చాక సాధారణ ఖాతాగా మారుతుంది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకులు ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని ప్రారంభించాయి. పథకం ప్రారంభం సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ కొందరు చిన్నారుల పేరు మీద వాత్సల్య ఖాతాలను ప్రారంభించింది. తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వాత్సల్య స్కీమ్‌లో ఎప్పటికప్పుడు మార్పులు చేపడతామని ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు మద్దిరాల ఈ సందర్భంగా తెలిపారు.

# నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి)



ప్రకటించిన వరద సాయం ప్యాకేజీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రిమండలి సమావేశంలో తీర్మానం చేశారు. బీసీలకు రిజర్వేషన్లపై కేంద్రానికి చంద్రబాబు కేబినెట్ సిఫార్సు చేసింది. బీసీలకు రిజర్వేషన్ల తీర్మానంపై చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సుదీర్ఘంగా సాగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. సగటు మద్యం ధర రూ.99 నుంచి అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై కేబినెట్ సమావేశంలో చర్చించారు. గతేడాది ఆగస్టులోనే వాలంటీర్ల కాలపరిమితి ముగిసిందని అధికారులు తెలిపారు. ఏడాది క్రితమే వాలంటీర్లను జగన్ తొలగించారని.. 2023లో వాలంటీర్ల పదవీకాలం ముగిసినా రెన్యువల్ చేయలేదని మంత్రులు పేర్కొన్నారు. తప్పుడు విధానాలు.. దొంగ పద్ధతుల్లోనే జగన్ పాలన సాగించారని పలువురు మంత్రులు వ్యాఖ్యానించారు. వాలంటీర్ల పునరుద్ధరణపై మరింత సమాచారం తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వంలో సాక్షి పత్రిక కొనుగోళ్ల పేరిట జరిగిన అవకతవకలపై కేబినెట్‌లో చర్చ జరిగింది. రెండేళ్లలోనే సాక్షి పత్రిక కొనుగోళ్ల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి రూ.205 కోట్లు ఖర్చు చేశారని మంత్రులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సాక్షికి జరిపిన చెల్లింపులపై విచారణకు సీఎం ఆదేశించారు. వాలంటీర్లు, సచివాలయాలకు దిన పత్రికల కొనుగోలుకు నెలనెలా ఇచ్చే రూ.200 రద్దు చేశారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం సీడబ్ల్యూసీ సూచనల మేరకు పాత ఏజెన్సీకే ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఒకే ఏజెన్సీకే పనులు కేటాయించడం వల్ల తదనంతరం ఏమైనా సమస్యలు తలెత్తినా ఏజెన్సీ బాధ్యత ఉంటుందని మంత్రివర్గం అభిప్రాయపడింది. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ 'స్టెమీ' పథకం ప్రారంభం కానుంది. ఆధార్ తరహాలో విద్యార్థులకు 'అపార్' గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. హోంశాఖలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటు.. కొత్త కార్పొరేషన్‌కు రూ.10 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వనున్నారు. గత ప్రభుత్వం సాక్షి పత్రిక కొనుగోళ్లల్లో చేసిన అవకతవకలపైనా కేబినెట్‌లో చర్చ జరిగింది. రెండేళ్లల్లోనే సాక్షి పత్రిక కొనుగోళ్ల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి రూ. 205 కోట్లు ఖర్చు చేశారని మంత్రిమండలి సమావేశంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాక్షికి జరిపిన చెల్లింపులపై విచారణకు ఆదేశిద్దామని ముఖ్యమంత్రి చెప్పారు. సాక్షి పత్రిక సర్క్యులేషన్ ఎంతుంది..ఏ నిబంధనల ప్రకారం సాక్షి పత్రిక కొనుగోళ్లకు నిధులు కేటాయించారనే దానిపైనా ఎంక్వైరీ వేయాలని పలువురు మంత్రులు పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరికీ విజన్ డాక్యుమెంట్ ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఇవ్వలేని పరిస్థితి. అయినా ధైర్యంతో ముందు కెళ్తున్నాం. వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం అభివృద్ధి చెందదు. కేంద్ర సహాయం వెంటిలేటర్‌పై ఉన్న వ్యక్తికి ఆక్సిజన్ లాంటిది. మూడు పార్టీల సమష్టి కృషితోనే ఇంతటి ఘన విజయం సాధించాం. నా జీవితంలో ఎన్నడూ చూడని విజయమిది. 151 సీట్లు ఉన్నాయని విర్రవీగిన వారు.. 11 సీట్లకే పరిమితమయ్యారు అదే ప్రజా స్వామ్యం అని చంద్రబాబు అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికుడు.. అనునిత్యం తనను ఆశ్చర్యపరుస్తూనే ఉంటారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉంద`న్నారు. వందరోజుల్లో చాలా హామీలు నెరవేర్చాం. పింఛన్ పెంచేందుకు ఖజానాలో డబ్బులు లేవు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లు పెంచాం. సంక్షేమంలో తిరుగులేని చరిత్ర సృష్టించాం. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సరైన సమయానికి వచ్చేవి కావు. నిర్జీవమవుతున్న పంచాయతీలకు సీఎం రూ.1,452 కోట్లు ఇచ్చారు. వైకాపా సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు ఇస్తాం. అన్న క్యాంటీన్ల వల్ల పేదలు, కార్మికులకు లాభం జరుగుతుంది. గత ప్రభుత్వానికి అన్న క్యాంటీన్లను ఎలా మూసివేయాలని పించింది? ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసి పేదల భూములను రక్షించిన సీఎంకు కృతజ్ఞతలు. చంద్రబాబు ఓపిక నన్ను ఆశ్చర్యపరుస్తుంది. పాతికేళ్ల యువకుడు కూడా చంద్రబాబులా కష్టపడలేరు. సీఎం బురదలో దిగి నడుస్తుంటే.. వైకాపా విమర్శలు చేస్తుంది. ఆయన చేసే మంచి పనులను గుర్తించి అండగా ఉంటాం అని పవన్ కల్యాణ్ అన్నారు. సీఎం చంద్రబాబుపైఅక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచినప్పుడు షూటింగ్‌లకు వెళ్లలేదని పవన్ కల్యాణ్ తెలిపారు. చంద్రబాబుకు అపారమైన అనుభవం ఉందని.. ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఏనాడూ ఆయన కళ్లలో భయం కనిపించలేదని అన్నారు. 'సమష్టి కృషితో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించాం. మొదటి నుంచి 160 స్థానాలు గెలవాలని చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. చంద్రబాబులో భయం లేదు. అపారమైన అనుభవం ఉంది. బాబు తన జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు.. చంద్రబాబు కుటుంబ సభ్యుల్ని అవమానపరిచారు. కేబినెట్లో తీసుకున్న నిర్ణయాలకు ఆయన్ని బలి చేశారు. రాజమండ్రి జైల్లో కలిసినప్పుడు ఆయన గుండె ధైర్యాన్ని చూశా. బాబులో ఆత్మస్థైర్యం ఏనాడూ దెబ్బతినలేదు. పాలన ఎలా ఉండాలో బాబు పక్కనే ఉండి నేర్చుకోవాలనుకున్నా. జైల్లో ఉన్నప్పుడు నేను సినిమా షూటింగులకు కూడా వెళ్లలేదు. షూటింగ్‌కు రావాలని ప్రొడ్యూసర్లు అడిగినా నేను రానని చెప్పా. విభజన కాలం నుంచి జగన్ పాలన వరకు రాష్ట్రం నలిగిపోతూనే ఉంది. చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది' అని పవన్ తెలిపారు.

# దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకం

## - వరద బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలిచాం

## - సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో మహిళలకు ఎన్డీయే ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి పండుగ సందర్భంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇదే విషయాన్ని ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మహాశక్తి పథకం కింద పేదలకు ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్దిదారులకు.. ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ప్రభుత్వం అందించనుంది. దీపావళికి ఉచిత గ్యాస్ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సంక్షేమ పథకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తానని స్పష్టం చేశారు. 'వరదల్లో ప్రజలు పడిన కష్టాలు చూసి నేను చలించిపోయాను. పది రోజులపాటు అక్కడ ఉండి సాధారణ పరిస్థితి నెలకొన్న తర్వాత వెళ్ళాను. ప్రపంచవ్యాప్తంగా వరద బాధితులను ఆదుకునేందుకు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చారు . సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు సర్వశక్తులు ఒడ్డాం. వరదల్లో నష్టపోయిన వారందరినీ అన్ని విధాలుగా ఆదుకుంటున్నాం. వరదల్లో దెబ్బతిన్న వారికి 45 ఏళ్లలో నేనెప్పుడూ ఇంత ప్యాకేజీ ఇవ్వలేదు. పంటలకు హెక్టార్‌కు రూ.25 వేలు ఇస్తున్నాం. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికి సహాయం అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం.

# జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు

## బీజేపీపై ఖర్గే ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 18 :** ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని కాంగ్రెస్ విమర్శించింది. జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ స్పందించింది. జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావని పేర్కొంది. కేంద్ర ప్రతిపాదనను అంగీకరించడానికి ఎవరూ సిద్ధపడరని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ' జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు. కేంద్రం ప్రతిపాదనను ఎవరు అంగీకరించరు. దేశంలోని సమస్యలను పక్కదారి పట్టించేందుకే జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నిక వస్తే అప్పుడు నిర్వహించాల్సిందే. జమిలి ఎన్నిక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడవదు. జమిలి ఎన్నికను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని ఖర్గే స్పష్టం చేశారు. అయితే.. ఆ పార్టీ విమర్శలపై బీజేపీ మండిపడుతోంది. కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ బుధవారం మధ్యాహ్నం ఆమోదించింది. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టనుంది. కేంద్ర సర్కార్ వన్ నేషన్ – వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం రామ్‌నాథ్ కోవింద్ సహా 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కమిటీ సభ్యులతో రామ్‌నాథ్ కోవింద్ చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రాయాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది. సుదీర్ఘ చర్చోపచర్చల అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కశ్మీర్‌లో ప్రశాంతంగా పోలింగ్..

(మొదటిపేజీ తరువాయి)

46శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. అన్ని చోట్లా ఓటింగ్ పక్రియ ప్రశాంతంగా జరిగిందన్న ఆయన.. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజక వర్గాలుండగా.. తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. 24 అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 23లక్షల మంది ఓటర్లు 219 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. సెప్టెంబరు 25 రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# నా హయాంలో భారత్‌లో బంధం బలోపేతం

**వాషింగ్టన్,సెప్టెంబరు 18 :** తాను దేశాధ్యక్షుడిగా ఉన్న హయాంలో ఇరు దేశాల మధ్య నెలకొన్న సంబంధాలు మరింత పటిష్టమయ్యాయని మాజీ అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. మరీ ముఖ్యంగా రక్షణ, వ్యూహాత్మక సహకార రంగాల్లో చోటు చేసుకున్న పురో గతిని ట్రంప్ ఈ సందర్భంగా వివరించారు. ఆ క్రమంలో చైనా ప్రభావాన్ని తగ్గించేందుకు తాము చేసిన ప్రయత్నాలను సైతం వివరించారు. వివిధ సందర్భాల్లో వాణిజ్య వివాదాలు నెలకొన్నప్పటకీ.. క్వాడ్ తరహా కార్యక్రమాల ద్వారా లోతైన భద్రతా సహ కారాన్ని పెంపొందించడంలో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం పటిష్టంగా ఉందని ట్రంప్ వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో యూఎస్ పర్యటనకు రానున్న భారత్ ప్రధాని నరేంద్ర మోదీతో భేటి కానున్నట్లు రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. మిచిగాన్‌లోని ఫ్లింట్ నగరంలో భారత్–అమెరికా సంబంధాలపై మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఒక అద్భుతమని ఆయన అభివర్ణించారు. వచ్చే వారం యూఎస్ వస్తున్న ఆయన తనను కలుస్తారని తెలిపారు. అయితే ప్రధాని మోదీతో తాను ఎక్కడ భేటీ అయ్యేది మాత్రం ట్రంప్ వివరించ లేదు. 2017 నుంచి 2021 మధ్య తాను అమెరికా అధ్యక్షుడిగా ఉన్నానని.. ఆ సమయంలో భారత్, అమెరికా సంబంధాలను డోనాల్డ్ ట్రంప్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అలాగే యూఎస్‌లోని హ్యూస్టన్‌లో భారత ప్రధాని 'హౌడీ మోడీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. గుజరాత్‌లో 'నమస్తే ట్రంప్' కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. మరోవైపు డెమోక్రటిక్ పార్టీ నాయకుడు, అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌తోపాటు అదే పార్టీకి చెందిన బరాక్ ఒబామాతో సైతం ప్రధాని మోదీ సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. గతేడాది అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్ష భవనం ఘన స్వాగతం పలికిన సంగతి తెలిసిందే. సెప్టంబర్ 21 నుంచి 23 వరకు భారత ప్రధాని అమెరికాలో పర్యటించనున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా డెలావేర్‌లో జరగనున్న క్వాడ్ సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఆ మరునాడు లాంగ్ ఐలాండ్‌లో నిర్వహించే మోదీ, యూఎస్ ప్రోగ్రస్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భారీగా ప్రవాసీ భారతీయులు దరఖాస్తు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ యూఎస్ పర్యటనలో భాగంగా పలు కంపెనీల సీఈవోలతో ప్రధాని భేటీ కానున్నారు. అలాగే ఐక్యరాజ్య సమితిలో సైతం ప్రధాని మోదీ ప్రసంగించ నున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. రిపబ్లిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ట్రంప్‌పై ఇప్పటి వరకు రెండు సార్లు హత్యాయత్నం జరిగింది. వాటి నుంచి ఆయన తృటిలో తప్పించుకున్న సంగతి తెలిసిందే. డొనాల్డ్ ట్రంప్ పై మరోసారి హత్యాయత్నం జరగడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన తర్వాత.. ప్రచారం లో పాల్గొన్న ట్రంప్.. అధ్యక్ష పదవికి పోటీ చేయడంపై కీలక వ్యాఖ్యలు చేశారు.

# రాహుల్‌గాంధీని అంతం చేస్తామంటారా?

(మొదటిపేజీ తరువాయి)



నిరసన చేశారు. ఆ నిరసనలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా పాల్గొన్నారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్య లు చేసిన బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, మస్తాన్ వలీ, జేడీ శీలం, నరహరశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజి ధర్నాలో పాల్గొన్నారు. మోడీ కేడీ, కిలాడి అంటూ నినాదాలు చేశారు. నోరు పారేసుకున్న నేతలపై అనర్హత వేటు వేయాలని ఈ సందర్భంగా షర్మిల డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ వాస్తవాలు మాట్లాడితే తీవ్రవాదం అంటారా అని మండిపడ్డారు. ఆయన అడిగిన అంశాలపై సమాధానాలు చెప్పే ధైర్యం ఉందా అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. అదే తీవ్రవాదులకు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ బలయ్యారన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని.. మంటలు రేపి అందులో చలి కాచుకుంటారని దుయ్యబట్టారు. ముస్లింలు, దళితులకు అన్యాయం చేసిన పార్టీ బీజేపీ అని వ్యాఖ్యలు చేశారు. అగ్రవర్ణాలకే అన్ని కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. అట్టడుగు వర్గాలవారి కోసం బీజేపీ ఎప్పుడైనా పనిచేసిందా అని ప్రశ్నించారు. ప్రధాన పోస్టుల్లో ఎంతమంది ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో దళితులపై 35శాతం దాడులు జరిగాయన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారన్నారు. బీజేపీ దారుణాలను ఎత్తిచూపి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. నేడు రాహుల్ గాంధీకే బీజేపీ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌పై నోరుపారేసుకున్న నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రతిపక్ష నేత అని, అలాంటి వ్యక్తిని చంపాలని బీజేపీ నాయకులు కామెంట్స్ చేస్తుంటే ఆ పార్టీ అధిష్ఠానం అస్సలు స్పందించడం లేదని వైఎస్ షర్మిల అన్నారు. బీజేపీ నేతలు ఇంత దారుణంగా కామెంట్స్ చేస్తున్నా మోదీ, షా లు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా వారి డైరెక్షన్ లోనే జరుగుతుందని షర్మిల అన్నారు. ఈ దుర్మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని.. వారి ద్వేష పూరిత మాటలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో ఎవరు తీవ్రవాదులు? ఏది తీవ్రవాదం? ఈ దేశంలో అట్టడుగు వర్గాల వాళ్ళు 90 శాతం మంది ఉన్నారు. వాళ్లకు అభివృద్ధిలో వాటా లేదని చెప్పడం తీవ్రవాదమా? అందరికీ సమాన అవకాశాలు ఉండాలి అని చెప్పడం తీవ్రవాదమా? ఏది తీవ్రవాదమో బీజేపీ సమాధానం చెప్పాలి. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ. త్యాగాలు చేసింది కాంగ్రెస్ పార్టీ. అన్ని కులాలను, మతాలను సమానంగా చూసింది కాంగ్రెస్ పార్టీ. ప్రజల హక్కుల కోసం పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ. అన్ని మతాలకు, కులాలను సమానంగా చూసింది కాంగ్రెస్ పార్టీ. ఇలాంటి కాంగ్రెస్ పార్టీ గురించి నీచంగా బీజేపీ మాట్లాడుతుంది. రాహుల్ గాంధీని తీవ్రవాది అంటున్నారని షర్మిల మండిపడ్డారు. రాహుల్ అమ్మమ్మ, నాన్న ఇద్దరు తీవ్రవాదుల చేతుల్లో బలి అయ్యారు. ఈ విషయం బీజేపీకి తెలియదా? రాహుల్ గాంధీ ఈ దేశంలో ప్రేమను నింపిన నాయకుడు. రాహుల్ గాంధీ పేరు ఉచ్చరించే హక్కు బీజేపీకి లేదు.

# సీనియర్ కాంగ్రెస్ నేత బొర్రా వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతి



**మైలవరం, సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు, ఇబ్రహీంపట్నం మాజీ జెడ్పిటిసి సభ్యులు బొర్రా వెంకటేశ్వరరావు బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారు. దివంగత మాజీమంత్రి చనుమోలు వెంకట్రావుకి అత్యంత సన్నిహితంగా ఉండి ఇబ్రహీంపట్నం మండల అభివృద్ధికి వెంకటేశ్వరరావు తీవ్రంగా కృషి చేశారు. ఆయన కుమారుడు బొర్రా కిరణ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు. చిన్న కుమారుడు క్రాంతి కాంట్రాక్టర్ గా కొనసాగుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల పలువురు ఘన నివాళులర్పించారు.

## బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన వైయస్ షర్మిల



**మైలవరం, (కొండపల్లి), సెప్టెంబర్ 18:(ఆంధ్రపత్రిక):** సీనియర్ కాంగ్రెస్ నేత బొర్రా వెంకటేశ్వర కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల బుధవారం నాడు కొండపల్లి లోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నేత బొర్రా వెంకటేశ్వరరావు బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న షర్మిల కొండపల్లి లోని బొర్రా వెంకటేశ్వరావు కుమారుడు ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. బోర్రా కిరణ్ కు ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు, అండగా నిలవాలని షర్మిల సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఒక సీనియర్ మరియు నిజాయితీగల నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొర్రా వెంకటేశ్వరరావు మృతదేహాన్ని వైయస్ షర్మిల సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బొర్రా వెంకటేశ్వరావు మృతికి నివాళు లర్పించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**మైలవరం,(కొండపల్లి), సెప్టెంబర్ 18:(ఆంధ్రపత్రిక):** మైలవరం నియోజకవర్గ సీనియర్ నాయకులు బొర్రా కిరణ్కి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బొర్రా వెంకటేశ్వరరావు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం నాడు కొండపల్లి మున్సిపాలిటీలోని ఆయన నివాసానికి విచ్చేసి ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బొర్రా వెంకటేశ్వరరావు పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. బొర్రా కిరణ్ ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగల చండీ హెూమం



**చౌడేపల్లి, సెప్టెంబర్ 18(ఆంధ్రపత్రిక):** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో కన్నుల పండుగల చండీ హెూమాన్ని నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజున ఈ హెూమాన్ని నిర్వహించడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందని వేద పండితులు అంటున్నారు. దీంతో అమ్మవారి సన్నిధానంలో మండపం నందు వేద పండితులు గోవర్ధన శర్మ, ఆధ్వర్యంలో పౌర్ణమిన చండీ హెూమాన్ని దంపతుల సమక్షంలో కన్నుల పండుగల నిర్వహించారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం, భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ అధికార సిబ్బంది సేవలందించారు.

## ఉప్పొంగిన పాతాళ గంగ

### - తీరిన రాజనాల బండ దాహార్తి



**చౌడేపల్లి,సెప్టెంబర్18(ఆంధ్రపత్రిక):** సత్య ప్రమాణాలకు పేరు పొందిన రాజనాల బండ వద్ద టీటీడీ ఆధ్వర్యంలో బోరు వేశారు. బోరులో నీరు సమృద్ధిగా రావడంతో స్థానికులు ఆనందోత్సవంలో మునిగిపోయారు. రాజనాల బండ పై గత దశాబ్దాల కాలంగా మంచినీటి సమస్య నెలకొని ఉంది. ప్రస్తుతం వేసిన బోరులో నీరు సమృద్ధిగా రావడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయంలో శుద్ధ జల యంత్రాలను అమర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పూర్తయితే భక్తులకు శుద్ధ జలాన్ని అందించడానికి వీలుగా ఉంటుందని టిటిడి అధికారులు తెలిపారు. ఏదేమైనప్పటికీ నీరు సమృద్ధిగా పడటంతో రాజనాల బండ దాహార్తి తీరిందని భక్తులంటున్నారు.

# ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



**వినుకొండ, సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** రానున్న రోజుల్లో దేశంలోనే అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేలా ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఇందు కోసం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ పేరుతో 2047 నాటికి విజన్ డాక్యుమెంట్ రూపొందించనున్నారని, అందులో భాగంగా ఎమ్మెల్యే లు, ఎంపీలు కూడా నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోవాలని సీఎం ఆదేశించారని అన్నారు. అప్పటి లోపుగా రాష్ట్రంలో పేదరికం అన్నదే ఉండదని, అందర్నీ కోటీశ్వరులుగానే చూడాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్షగా పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే 100 రోజుల పాలన పై చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఈ నెల 20 నుంచి 26 వరకు ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లేలా కార్యాచరణపై ప్రధానంగా చర్చిం చిట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 20 నుంచి 6 రోజుల పాటు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికీ ప్రభు త్వ ప్రగతిని తెలిపేలా కార్యాచరణ చేపడతామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలకు మించి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడాన్ని ఎమ్మెల్యేలంతా బాధ్యత గా తీసుకుంటామన్నారు. అలానే జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీళ్లు ఇస్తామని, గ్రామాల్లో రోడ్ల నిర్వహణ కోసం కేంద్రం రూ.49 వేల కోట్లు ఖర్చు పెడుతుందని ముఖ్యమంత్రి ప్రకటించడం చాలా సంతోషం కలిగించిందన్నారు జీవీ. తద్వారా కరవు పీడిత పల్నాడులో మరీ ముఖ్యంగా వినుకొండ నియోజకవర్గంలో ఇంటింటికీ ఉచిత రక్షిత మంచినీరు ఇవ్వాలన్న తమ సంకల్పం నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఇళ్లు లేని పేదలు అందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆ కల నేరుస్తామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాల ముందుంచేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించుకుంటామన్నారు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.

# పూర్ణాహుతితో ముగిసిన శ్రీ పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు



**తిరుపతి, సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11.5 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హెూమం, కుంభప్రోక్షణ, నివేదన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇఓ జె. శ్యామలరావు దంపతులు పాల్గొన్నారు.

**శాస్త్రోక్తంగా చక్రస్నానం :** మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో అమ్మవారితో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత చక్రత్తాళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా పద్మపుష్కరిణి వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీకృష్ణస్వామివారు, శ్రీసుందరరాజస్వామివారు, శ్రీ పద్మావతి అమ్మవారు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఈఓ గౌతమి, ఆలయ డెప్యూటీ ఇఓ గోవింద రాజన్, ఏఇఓ రమేష్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గరుడ సేవ ఏర్పాట్లపై అదనపు ఇఓ సమీక్ష



**తిరుపతి, సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కేవలం రెండు వారాలు మాత్రమే సమయం ఉన్నందున, అక్టోబర్ 8వ తేదీన జరగనున్న గరుడసేవ కోసం అన్ని విభాగాల ఏర్పాట్లపై అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో బుధవారం సాయంత్రం అదనపు ఈవో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా గ్యాలరీల లోనికి ప్రవేశం, నిష్క్రమణ, హెూల్డింగ్ పాయింట్లు, అన్నప్రసాద వితరణ, యాత్రికుల రద్దీ నిర్వహణ, పోలీసుల భద్రత, శ్రీవారి సేవకుల సేవలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడం, భక్తుల రవాణా, పార్కింగ్, బారికేడింగ్ తదితర అంశాలపై అదనపు ఇఓ సుదీర్ఘంగా సమీక్షించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, మెరుగైన సమాచారం కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం వయోవృద్ధులు దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలను రద్దు చేయడంతో పాటు, అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసిందని చెప్పారు. అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9 గంటల నుండి అక్టోబర్ 9 ఉదయం 6 గంటల వరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ సిఇ సత్యనారాయణ, తిరుమలలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గొట్టిపాటి లక్ష్మీ జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

## 587 మందికి ఉద్యోగాలు కల్పించిన డాక్టర్ లక్ష్మి





**దర్శి సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి భారీ స్పందన లభించింది. దర్శిలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కు 2300 మంది నిరుద్యోగులు హాజరు కాగా, వారిలో 587 మంది నిరుద్యోగులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు సాధించారు. జాబ్ మేళాలో నిర్వహించిన ఇంటర్వ్యూ అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలను కూడా వెంటనే అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ... ఇది తొలి అడుగు మాత్రమే అని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తాను అన్నారు. దర్శి ప్రాంతంలో వలసలను నివారించే లక్ష్యంగా పనిచేస్తానని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని పూర్తిగా తీసుకొని ముందుకు వెళుతున్నాను అన్నారు. జాబ్ మేళా అవకాశం సద్వినియోగం చేసుకున్న నిరుద్యోగులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు లలిత్ సాగర్ టిడిపి, తాళ్లూరు మండల అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అర్జీయూకేటీ భద్య రిజిస్టర్‌గా అమరేంద్ర కుమార్



**ఐరాల ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** అర్జీయుకేటి భాధ్య రిజిస్టర్ గా అమరేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టారు. పూతలపట్టు మండలం, కమ్మ గుట్టపల్లి, కి చెందిన బాలయ్య నాయుడు విజయ లక్ష్మమ్మ కుమారుడు, అమరేంద్ర కుమార్ బుధవారం విజయవాడలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్ జి యుకేటి) భాధ్య రిజిస్టర్ గా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజనీర్గా విభాగం ప్రొపెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ ను నియమిస్తూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య విజయ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలో రిజిస్టర్ గా ఉన్న ప్రొఫెసర్ గోపాల్ రాజు పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో ఈయనను నియమించారు. అమరేంద్ర కుమార్ గతంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ గా, పరిపాలన అధికారిగా పరిపాలన అధికారిగా, బాధ్య డైరెక్టర్ గా వర్సిటీ యూజీ బి2024 ప్రవేశాల విభాగం కన్వీనర్ గా పనిచేశారు. ఇడుపులపాయ నూజివీడు ఒంగోలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల పాలన వ్యవహారాలను పరివేక్షించనున్నారు. ట్రీ పుటిలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనే లక్ష్యంగా కృషి చేస్తామని అమరేంద్ర కుమార్ తెలిపారు.

అధికారులు దుశ్యాలతో ఘనంగా సన్మానించి ఫ్లవర్ బొకే అందజేశారు, నియోజకవర్గంలోని పలువురు అభినందనలు తెలియజేశారు.

# తిరుపతి లడ్డూ, ప్రసాదాలలో జంతులు నూనె పై పూర్తి విచారణ చేయండి

## దోషులను కఠినంగా శిక్షించండి

**తిరుపతి , సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** తిరుపతి దేవ దేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు ఇచ్చే లడ్డూ, ప్రసాదాలలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు పదార్థాలను వాడారన్న ఆరోపణలపై పూర్తి విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు లడ్డూల నాణ్యతను దెబ్బ తీసి, ప్రసాదాలను కూడా వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందంటూ లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును వాడారన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తిరుపతి వెంకన్నను దర్శించుకుంటారని, ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారు శిక్షకు పూర్తిగా అర్హులని చెప్పారు. హిందూ మనోభావాలతో పాటు సర్వమతాల మనోభావాలను దెబ్బ తీసిన ఇలాంటి చర్యలపై త్వరితగతిన విచారణ అవసరం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరుపతి పవిత్రతకు భంగం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొత్త టిటిడి బోర్డు నియామకంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని బాలకోటయ్య విజ్ఞప్తి చేశారు.

# నగరంలో అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్స్ నెలరోజులు లోపు సరిచేయాలి

## కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి, సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** తిరుపతి నగరంలో అడ్డదిడ్డంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కేబుల్స్ ను నెలరోజులు లోపు సరిచేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కేబుల్ ఆపరే టర్లను ఆదేశించారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవా రం స్థానిక కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ ప్రొవైడర్స్ తో, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనర్ మౌర్య నగరంలో ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా కేబుల్స్ ఉన్నాయని అన్నారు. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. అస్తవ్యస్తంగా కేబుల్స్ వలన కడపలో జరిగిన సంఘటనను ఆపరేటర్స్ కు, ఇంటర్నెట్ ప్రొవైడర్స్ కు గుర్తు చేశారు. ఎవ్వరి కీ ఇబ్బందులు కలగకుండా సూచించిన క్రమ పద్ధతిలో వైర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రోడ్డుకి మధ్య స్థంబాలకు వున్న కేబుల్ వైర్లను, ఫైబర్ వైర్లను నెల రోజులలోపు తొలగించాలని అన్నారు. తొలగించిన వైర్లను రోడ్డుకి ఇరువైపులా స్థంబాలకు పద్నాలుగు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకుని గడువులోపు కేబుల్స్ తొలగించి, నగరం సుందరంగా ఉండేందుకు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, డి.సి.పి. శ్రీనివాసులు రెడ్డి, ఎస్.పి.డి.సి.ఎల్, బి.ఎస్.ఎన్.ఎల్ అధికారులు, నగరంలోని లోకల్ కేబుల్ ఆపరేటర్స్, తదితరులు ఉన్నారు.

# తపాలా వాహనంలో కర్ణాటక మద్యం పట్టివేత

## ఇద్దరు వ్యక్తులు అరెస్టు-6 లక్షలవాహనం,13,912రూ మద్యం స్వాధీనం



**బంగారుపాళ్యం,సెప్టెంబర్ 18: (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం బెంగుళూరు చెన్నై జాతీయ రహదారి పాలేరు ఫ్లైఓవర్ వద్ద బుధవారం రాబడిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బెంగళూరు నుండి చెన్నైకి తపాలా పార్సిల్ తీసుకు వెళుతున్న వాహనంలో అక్రమంగా కర్ణాటక నుండి చెన్నైకి మద్యం తరలిస్తుండగా బంగారుపాల్యం పోలీసులు పట్టుకోవడం జరిగింది.పట్టుబడిన తపాల వాహనం డ్రైవర్ పళనిస్వామి,అతనితో పాటు బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లికి చెందిన చంద్రమోహన్ నాయుడులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ కె.శ్రీనివాసులు తెలిపారు.పట్టుబడిన వాహనం విలువ 6 లక్షలు,మద్యం విలువ 13,000 వేల రూపాయలు.మొత్తం సొత్తు విలువ రూ 6,13,000లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కే. శ్రీనివాసులు మీడియాకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లప్ప,హెడ్ కానిస్టేబుల్స్ కిరణ్ కుమార్,పురుషోత్తం,పోలీస్ సిబ్బంది మోహన్ నాయుడు, నీరజాక్షులు,ముబారక్,సుధా,కిరణ్, యుగంధర్ పాల్గొన్నారు.

# విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం



**చౌడేపల్లి,సెప్టెంబర్18(ఆంధ్రపత్రిక):** విజయవాడ వరద బాధితులకు మండలంలోని లద్దిగం కు చెందిన అంబేద్కర్ సేవాసమితి సభ్యులు ఆర్థిక సాయం చేశారు. సేవా సమితి సభ్యులు మునస్వామి, మనోజ్, మనీ, తదితరులు తాసిల్దార్ కార్యాలయంలో డిటి మాధవికి, రూ 10 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో లద్ధగంకు చెందిన అంబేద్కర్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా స్వామి వారికి అభిషేకం



**ఐరాల, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** పగలు స్వామివారికి వైభవంగా అభిషేకం. ప్రత్యేక ఉత్సవములు లో భాగంగా బుధ వారం రావణబ్రహ్మ వాహనం ఉదయం ఉభయదారులు పుణ్య సముద్రం లక్ష్మంబాపురం సంతపల్లి ద్వారకాపురం కుమ్మరపల్లి సిద్ధం పల్లి ముద్దు రామాపురం గ్రామస్తులు అందరూ కలిసి స్వామివారికి వివిధ రకాల సుగంధపు పుష్పాలు, పండ్లు, పూజకు సంబంధించిన వంటి సామగ్రి వాటన్నిటినీ ఆలయానికి తీసుకురాగా వాటితో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు స్వామివారి దర్శనం భాగ్యం కల్పించారు.

# ఘనంగా పల్లె జన్మదిన వేడుకలు....

హిందూపురం, సెప్టెంబర్ 18 ( ఆంధ్ర పత్రిక ) ప్రముఖ విద్యావేత్త, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలోని సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ శివ శంకర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం కొట్నూరులోని నిర్మల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు పల్లె రఘునాథ్ రెడ్డిని ఘనంగా కొనియాడారు. అనంతరం సప్తగిరి కళాశాలలో పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఉపన్యాసకులు, విద్యార్థులు నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలలను స్థాపించి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పలు విద్యా సంస్థలను స్థాపించి నామమాత్రపు ఫీజులతో బడుగు




బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందించిన ఘనత పల్లె రఘునాథ్ రెడ్డికే దక్కిందన్నారు. సప్తగిరి ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల మంజునాథ్, కళాశాల పాలనాధికారి గంగిరెడ్డిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాల, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు, అగ్రికల్చర్ కళాశాల, నర్సింగ్ కళాశాల లు అనేకం స్థాపించి అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను అందించిన ఘనత పల్లె రఘునాథ్ రెడ్డికి దక్కిందన్నారు. హిందూపురంలో 1993లో జూనియర్ కళాశాలతో ప్రారంభమైన సప్తగిరి కళాశాల అనంతరం డిగ్రీ ,ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల స్థాయికి ఎదిగిందన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నా విద్యాభివృద్ధి ధ్యేయంగా నేటికీ కృషి చేస్తున్నారన్నారు. ఏడుపదులు వయసు దాటిన నవ యవ్వన యువకుడిలా విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పలువురు పల్లె రఘునాథ్ రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి పల్లె రఘునాథ్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి జూనియర్, డిగ్రీ ,ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ఉపన్యాసకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లె జీవితం ఆదర్శంగా తీసుకోవాలి
## ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్



హిందూపురం, సెప్టెంబర్ 18 ( ఆంధ్ర పత్రిక ) మునిసిపల్ పరిధిలోని చౌడేశ్వరి కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో బాలాజీ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకర్ మాట్లాడుతూ సామాన్య స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన పల్లె రఘునాథ్ రెడ్డి జీవితం విద్యార్థులకు ఆదర్శం కావాలని కోరారు. పట్టుదలతో స్వయంకృషితో ఎదిగారని తెలిపారు. పాఠశాల హెడ్మాస్టర్ మంచితనం మానవత్వం మేలవించిన సుగుణ సంపన్నుడు అని కొనియాడారు. ఉపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఇంజనీరింగ్ ఫార్మసి, అగ్రికల్చర్, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులను స్థాపించి లక్షల విద్యార్థులకు వేల మందికి ఉపాధి కల్పించిన ఘనత పల్లెకు దక్కుతుందని తెలిపారు. టీచర్ ప్రేమలత మాట్లాడుతూ ఒక వ్యక్తి శక్తిగా ఎదగడానికి ప్రత్యక్ష నిదర్శనం పల్లె రఘునాథ్ రెడ్డి అని తెలిపారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, శేఖర, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, మక్తర్, ప్రభాకర్,వసుధ, ధనలక్ష్మి ,అంజన్న మూర్తి, పమీద, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత మీద ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి : డి.పి.ఓ ప్రభాకర్ రెడ్డి



సిద్ధవటం సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): సిద్ధవటం మండలం టక్కోలి గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు బుధవారం జరిగిన స్వచ్ఛత కార్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు ఆయనకు రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగ ముని రెడ్డి ఘనంగా శాలువతో మర్యాదపూర్వకంగా సత్కరించారు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం పై విద్యార్థులకు గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా మన చుట్టుపక్కల ప్రదేశాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని మన గ్రామంలో పచ్చదనంతో ఉండేటట్లు సహకరించాలని పొడి చెత్త, ఎండు చెత్త వేరువేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్ వాహనంలో ప్రతి ఒక్కరూ వేయాలని చెత్త సేకరణ సేకరించి రైతుకు లాభసాటిగా మిశ్రమ ఎరువులు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు ముఖ్యంగా గ్రామాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు అక్టోబర్ 2 తేదీ వరకు స్వచ్ఛత కార్యక్రమాలు ఉంటాయని గ్రామాలు అభివృద్ధి చెందిందుకు అవగాహన కార్యక్రమాలు ప్రతిరోజు మండల పరిధిలో కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమం పై మీ తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నేర్పించాలని తెలియజేశారు గ్రామాల్లో పచ్చదనం ఉండేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దానివల్ల గ్రామాల్లో కాలుష్య నివారణకు ఉపయోగపడి గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు ప్రతి విద్యార్థి విద్యార్థిని శుభ్రత పాటించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ ఉమామహేశ్వరుడు, స్వచ్ఛత ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ మానస, పంచాయతీ సెక్రటరీలు శివయ్య, సుదర్శన్ రెడ్డి తెదేపా నేతలు నాగ ముని రెడ్డి, చిన్నపురెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## బీసీలకు 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ తీర్మానంపై హర్షం



హిందూపురం, సెప్టెంబర్ 18 (ఆంధ్ర పత్రిక) బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బీసీలకు కల్పించాలని మాట కట్టుబడి బుధవారం మంత్రి మండలి తీర్మానం చేయడం బీసీ లందరికీ ఒక శుభ పరిణామం బీసీలకు ఒక పండుగ అని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, అదేవిధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరికి, జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర మంత్రి మండలి తీర్మానం చేయడం సందర్భంగా అయన ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా ఏదైతే బీసీలు రాజ్యాధికారంగా తమ హక్కులను వినియోగించుకోవడానికి 33 శాతం రిజర్వేషన్ తేవడం బీసీల్లో ఒక చైతన్యానికి నాంది అన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి నూత నుత్తేజాన్ని తీసుకొస్తాం వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యం

### జిల్లా అధ్యక్షురాలు ఎన్ డి విజయ జ్యోతి



కడప సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక) : జిల్లాలోని నాయకులను, కార్యకర్తలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీకి నూత నుత్తేజాన్ని తీసుకొ స్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురా లిగా నియమియములైన ఎన్ డి విజయ జ్యోతి అన్నారు బుధవారం కడప కు చేరుకున్న ఆమెకు నాయ కులు, కార్యకర్తలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు నగరం లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం ఇందిరా భవన్ లో ఆ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి సమక్షం లో ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం విజయ జ్యోతి మీడియా సమా వేశంలో మాట్లాడారు దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు . కార్యక ర్తలకు అండగా నిలబడి జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు అందరం కుటుంబ సభ్యుల్లా, సైనికుల్లా సమన్వ యంతో పని చేస్తామని చెప్పారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రథమ స్థానంలో ఉండేందుకు కృషి చేస్తామని చెప్పారు తనకు జిల్లా బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ చీఫ్ సోనియా గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, యువత నేత రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, తులసి రెడ్డి లకు విజయ జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతోందని చంద్రబాబు ఇచ్చిన సూపర్ 6 హామీలు అమలు చేయక పోవడం చంద్రబాబు అసమర్థతను మరో సారి బురుజు వైందని చెప్పారు, ప్రజలకు అపద్దాలు చెప్పి అధికా రంలో కొనసాగ లేరన్నారు టిడిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసి 2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ విధి విధానా లను రూపొందిస్తామన్నారు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేస్తామని చెప్పారు

## పనుల్లో నాణ్యతను పరిశీలించాలి
## సిపిఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



నందికొట్కూర్, సెప్టెంబర్ 18, ఆంధ్ర పత్రిక, పైపులైను పగిడాల నుండి ఓర్వకల్లు వరకు వేసే పైప్ లైన్ నాణ్యత లోపించిందని ఆ కాంట్రాక్టర్ ను వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు సిపిఎం నాయకులు పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, డివైఎఫ్ఐ టౌన్ అధ్యక్షులు దూదేకుల బాబు, కలిసి బ్రాహ్మణ కొట్కూరు దగ్గర జరుగుతున్న పైప్ లైన్ పనులను వారు పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామం నుండి కృష్ణ నది నీటినీ పగిడాల మండలం నందికొట్కూరు మండలం బంగ్లా మండలం,మిడుతూరు మండలానికి నీటిని వాడుకునే అవకాశం ఉన్న ఇక్కడి పాలకుల యొక్క నిర్లక్ష్యం వల్ల ఓర్కల్లు మండల కేంద్రంలోని స్టీల్ ప్లాంట్ అవసరం కోసం నీటిని తరలించకపోతున్నారని ఇక్కడి పాలకులు గుడ్లు అప్పగించి చూస్తున్నారని వారు ఆరోపించారు, మామూలు మత్తులో మునిగిన అధికారులు పైప్లైన్ పనులను నాణ్యత లోపించిన పర్యవేక్షణ లేకపోవడం వల్ల కాంట్రాక్టు ఇష్టం సారంగా పైపులను పనులు చేపట్టాడని వాటి మూలంగా అనేకమంది ప్రజలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు తెలిపారు ,పైప్ లైన్ పనులు విచ్చలవిడిగా హైవే రోడ్డు వెంట కాలువలు తీసి మట్టి రోడ్ల పైన వేస్తున్నారని వాటి వల్ల రోడ్డుపైన వెళ్లేటువంటి వాహనదారులు ప్రమాదాల గురవుతున్నారని పనుల దగ్గర ఎలాంటి ప్రమాదక హెచ్చరిక బోర్డులు పెట్టడం లేదని రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు ,పైప్ లైన్ పనులు నాణ్యత లేకుండా పైపుల కింద ఇసుక వేయడం లేదని గుండ్ల రాళ్ల మధ్యన పైపులు ఉంచుతున్నారని వాటి మూలంగా పైపులు దెబ్బ తినే అవకాశం ఉందన్నారు కావున జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు,

## ఏ గ్రేడ్ గా ఎన్.ఎస్.పి.ఆర్ కళాశాల ఎంపిక

**-పట్టణంలో విద్యార్థినిలు విజయోత్సవ ర్యాలీ**

**కళాశాల సిబ్బందిని సన్మానించిన**

**మాజీ మునిసిపల్ చైర్మన్ బిఎస్ విద్యాసాగర్.**



హిందూపురం, సెప్టెంబర్ 18 ( ఆంధ్ర పత్రిక ) పట్టణంలోని ఎన్.ఎస్.పి. ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను బెంగళూరు న్యాక్ సంస్థ ఏ గ్రేడ్ గా గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా మహిళా డిగ్రీ కళాశాల ఆరంభ దశ నుండి నేటి వరకు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరచడంతో అత్యున్నత బృందం నిర్వహించిన సర్వేలో ఈ కళాశాలను ఎంపిక చేసి నేషనల్ న్యాక్ సంస్థకు సిపార్క్ చేసింది. గత జులై మాసంలో శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలను అత్యున్నత బృందం సందర్శించి కళాశాలల ప్రగతిని అధ్యయనం చేశారు. ఇందులో భాగంగానే హిందూపురం పట్టణంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల ప్రవేశం నుండి, అధ్యాపకుల విద్యా బోధన, ఉత్తీర్ణత శాతం, కళాశాల నిర్వహణ, సోషల్ సర్వీస్, క్రీడలు, సాంస్కృత కార్యక్రమాలలో ముందంజలో ఉన్నట్లు తమ నివేదికను బెంగళూరులో ఉన్న నేషనల్ న్యాక్ సంస్థకు అందజేసినట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. వీరిచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలోనే ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలకు ఏ గ్రేడ్ గా గుర్తించడం జరిగిందన్నారు. బుధవారం కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు ప్రధాన వీధుల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బాణా సంచారాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తాము చదివిన కళాశాలకు ఏ గ్రేడ్ రావడం చాలా సంతోషమని హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక బి. ఎస్. టి. పెట్రోల్ బంక్ వద్ద బిఎస్ కాశీ విశ్వనాథ్ (అప్పి స్వామి) కుమార్తె పూర్వ విద్యార్థిని లభ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి అధ్యాపకులను ఘనంగా సన్మానం చేశారు. అదేవిధంగా కళాశాలలో ప్రిన్సిపాల్ కు, అధ్యాపకులకు మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ విద్యాసాగర్, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ కెబి ఉషారాణిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

**గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య జి ఆర్ ఎస్ వై ఎఫ్ యువతను చైతన్యం చేయడం అభినందనీయయి-కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి**



కడప సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక): గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య ముద్రించిన ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడదాం అనే పోస్టర్ ను ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి ఆవిష్కరణ చేశారు డగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో యువత భాగస్వామ్యం కావాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య జి ఆర్ ఎస్ వై ఎఫ్ యు వతను చైతన్యం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి కొనియాడారు. గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య ముద్రించిన ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడదాం అనే కరపత్రంను ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు బాలవికాస్ గంగయ్య, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం. ఓబులేసు యాదవ్ అపుస్మా నాయకులు అక్షర బాబు,సిద్ధవట్టం వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు బుర్రి రెడ్డయ్య యాదవ్, తెల్ల దార్ల విజయకుమార్ యాదవ్ జి ఆర్ ఎస్ వై ఎఫ్ జిల్లా నాయకులు సాయి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధిలో భాగస్వాములు కావలసిన యువత నేడు మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్నారు చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్ ను ఇప్పటికైనా అరికట్టకపోతే యువత భవిష్యత్తు అంధకారం అవుతుంది సరదాగా మొదలయ్యే ఈ అలవాటు.. చివరికి బానిసగా మార్చుకుంటుంది. డ్రగ్స్ కోసం అసాంఘిక, అరాచక, హింసాత్మక నేరాలు చేసేందుకు కూడా బాధితులు వెనకాడరు. స్నేహితులు, బాంధవ్యాలను మరిచి ఒంటరిగా కుంగిపోయి.. చివరికి ఆత్మహత్యలకు కూడా దారితీసే అవకాశాలు కూడా ఎక్కువ తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పట్ల ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి ఏ పాపం ఎరుగని పసిపిల్లలకు చాక్లెట్స్, బిస్కెట్స్ రూపంలో డ్రగ్స్ వారికి చేరుతున్నది ఇలా అలవాటు పడ్డ విద్యార్థులు, యువతలో అనేక మార్పులు వస్తున్నాయి తల్లిదండ్రులను గాని, పెద్దలను గాని, మహిళలను గాని గౌరవించే పరిస్థితి కరువవుతున్నది డ్రగ్స్ కు అలవాటు పడ్డం కారణంగా దొంగతనాలు అలవాటు పడడం డబ్బుల కోసం దాడులకు పాల్పడడం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారి తిరోగమన వైపు వైపు అడుగులు వేస్తున్నారు ఇది ప్రస్తుత సమాజానికి చాలా ప్రమాదకరంగా మారబోతుంది మాదకద్రవ్యాల వాడకం కారణంగా యువత భవిష్యత్తు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య గుర్తించి ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడదాం అనే నినాదంతో యువతను చైతన్యం అభినందనీయం అని ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు గంజాయి అరికట్టడంలో ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె తెలిపారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**-10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం...**



హిందూపురం, సెప్టెంబర్ 18 ( ఆంధ్ర పత్రిక ) పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను అరెస్ట్ చేసి అతని వద్దనుండి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేస్తున్నట్లు డిఎస్పీ కెవి మహేష్ వెల్లడించారు. బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో డిఎస్పి కెవి మహేష్ సిఐలతో కలిసి విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పుట్టపర్తి మండలం పెద్దకమ్మవారిపల్లి గ్రామా నికి చెందిన ముమ్మినేని రమేశ్ మారుతి తాగుడు కు బానిసై తన చెడు వ్యసనాలకు డబ్బు ఇచ్చే వారు ఎవరూ లేకపోవడంతో మద్యం తాగడానికి డబ్బు లేకపోవడంతో ఏదో విధముగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యముతో ద్విచక్ర వాహనములను సులభంగా దొంగతనాలు చేయవచ్చని నిర్ణయించుకుని కొంత కాలము నుండి హిందూపురం పట్టణం, పరిసర ప్రాంతాలలోనూ, కర్నాటక రాష్ట్రములో మోటార్ సైకిల్స్ దొంగతనం చేసి వాటిని అమ్ముకుని వచ్చిన డబ్బుతో తన విలాసాలకు వాడుకునే వాడన్నారు.

## రాహుల్‌ను ప్రధానిగా, వైయస్ షర్మిలను సిఎంగా చేయడమే లక్ష్యం

### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, ఎన్ డి విజయ జ్యోతి

కడప సెప్టెంబర్ 18 (ఆంధ్ర పత్రిక): రానున్న 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్ లో పార్టీ జిల్లా అధ్యక్షురా లిగా ఎన్ డి విజయ జ్యోతి ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముందుగా విశ్వేశ్వరయ్య సర్కిల్ నుండి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వరకు బాజా భజంత్రీలతో, బాణాసంచాతో, ర్యాలీ అట్టహాసంగా చేపట్టారు అనంతరం జరిగిన సమావేశానికి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సత్తార్ అధ్యక్షత వహించారు. జిల్లాలో పార్టీ పటిష్టత కోసం తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని గుండ్లకుంట శ్రీరాములు చెప్పారు. జిల్లాలో నాయకులను కార్యకర్తలను అందర్నీ కలుపుకొని పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. జిల్లా అధ్యక్షురాలుగా తనకు బాధ్యతలు అప్పగించి నందుకు ఏఐసీసీ చీఫ్ సోనియా గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, యువనేత రాహుల్ గాంధీ



రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కి, ఇందుకు సహకరించిన తులసి రెడ్డికి మిగతా సీనియర్ నాయకులకు విజయ జ్యోతి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లా డుతూ సంవత్సర కాలంలో జిల్లా, మండల పరిషత్, పంచాయ తీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల రాబోతున్నా యని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిర్ణయాత్మక పాత్ర పోషించే విధంగా కృషి చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చంద్రబాబు పాలన పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటందుకు ప్రధాన కారణం సూపర్ సిక్స్ పథకాలేనని వంద రోజులు కావస్తున్నప్పటికీ సామాజిక పెన్షన్ పథకం తప్ప మరి ఏ పథకం అమలు కాలేదని ధ్వజమెత్తారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా రైతులను వంచించాడని నిప్పులు చెరిగారు తల్లికి వందనం పథకం అమలు చేయకుండా విద్యార్థులను, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా చంద్రబాబు నిరుద్యోగ యువతను మోసం చేశాడని చెప్పారు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయకుండా మహిళలకు అపద్దాలు చెప్పి మోసం చేయడం దారుణమన్నారు అప్పుల విషయం లో జగన్ విమర్శించిన చంద్రబాబు చేసే దేమిటని ప్రశ్నించారు ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 16 నాటికి రాష్ట్ర ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. జిల్లాకు మంత్రి పదవి ఇవ్వకుండా కడప జిల్లాకు చంద్రబాబు అన్యాయం చేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా, వైయస్ షర్మిలా రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని తులసిరెడ్డి ఉద్బోధించారు ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అలీ ఖాన్,అల్లా బకాష్ ,నగర అధ్యక్షుడు టికె అఫ్జల్ ఖాన్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్,ధృవ కుమార్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, శ్యామలమ్మ,నాసర్ అలీ,సిరాజుద్దీన్ , సుజాత రెడ్డి, అచ్యుత రావు, సుబ్రహ్మణ్యం శర్మ, చంద్ర శేఖర్ రెడ్డి, మల్లెం విజయ భాస్కర్,పుల్లయ్య, కదిరి ప్రసాద్ గౌడ్, నాగరాజు, వినయ్, మహబూబ్ భాషా,రఫి నాగరత్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి 50 వేల సభ్యత్వాలు లక్ష్యం



**- రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి**

**కోరుకొండ, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందరేశ్వరి సూచించారు. రాజానగరం అసెంబ్లీ రాజానగరం చౌల్ట్రీ కళ్యాణ మండపము నందు మంగళవారం "సదా స్వత అభియాన్"సభ్యత్వ నమోదు రాజానగరం నియోజకవర్గం రివ్యూ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీజీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి తల్లి పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని కళ్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా పురందరేశ్వరి మాట్లాడుతూ, రాజమండ్రి జిల్లా 3 లక్షల 50 వేలు సభ్యత నమోదును లక్ష్యంగా ఒక్కొక్క అసెంబ్లీకి 50 వేల సభ్యత్వ నమోదు లక్ష్యంగా చేసుకుని ప్రతి కార్యకర్త బాధ్యతతో ప్రతిరోజు మీ శక్తి కేంద్రాల వారిగా (సభ్యత్వసహాయోగులు) రిపోర్టులు సాయంత్రం 6 గంటలకు మండల అధ్యక్షులకు మండలాధ్యక్షులు కన్వీనర్, కో కన్వీనర్లకు, వీరు జిల్లా అధ్యక్షులకు, రాత్రి 9 గంటల లోపు సమర్పించాలని ఆమె తెలియజేశారు. సమావేశం అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతిరావు అధ్యక్షతన జరిగినది. ఈసమావేశంలో అసెంబ్లీలో వివిధ గ్రామాల నుండి సుమారు 70 మంది కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరికి పురందరేశ్వరి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలోకి జాయిన్ అయిన ప్రతి ఒక్కరికి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీలో 216 బూతులు సంస్థాగతంగా 58 శక్తి కేంద్రాలు (సభ్యత సహాయోగులు) ఉన్నాయని బూత్‌కు 200 సభ్యత్వాలు లక్ష్యంగా ప్రతి సహయోగి దీక్షతో పని చేయాలని ఆమె కోరారు. ఈనెల 25 తేదీ పార్టీ వ్యవస్థాపకులు శ్రీ దీన్ దయాల్ ఉపాధ్యాయ జన్మదినోత్సవం నాటికి లక్ష్యం పూర్తి చేయాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు రేలంగి శ్రీదేవి, రాజానగరం మండల అధ్యక్షులు ఆళ్ల శివ నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కాలెపు సత్య సాయిరాం, రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షులు బేతి రెడ్డి ఆదిత్య, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు కంది కొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మోది సత్తిబాబు, జిల్లా సెక్రెటరీ చీరల దొరబాబు ,కోరుకొండ మండల అధ్యక్షులు నేలపాల వెంకన్న, సీతానగరం మండల అధ్యక్షులు గూడపాటి జయరాం, అసెంబ్లీ ప్రవాస యోజన కన్వీనర్ బోయిడి దుర్గారావు, కో కన్వీనర్ గండి సత్యనారాయణ, పెనకటి రాంబాబు, దొడ్డ అర్జున్, వర్రే రామకృష్ణ, బిక్కిన కామరాజు చౌదరి, దొడ్డ శ్రీనివాస్, వేపకాయల కాశి, వివిధ మండలాలకు చెందిన మండల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకాకుళం డిఎస్పీ సిహెచ్ వివేకానంద పుట్టినరోజు



**మధురవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):** డిఎస్పీ సి.హెచ్.వివేకానంద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పోతిన నానాజీ, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో విశాఖపట్నం దిశా ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించి, ప్రస్తుతం శ్రీకాకుళం డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నటువంటి డి.ఎస్పీ సిహెచ్ వివేకానంద జన్మదిన వేడుకల్లో భాగంగా "అమ్మఒడి" ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ఉన్నటువంటి అనాథ పిల్లలతో కలిసి మొదట పోతిన నానాజీ, అనురాధ దంపతులు కేక్ కటింగ్ చేసి, డీఎస్పీ సిహెచ్ వివేకానందకు అభినందనలు తెలియజేశారు. అనంతరం చిన్నారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోతిన అనురాధ మాట్లాడుతూ విశాఖపట్నం దిశ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంతో చక్కగా తనదైన రీతిలో విధులు నిర్వర్తించారన్నారు. అలాగే డిఎస్పి వివేకానంద ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినటువంటి వ్యక్తిగా ఆయన బాటలో ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పోతిన వెంకీ, నాగోతి చిన్నారావు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వినాయక నిమజ్జనం



**అనకాపల్లి. సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాలలో శ్రీ వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీ వినాయక స్వామివారిని నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగానంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ శ్రీ దాడి రత్నాకర్ స్వయంగా వినాయక ప్రతిమను తన శిరస్సుపై ఉంచుకొని ఊరేగింపుగా విద్యార్థులు, అధ్యాపకులు మరియు విద్యార్థుల కోలాటాల మధ్య తీసుకువెళ్లారు. విద్యార్థులందరూ గణపతి బప్పా మోరియా అంటూ నినదిస్తూ కొలహాల మధ్య నిమజ్జోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంపై ఏసీబీ దాడులు




**అనకాపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**జీవీఎంసీ జోన్ 84వ వార్డు కొండ కొప్పాక సమీపంలో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంపై గురువారం అవినీతి నిరోధక శాఖ దాడులు నిర్వహించింది. వివరాల్లోకి వెళితే ఎలమంచిలిలో కాలేజీ నడుపుతున్న ఒక వ్యక్తి ఓపెన్ స్కూల్ నడిపేందుకు గత నెల దరఖాస్తు చేసుకున్నాడు. ఈ దరఖాస్తును గుంటూరు ప్రధాన కార్యాలయంలో ప్రాసెస్ చేసేందుకు 30,000 విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఓ కుమార్ డిమాండ్ చేయడం జరిగింది. ఫిర్యాదు ఈ వ్యక్తికి లంచం ఇవ్వటం ఇష్టం లేక అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం డీఈఓ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ దాడి చేసి లంచం తీసుకుంటున్న కుమార్‌ను అదుపులోకి తీసుకొని ఆయన వద్ద నుండి 30 వేల రూపాయలు నగదును డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డిఎస్పి నాగేశ్వరరావు తెలిపారు.

## 22న అనకాపల్లిలో ధర్మ ప్రచారకుల సమావేశం



**కె.కోటపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**ఈనెల 22వ తేదీన అనకాపల్లిలో హిందూ ధర్మ పటిష్టత కోసం ధర్మ ప్రచారకుల సమావేశంనిర్వహించనున్నామని సమరశత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారకులు శ్రీమన్నారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకూ శారదానగర్ శ్రీ దుర్గాదేవి ఆలయంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. హిందూ ధర్మ పటిష్టత, దేవాలయాల నిర్వహణ, పర్యవేక్షణ, సత్సంగాల నిర్మాణం కోసం ఈ సమావేశం జరుగనుందన్నారు. రాష్ట్ర ధర్మ ప్రచారక్ ఎం.సాయిరాం ముఖ్యఅతిథిగా పాల్గొనున్న ఈ సమావేశంలో హిందూ ధర్మ సానుభూతిపరులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని శ్రీమన్నారాయణ కోరారు.

## రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి



**అనకాపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**పరవాడ. మండలంలో శిథిల వ్యవస్థలో ఉన్న రోడ్లు నిర్మాణ పనులు చేయాలని పరవాడ ఎలమంచిలి మెయిన్ రోడ్‌పై సిఐటియు, పరవాడ వర్తక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎలమంచిలి పరవాడ రోడ్డు శిథిలమై ఉండటం వలన అనేక ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, తీవ్ర గాయాల గురవుతున్నారని వాహన రాకపోకల సమయంలో భారీ ఎత్తున దూళి లెగిసిపడుతుందని ఆర్ అండ్ బి అధికారులు వెంటనే ఈ రోడ్ నిర్మాణ పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టిపిసి, ఫార్మాసిటీ, అచ్చుతాపురం ఎస్సీ జెడ్, వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలో ఉంటుందని ఇలాంటి ముఖ్యమైన రోడ్డు నిర్మాణ పనులు అధికారులు నిర్లక్ష్యం చేయడం మంచి పద్ధతి కాదన్నారు.రోడ్ నిర్మాణ పనులు చేపట్టకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోగండి శ్రీనివాస రావు, బి గోపి, బండారు. అప్పా రావు, సిహెచ్ సన్యాసిరావు, శ్రీను, జగన్, తదితరులు పాల్గొన్నారు

## కల్లు గీతకార్మికులకు వైన్ షాపులు 20 శాతం కేటాయించాలి

**- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేముడు**



**కె.కోటపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఇచ్చిన హామీ ప్రకారం మద్యం దుఖాణాలను కల్లుగీత కార్మికులకు 20శాతం కేటాయించాలని ఏపీ కళ్ళుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ ప్రకారం కల్లుగీత కార్మికులకు 10శాతం మద్యం దుఖాణాలను కేటాయించనున్నారని, ఇది అన్యాయం అని ఆయన అన్నారు. రాష్ట్రంలో కల్లుగీత కార్పొరేషన్ ద్వారా షేర్ ధనం చెల్లించిన కార్మికులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారంగా ధరావత్తులో 50శాతం రాయితీ షాపులు కేటాయించాలన్నారు. సబ్సిడీతో కల్లుగీత కార్మికుల సొసైటీ ద్వారా టెండర్ దాఖలు చేయించి వైన్ షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. షేర్ కాపిటల్ చెల్లించిన కల్లుగీత కార్మికులకు సొసైటీల ద్వారా ఏ మండలం కార్మికులకు ఆ మండలంలోనే వైన్ షాప్‌లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లిలో జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారికి వినతిపత్రం అందచేశామని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేముడు చెప్పారు.

## వేపచెట్టు వినాయకుడి మండపం వద్ద భారీ అన్న సంతర్పణ

**సుమారు 3వేల మంది భక్తులకు అన్న ప్రసాదాల స్వీకరణ**

**ఈనెల 21న మట్టి వినాయకుడి అనుపు మహోత్సవం**



**వేపాడ, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**మండల కేంద్రం వేపాడలో వేపచెట్టు వినాయకుడి మండపం వద్ద బుధవారం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సుమారు 3వేలమందికి పైగా వేపాడ వల్లంపూడి, బక్కునాయుడు పేట, వీలుపర్తి, దబ్బిరాజు పేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి స్వామి వారి అన్నప్రసాదాలను స్వీకరించారు. గ్రామానికి చెందిన పెద్దలు ఉల్లింగ అప్పారావు, బోజంకి లక్ష్మణరావు, లెక్కల వెంకటరావు, వంటాకు భాస్కరరావు, బండారు దేముడుబాబు, రంభ దేముడు, రంభ దేముడు నాయుడు గ్రామానికి చెందిన ఇతర పెద్దలు, యువతీ యువకులు సహకారంతో మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కాగా ఈనెల 21న ఈ మట్టి వినాయకుడి అనుపుమహోత్సవం అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## కార్మిక నేత ఏచూరికి సిఐటియు ఘన నివాళి




**కాకినాడ, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**కార్మికుల వర్గ శ్రేయస్సుకై జీవితాన్ని అంకితం చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని సిఐటియు నాయకులు కొనియాడారు. బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో సిఐటియు కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకట రమణ అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీలు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం పార్టీలో వివిధ స్థాయిల్లో నాయకుడుగా ఎదిగిన ఏచూరి 2015 నుండి అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఉన్నారన్నారు. 2005 నుండి 2017 వరకు 12ఏళ్ల పాటు రాజ్యసభలో ప్రజావాణి వినిపించారన్నారు. ఏచూరి పిలుపుతో ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ మతసామరస్యం పాటించాలని, లౌకిక వాదాన్ని కాపాడుకోవాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వి.సత్యనారాయణ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ ఏచూరి గొప్ప అధ్యయన శీలని అన్నారు. దేశంలో అనేక మంది పేదలకు ఉపయోగపడుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో ఏచూరి కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.రమణమ్మ, జ్యోతి, నీరజ, విజయ, రమ, ఆశా యూనియన్ నాయకులు భారతి, పద్మావతి, సత్యవేణి, రాజేశ్వరి, తులసి, ఉమ, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు వర్మ, చరణ్, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, ప్రసాద్, అప్పారావు, ఖాదర్, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ విజయ్ కుమార్, ఆర్ రమేష్, తలుపులమ్మ, రవి, మంగ, జనార్ధన్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు, పోర్ట్ యూనియన్ నాయకులు కుమార స్వామి, ఆటో యూనియన్ నాయకులు నురుకుర్తి ప్రకాశరావు, నక్కా కృష్ణ, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు కె.సత్తిబాబు, గూడ్స్ ఆటో యూనియన్ గుండు బోగుల శ్రీనివాస్, మున్సిపల్ క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంజి సూరిబాబు, నగర అధ్యక్షుడు ఎ.సంజయ్, ఆవాజ్ కన్వీనర్ ఇబ్రహీం, అర్బన్ హెల్త్ సెంటర్ నాయకులు జివివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సెంటర్‌లో కొంతమంది బాటసారులు, వాహనదారులు ఆగి ఏచూరి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులు అర్పించారు.

## అర్.వై.అగ్రహారంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై "ఆత్మ" శిక్షణ



**కె.కోటపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా రైతులు తమకు కావల్సిన విత్తన రకాలను గ్రామంలోనే ఉత్పతి చేసుకుని అదే గ్రామంలో వాటిని ఉపయోగించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి వ్యవసాయధికారిణి తులసిమణి తెలిపారు. బుధవారం మండలంలోని ఆర్.వై.అగ్రహారం గ్రామంలో "ఆత్మ" సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులకు ఈ2024 ఏడాదికి ఎం.టి.యు.1121 రకం వరి విత్తనంను ఉత్పత్తి చేసుకునే విధంగా రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం వరి పంటలో దశలవారీగా తీసుకోవలసిన యాజమాన్య చర్యలను వివరించారు. ఈ శిక్షణ పొట్టదశలో ఒకసారి, పంటకోత దశలో మరొకసారి ఉంటుందన్నారు. చోడవరం అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ వరిలో రైతులు ఆచరించ వలసిన సమగ్ర పోషక యాజమాన్యం పద్ధతులను వివరించారు. పొట్ట దశలో తప్పనిసరిగా యూరియాతోపాటు పోటాష్ 35 కె.జి.లు ఒక ఎకరానికి వాడాలన్నారు. పోటాష్ లోపం కనిపిస్తే పోటాష్ ఎరువు గాని ఆర్.ఎస్.కె. ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న కె.ఆర్.బి.ను గానీ వాడాలన్నారు.అనంతరం రైతులతో క్షేత్ర సందర్శన చేశారు.పలు సందేహాలను నివృత్తి చేశారు.నివారణ చర్యలు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.వి.సోమశేఖర్ రైతులు మండ శ్రీనివాసరావు, యడ్ల బలరాం, రెడ్డి అప్పారావు, యడ్ల శ్రీనివాస్ ఏఈవో సాయివాణి, వి.ఎ.ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

## బీజేపీ ఆశించిన స్థాయిలో సభ్యత్వ నమోదు చేద్దాం : చల్లా



**కె.కోటపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** అనకాపల్లి పార్లమెంట్ సభ్యులుగా డాక్టరు సి.ఎం.రమేష్ విజయం స్ఫూర్తితో పార్టీ ఆశించిన స్థాయిలో సభత్వ నమోదు చేసి మనపట్టు నిరూపించుకో వాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డి.సి.సి.బి.)మాజీ డైరెక్టరు, సీనియర్ బీజేపీ నాయకులు చల్లా సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం ఇక్కడి బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల నాయకుల సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లాలో కెల్లా మన మండలం మొదటి స్థానంలో ఉండాలన్న లక్ష్యంతో సభ్యత్వ నమోదు చేద్దామన్నారు.పార్టీలో చేరడానికి ఆసక్తి గలవారిని అశ్రద్ధ చేయకుండా చేర్చుకోవాలన్నారు.స్థానిక ఎన్నికలకు ఇప్పటినుండే సమాయత్తం కావాలని సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. మహిళా నాయకురాలు పైల అమ్మాజీ మాట్లాడుతూ పార్టీ ఆశయా లకు అనుగుణంగా మనం కష్టపడి క్రమశిక్షణతో పని చేద్దామ న్నారు. ఈ సమావేశంలో నాయకులు వర్రి వెంకటరావు, జనపరెడ్డి సూర్యనారాయణ, బండారు సత్యనారాయణ పాత్రుడు, కూనిశెట్టి దాలినాయుడు, శరగడం సన్యాసినాయుడు, గజ్జి అప్పలనాయుడు, సూరిశెట్టి దాసు, సిరపరపు శివస్వామినాయుడు, ఇమంది సన్యాసిరావు, వయలేటి త్రినాధ్, దొగ్గ నాయుడు, కుబిరెడ్డి ఈశ్వరరావు, బొడ్డు శ్రీరామమూర్తి, ద్వారపూడి రాజు, అనిమిరెడ్డి ఆనంద్, పెదగాడి ప్రసాద్, కూండ్రపు గంగునాయుడు(ట్రైల్స్) తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మపల్లిలో ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

**హాజరైన తల్లులు బాలింతలు గర్భిణీలు.**



**వేపాడ, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**మండలంలోని కుమ్మపల్లిలో పౌష్టికాహార మాసోత్సవాలు బుదవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీలోని మూడు అంగన్వాడి కేంద్రాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలు డెక్క బుచ్చమ్మ,డెక్క ఈశ్వరమ్మ, లెక్కల నూకరత్నం తదితరుల సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రాలలోని చిన్నారులు,వారి తల్లిదండ్రులు, గర్భిణీలు బాలింతలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడిల ఆయాలు పాల్గొనగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి జరిగే మేలుపై అంగన్వాడి కార్యకర్తలు అవగాహన కల్పించారు.అలాగే ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పాలు, గ్రుడ్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. వాటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ మాసోత్సవాలలో కుమ్మపల్లి, పైలకొంపలకు చెందిన తల్లులు బాలింతలు గర్భిణీలు పిల్లలు పాల్గొన్నారు.

## పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం

# ఎన్.పి.ఎస్ వాత్సల్య

### ఎస్ బిఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్.పి.ఎస్ వాత్సల్య యోజన పథకం ఎంతగానో దోహదపడుతుందని, ఎస్బిఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఎన్.పి. ఎస్ వాత్సల్య యోజన పథకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ప్రారంభించారు. సిరిపురం వద్ద ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిపాలన విభాగంలో ఎస్బిఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, నాబార్డ్ డిడిఎం సామంత్ కుమార్, ఎల్డిఎం ఎం.శ్రీనివాస్, బ్యాంకు అధికారులు నిర్వహించిన, వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వామ్యం అయ్యారు. కార్యక్రమం అనంతరం డీజిఎం మాట్లాడుతూ, ఎన్పిఎస్ వాత్సల్య యోజన కింద తల్లిదండ్రులు పింఛను ఖాతాలో పెట్టుబడి పెట్టడం ద్వారా వారి పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయవచ్చని అన్నారు. ఈ పథకం దీర్ఘకాలంలో సంపదను సృష్టించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది చాలా పెట్టుబడి ఎంపికలను కలిగి ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లల పేరుతో ఏడాదికి కనీసం రూ. 1,000తో పెట్టుబడితో ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఖాతా నుండి నిధులను ఉపసంహరించుకోవచ్చని ఆయన తెలిపారు. దీంతో సమాజంలోని అన్ని వర్గాలకు ఈ పథకం అందుబాటులోకి వస్తుందని, ఈ పథకం సమగ్రతను, ఆర్థిక భద్రతను ప్రోత్సహిస్తుందని వివరించారు. ఈ పథకం చిన్న మొత్తాల పథకమైనప్పటికీ అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, ఫలితాలు అమోఘమని స్పష్టం చేశారు. ఈ పథకంతో పిల్లల్లో పొదుపు అలవాటు కావడమే కాకుండా, వికసిత్ భారత్ 2047 నాటికి భారతదేశం ఆర్థికంగా ఎదగాలనే ప్రధానమంత్రి లక్ష్యానికి ఇది ఎంతగానో దోహదమవుతుందని ఆకాంక్షించారు. అన్ని జాతీయ బ్యాంకుల్లో దీన్ని ప్రారంభించుకోవచ్చని, దేశవ్యాప్తంగా అత్యధిక బ్రాంచులు కలిగిన ఎస్బిఐలో అత్యధికంగా ఖాతాలు తెరవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంత మంచి పథకాన్ని మీకోసం కాకుండా మీ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ఆలోచన చేసి ఖాతాలు ప్రారంభించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం సామంత్ కుమార్, ఎల్డిఎం ఎం.శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగించి బీచ్‌లో వేయకండి

### బీచ్ పరిసరాల్లో పరిశుభ్రతా చర్యలు..
### కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్...



**విశాఖపట్టణం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** విశాఖ నుంచి భీమిలివరకు బీచ్ తీరంలో వినియోగించిన ప్లాస్టిక్ ను బీచ్ లో వేయకూడదని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ – 2024 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్థానిక ఆర్.కె. బీచ్ పరిసరాల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. బుధవారం బీచ్ రోడ్లో స్వచ్ఛతాహీ సేవ సమైక్యతా శిబిరాన్ని ప్రారంభించిన ఆయన బీచ్ పరిసరాల్లోని చెత్తను సేకరించి అందరిలో స్ఫూర్తి నింపారు. ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలను, గాజుపెంకులను తొలగించి చెత్త తొట్టెలో వేశారు. పర్యాటకులకు, సాధారణ పౌరులకు అసౌకర్యం కలగకుండా బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం చేపట్టారు. ఆయనతో నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పాటు జీవీఎంసీ కమిషనర్ పి సంపత్ కుమార్ ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాంలో భాగస్వామ్యమయ్యారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

### జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి...



**విశాఖపట్నం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛత హి సేవ -20 24 కార్యక్రమాలలో భాగంగా సఫాయిమిత్ర సురక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్వచ్ఛత హి సేవా 2024లో భాగంగా జీవీఎంసీ జోన్ 4 నందు 34వ వార్డు పరిధిలోని కొబ్బరి తోటలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ తో కలసి సఫాయిమిత్ర సురక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవా 2024 ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా ఈరోజు సఫాయిమిత్రా సురక్ష శిబిరం ఏర్పాటు చేయడమైనదని, ఈ శిబిరంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడమైనదని, ఈ కార్యక్రమం అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి సఫాయిమిత్రా పారిశుధ్య కార్మికులకు, ఉద్యోగులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతోందన్నారు.అనంతరం ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా 2024లో భాగంగా సఫాయిమిత్రా పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఎన్.యు.హెచ్.ఎమ్ కన్సల్టెంట్ శశిభూషణ్, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, సఫాయిమిత్రా పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డీఐజీ బాలకృష్ణ కుర్చీ యధాతదం



**విశాఖపట్నం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ విశాఖపట్నం డిఐజి జి.బాలకృష్ణను యధాతథంగా విశాఖ డీఐజీగా కొనసాగిస్తూ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 11 మంది (డిఐజి) డిప్యూటీ జనరల్ ఇన్స్పెక్టర్ పోస్టులు కలిగి ఉన్నారు. వారిలో కేవలం నలుగురిని మాత్రమే వేరే జిల్లాలకు బదిలీ చేస్తూ, మిగిలిన ఏడుగురిని యధావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై, జి.బాలకృష్ణ విశాఖపట్నంలోనే రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ డీఐజీగా కొనసాగుతారు. విజయనగరం జిల్లాలో డీఐజీగా విధులు నిర్వహిస్తున్న పి.విజయలక్ష్మిని అనంతపూర్ జిల్లాకు బదిలీ బదిలీ చేశారు. కాకినాడలో డిఐజిగా విధులు నిర్వహిస్తున్న ఏ.నాగలక్ష్మిని, విజయనగరం జిల్లాకు బదిలీ చేయగా, కడప జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బి.శివరాంను డిఐజిగా కాకినాడకు బదిలీ చేశారు. అనంతపూర్‌లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్న ఎన్ మాధవిని ఏలూరుకు బదిలీ చేశారు. విశాఖపట్నం డిఐజిగా విధులు నిర్వహిస్తున్న జి.బాలకృష్ణను విశాఖపట్నంలోనే కొనసాగి స్తూ, ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు మరో ఆరుగురు, జి.శ్రీనివాసరావు గుంటూరు, డాక్టర్ వి.పుష్ప లత ఒంగోలు, వి.కిరణ్ కుమార్ నెల్లూరు, పి.గిరిబాబు చిత్తూరు, పిజిఎస్ ఖయాని కర్నూలు, ఏ.రవీంద్ర నాథ్ విజయవాడ డీఐజీలను యధావిధిగా అదే స్థానాల్లో కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా బుధవారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## రేవళ్ళ పాలెంలో భారీ అన్నసంతర్పణ



**మధురవాడ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**జివిఎంసి ఆరో వార్డు పరిధి రేవళ్ళ పాలెం గ్రామంలో విఘ్నేశ్వర సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం నాడు రేవళ్ళ పాలెం సమీపంలో విఘ్నేశ్వర సేవా సంఘం కమిటీ సభ్యులు, రేవళ్ళ పాలెం గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. దాదాపుగా 500 0 మంది ప్రజలు అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.అదే రోజు సాయంత్రం భారీ ఊరేగింపుతో కోలాటం తప్పుడు గుళ్ళు మందు గుండు సామాన్లతో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.

## గాయత్రి నగర్‌లో ఘనంగా అన్నసంతర్పణ కార్యక్రమం

### - ముఖ్య అతిధిగా పాల్గొన్న గరే గురునాథ్



**మధురవాడ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** గణపతి ఉత్సవాల్లో భాగంగా జివిఎంసి ఆరో వార్డు పరిధి గాయత్రి నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నాడు కమిటీ సభ్యులు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిడిపి విశాఖ పార్లమెంటరి తెలుగు యువత ఉపాధ్యక్షులు, కెవి ఆర్ క్యాటరింగ్ అధినేత గరే గురునాథ్ పాల్గొని అయన చేతుల మీదుగా ప్రసాదాన్ని అందజేశారు.భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నసంతర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోవార్డు టిడిపి బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ పిల్ల రమేష్ కొల్లిబాబ్జి, కొరగంజి సూరిబాబు,గూడెల శ్రీనివాస్, సంతోషి,రమణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 50 కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ

### డాక్టర్ ప్రవీణ్ చక్రవర్తి నిత్యావసర సరుకుల పంపిణీ



**వి.ఆర్.పురం.సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** అల్లూరి సీతారాముల జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం తాళ్లగూడెం గ్రామంలో ఈరోజు కేటీసీ విద్యా సంస్థ సహకారం మరియు డాక్టర్ ప్రవీణ్ చక్రవర్తి గారి సహకారంతో గ్రామంలో ఉన్న గోదావరి వరదలు నిర్వాసితుల 50 కుటుంబాలకు నిత్యవసర సరుకులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవీంద్ర వర్మ మరియు వారి కుటుంబ సభ్యులతో పాటు కూనవరం మండలం ప్రధాన కార్యదర్శి మరియు మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు తెలుగుదేశం పార్టీ కూనవరం మండల మాజీ అధ్యక్షుడు గడేసుల ప్రేమ్ చందు సీనియర్ నాయకులు చెలికని ఉమా మహేశ్వర రావు, ఐటిడీపీ మీడియా కోఆర్డినేటర్ షేక్ రసూల్, మోసం రాము, కాశి,జెట్టి కన్నారావు. జట్టి వెంకటేశ్వర్లు. జట్టి నాంచారమ్మ. బోగ్గ వెంకమ్మ. గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్న సమారాధన



**అయినవిల్లి, సెప్టెంబర్ 18(ఆంధ్రపత్రిక):**వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో నవరాత్రి ఉత్సవములు బాల గణపతి స్వామికి ఎంతో ఘనంగా వివిధ రకమైనటువంటి విద్యుత్ అలంకరణతో, రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరణ చేసి నిర్వహించినారు. గణేష్ ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిమజ్జనం రోజున భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినారు. వేల కొలది భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామి అన్నప్రసాదమును స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ యువత పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రం చేసిన వైద్యులు, వైద్య సిబ్బంది

### కోతుల గుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛత హై సేవా కార్యక్రమం



**కూనవరం,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):**మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు బుధవారం నాడు స్వచ్ఛత హై సేవా కార్యక్రమంలో బాగం గా వైద్యాధికారులు,వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంతో పాటు ఆసుపత్రి పరిసరాలలో ఉన్న చెత్తా, పొదలు , శుభ్రం చేయడం జరిగింది. అలాగే ఆసుపత్రి ప్రాంతంలో వేసిన ప్లాస్టిక్ ను కూడా తొలగించడం జరిగింది. ఆసుపత్రి వాతావణం పరిశుభ్రంగా ఉంచేలా ప్రతీ ఒక్కరూ చూడాలని సూపరింటెండెంట్ డా. కె. మహేశ్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యులు డా. వివేక్ నాయక్, డా.సి.తేజ, గైనకాలజిస్టు డా.పి.శ్వేత, ఫార్మాసీ ఆఫీసర్ తుష్టి జోగారావు, శానిటేషన్ సూపర్ వైజర్ కె.సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎన్.ఆర్.సీ కౌన్సిలర్ కె. రమేష్,సిబ్బంది వై. అనసూర్య, శ్రావణి, బి. లక్ష్మి, రామాంజనేయులు, సుబ్బారావు, తేజ, జోగయ్య, అఖిల్, బాపిరాజు, ప్రసాద్, సతీష్, కూరం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్వదేశానికి రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు దంపతులు



**గోకవరం, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం గురువారం ఉదయం అమెరికా నుంచి స్వదేశమైన భారత్ కు తిరిగి వస్తున్నారు. గత నెల 26వ తేదీన అమెరికాలో ఉన్న ఆమె కుమార్తెల వద్దకు వారు వెళ్లారు. అక్కడ పర్యటనను విజయవంతంగా ముగించుకొని గురువారం హైదరాబాద్ చేరుకొని, అక్కడ నుంచి గోకవరం గ్రామానికి కంబాల శ్రీనివాసరావు వస్తారు. ఆయనకు భారీ ర్యాలీతో ఘనంగా స్వాగతం పలకడానికి రామసేన సభ్యులు, ఆయన సిబ్బంది, అభిమానులు శ్రేయోభిలాషులు, ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన అర్జేడి



**కె.కోటపాడు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్(అర్.జె.డి.)చిన్మయిదేవి బుధవారం మండలంలోని సూదివలస గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రం నిర్వహణకు సంబంధించి రికార్డులను ఆమె పరిశీలించారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పోషణ మాసోత్సవంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాల్సిన సామూహిక సీమంతాలు,అన్నప్రాసన, ప్రజారోగ్యం, ప్రి-స్కూల్ తదితర కార్యక్రమాల గురించి ఆర్జేడి చిన్నమయిదేవి అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వి.మంగతాయారు, కె.కోటపాడు సెక్టార్ సూపర్వైజర్ ఎల్.బి. సుశీల ఉన్నారు.

## క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన జడ్పిటిసి



**అయినవిల్లి,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం, అయినవిల్లి మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురుల స్కూల్ ఆఫ్ ఇండియా గేమ్స్ క్రీడా ఉత్సవాలను జడ్పిటిసి సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలో వివిధ హై స్కూల్ పిఈటిలు, స్కూలు ప్రధానోపాధ్యాయులు దామిశెట్టి బుజ్జి,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర కళాశాలలో మోడీ పుట్టినరోజు వేడుకలు



**మొగల్తూరు, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**మన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జీ జన్మదిన వేడుకలలో రెండో రోజు బుధవారం సేవా పక్ష ఉత్సవములు పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామంలో గ్రూప్ ఆఫ్ స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ టెక్నాలజీ కాలేజీ పరిధిలో రెడ్ క్రాస్ బ్లడ్ డొనేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పరచడం జరిగినది. ఈ కార్యక్రమానికి నరసాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి కార్యకర్తలు ఆహ్వానం మేరకు దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి: పులపర్తి వెంకటేశ్వరరావు,జిల్లా కార్యదర్శి: గునిశెట్టి శ్రీనివాస్ నరసాపురం పట్టణ అధ్యక్షులు: మునికోటి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు: మారంపూడి రాము , మండల కార్యదర్శి: మారు బోయిన రామాంజనే యులు,కిషన్ మోర్చా మండల అధ్యక్షులు: కొండవీటి వీర రాఘవులు (బుజ్జి) నియోజవర్గం కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిట్రగండ గ్రామంలో స్వేచ్ఛతాహి సేవ



**డుంబ్రిగుడ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**మండలంలోని కొల్లాపూటు పంచాయితీ పరిధిగల బిట్రగండ గ్రామంలో బుధవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ పి.రామ్మూర్తి,సెక్రటరీ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో స్వేచ్ఛతహి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వేచ్ఛతాహి సేవ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అనంతరం బ్యానర్ పట్టుకుని గ్రామంలో ర్యాలీ చేస్తూ గడపగడపకు సందర్శిస్తూ పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్త తులమ్మ, అంగన్వాడి కార్యకర్త అప్పలమ్మ, వార్డు సభ్యుడు సుందర్, నేచర్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కస్తూరి కావ్య ,డోక్రా గ్రూప్ సభ్యులు, గ్రామ వాలంటీర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవనంలో బోరు నిర్మాణం



**డుంబ్రిగుడ,సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):** మండలంలోని కొర్రాయి పంచాయతీ బురిడీవలస గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో నూతనంగా మంజూరైన తాగునీటి బోరును బుధవారం స్థానిక సర్పంచ్ పి. కొములు ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొములు మాట్లాడుతూ గ్రామస్తులతోపాటు పంచాయతీ గిరిజనులందరికీ కమ్యూనిటీ భవనం ఉపయోగపడు తుందన్నారు. అక్కడ వేడుక ఫంక్షన్లు,సమావేశాలుతో పాటు పలు రకాల కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. తాగునీటితోపాటు విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజ్ కుమార్, నాయకులు మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్‌కు 350 కోట్లు

**అందరూ ఒప్పుకుంటే ఎన్డీఏ ఎమ్మెల్యేలు అందరం ఒక నెల జీతం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇద్దాం..**

**ముఖ్యమంత్రి చంద్రబాబు**

విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక): సీఎం చంద్రబాబు సంచలనం కామెంట్స్ చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని గత ప్రభుత్వం అపవిత్రం చేసిందని వ్యాఖ్యానించారు. నాసిరకమైన సరుకులు వాడడమే కాకుండా నెయ్యికి బదులు యానిమల్ ఫ్యాట్ (జంతు నూనె) కూడా వాడారని తెలిసిందన్నారు. ఈ విషయం తెలిసి ఆందోళన చెందినట్లు చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్వచ్ఛమైన నెయ్యిని తెప్పించి లడ్డూ ప్రసాదం కోసం వాడుతున్నట్లు చెప్పారు. వరదల నేపథ్యంలో 350 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చిందని.. ఇదొక చరిత్ర అన్నారు చంద్రబాబు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి ఒప్పుకుంటే.. ఎన్డీఏ ఎమ్మెల్యేలు అందరం ఒక నెల జీతం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇద్దామని కోరారు సీఎం చంద్రబాబు. ప్రపంచం అంతా స్పందించిదని.. మనం కూడా కూడా స్పందిస్తే హుందాగా ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఎడ్ టెక్ కంపెనీతో ఏపీ ఎస్ఆర్ఎం ఎంవోయూ



**అమరావతి,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):**మన దేశంలో బెస్ట్ ప్రోగ్రామింగ్ హబ్‌గా గుర్తింపు పొందిన ఎడటెక్ కంపెనీతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ బుధవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. విద్యా విషయక పాఠ్యప్రణాళికను రూపొందించే క్రమంలో కృత్రిమ మేథను ఏకీకృతం చేసేందుకు ఈ ఎంవోయూ ఉపకరిస్తుందని రెండు సంస్థలు అభిప్రాయానికి వచ్చాయి.

వర్సిటీలోని పారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ భరద్వాజ్ శివకుమారన్, ప్రోగ్రామింగ్ హబ్ సీఈవో సిద్దేష్ జోగ్లేకర్లు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. విద్యా మరియు పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంతో పాటు మార్కెటింగ్ రంగ పురోభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదపడుతుందని డీన్ డాక్టర్ భరద్వాజ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్కుమార్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం వల్ల బహుళ ప్రయోజనాలు ఒనకూరతాయని ఎడ్క్ కంపెనీ భావిస్తోంది. అనంతరం ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.

# ప్రకాశం జిల్లా సమస్యలపై సీఎంని కలసిన మాగుంట



**ఒంగోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):**ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళగిరిలో సికే కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన యన్.డి.ఏ. పార్లమెంటు మరియు శాసన సభా పక్ష సభ్యులతో జరిపిన సమావేశం సందర్భంగా ప్రకాశం జిల్లాలోని సమస్యలైన-ఒంగోలులో విమానాశ్రయం నిర్మాణం, వెలిగొండ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు, మార్కాపురం మెడికల్ కాలేజి పనులు పూర్తి, బేస్తవారిపేట-ఒంగోలు ఆర్ అండ్ బి రోడ్డును నేషనల్ హైవే నాలు లైన్ల రోడ్డుగా స్తాయి పెంపు, రామతీ ర్థం జలాశయం మరమ్మతులు, కొత్తపట్నం మండలంలో సూపర్ ఆర్ వో ప్లాంటు ఏర్పాటు, నడికుడి-శ్రీ కాళహస్తి రైల్వే లైను త్వరితగతిన పూర్తి మరియు ఒంగోలులో క్రొత్త పేపర్ మిల్లు నిర్మాణం గురించి లిఖితపూర్వకంగా తెలియజేసి, వాటిని త్వరితగతిన ఏర్పాటుచేయవలసినదిగా కోరినారు. దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.



ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్

వరదల్లో ప్రకాశం బ్యారేజీ గేట్లును ఢీకొన్న ఒక బోటును బయటకు తీసిన రెస్క్యూ బృందం

# చట్ట ప్రకారమే దర్యాప్తు



- జెత్వానీ కేసులో ఎవర్నీ వదలం..
- హోంమంత్రి అనిత వార్నింగ్

**అమరావతి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**ముంబై నటి కేసులో ప్రభుత్వం ఎవరినీ బలిచేయలేదని.. బాధిత మహిళకు న్యాయం చేస్తోందని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. చట్ట ప్రకారమే దర్యాప్తు వేగంగా జరుగుతుందని, లోతైన దర్యాప్తులో తేలిన ఆధారాలు పరిశీలించాకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. ఈ కేసులో ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టబోమన్నారు. గత ప్రభుత్వం పైశాచికత్వం వల్ల బలైన అమాయకులు లెక్కలేనంత మంది ఉన్నారని తెలిపారు. కుట్రలు పన్ని బోట్లను ప్రకాశం బ్యారేజీపైకి వదిలారని, కౌంటర్ వెయిట్లు ధ్వంసమై ఉంటే ప్రమాదాన్ని ఊహించగలమా అని ప్రశ్నించారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద పడవల తొలగింపు పనులను హో మంత్రి అనిత పరిశీలించారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి బోట్ల తొలగింపు పనులను పర్యవేక్షించిన అనంతరం మాట్లాడుతూ.. కుట్రలు పన్ని బోట్లను ప్రకాశం బ్యారేజిపైకి వదిలారన్నారు. ఎగువ నుంచి వచ్చిన 11.4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వల్ల బరువైన పడవలు మరింత బలంగా వేగంగా వచ్చి ఢీకొని 17 టన్నుల బరువున్న బ్యారేజ్ కౌంటర్ వెయిట్లు ధ్వంసమై ఉంటే ప్రమాదాన్ని ఊహించగలమా? అని ఆమె ప్రశ్నించారు. విజయవాడ ప్రజలు, ఎన్డీయే ప్రభుత్వం చేసుకున్న అదృష్టం వల్లే మరింత ప్రమాదం. జరగకుండా అక్కడితో ఆగిపోయిందన్నారు మంత్రి. విశ్లేషకుల పేరుతో సోషల్ మీడియా ద్వారా అర్థం లేని అనాలసిస్‌లు చేయడం తగదని ప్రజల భద్రత పట్ల బాధ్యతతో మాట్లాడాలని హితవు పలికారు. ఉద్దేశపూర్వకంగా చేసినవి కాకపోతే 50 టన్నుల బరువున్న పడవలు ఎలా బ్యారేజ్ వద్దకు కొట్టుకుని వచ్చాయో విశ్లేషించుకోవాలన్నారు. ఎగువన 200 పడవలు ఉంటే ఈ పడవలే ఎందుకు కొట్టుకు వచ్చాయో చెప్పాలన్నారు. టీవీల ముందు కూర్చుని నిర్లక్ష్యంగా మాట్లాడడం సరికాదని హోంమంత్రి అనిత అన్నారు.

# ఇన్‌పుట్ సబ్సిడీ కింద నిధులను విడుదల

**వరదబాధిత రైతులకు ప్రభుత్వం శుభవార్త**



**అమరావతి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**ఏపీలో వరద బాధితులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యానవన పంటలకు జరిగిన నష్టపరిహారంలో భాగంగా 5 కోట్ల 78 లక్షల 18 వేల రూపాయలను విడుదల చేశారు. వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో చాలా మేరకు రహదారులు ధ్వంసమయ్యాయి. ఈ దెబ్బతిన్న రాష్ట్ర హైవేలకు ప్యాచ్ వర్క్ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. రూ.290.40 కోట్లు నిధులు విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

# యార్లగడ్డను కలసిన అక్కినేని నాగార్జున



**విశాఖపట్నం,సెప్టెంబరు 18 (ఆంధ్రపత్రిక):** అక్కినేని నాగార్జున బుధవారం సాయంత్రం పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం వచ్చిన సందర్భంగా యార్లగడ్డను కలిశారు,అక్కినేని నాగార్జున మాట్లాడుతూ గుడివాడలో నాన్నగారు అక్కినేని నాగేశ్వరావు కట్టించిన కాలేజీలో చదివి ఉన్నతస్థాయికి చేరిన వైఎల్పీ మాకుటుంబానికి ఎంతో సహాయం చెయ్యటం, మా కుటుంబ సభ్యులలో ఒకరిగా ఉండటం వలన అయనపై అభిమానంతో కలవటానికి వచ్చానని చెప్పారు. అక్కినేని నాగార్జునను కలసిన వారిలో పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య బాలమోహనదాసు, పైడా కృష్ణప్రసాద్, మాజీ ఉపకులపతి ముత్యాల నాయుడు తదితరులు ఉన్నారు.

# ఇక ఇసుక సమస్యలకు శాశ్వత పరిష్కారం

- నేడు "ఆంధ్రప్రదేశ్ ఇసుక నిర్వహణ విధానం"
- నూతన పోర్టల్ ఆవిష్కరించనున్న సిఎం
- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేస్తూ అందరికీ అందుబాటులో ఇసుక
- రాష్ట్ర మంతటా ఏకీకృత రవాణా చార్జీలు
- సచివాలయాలలో ఇసుక బుకింగ్ పూర్తి చేసుకునే సువర్ణావకాశం
- కీలక భూమిక పోషించనున్న జిల్లా స్థాయి కమిటీలు..
- గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



**అమరావతి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**ఉచిత ఇసుక విధానం పూర్తి స్థాయిలో గాడిలో పడనుంది. ఇసుక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ఆంధ్రప్రదేశ్ ఇసుక నిర్వహణ విధానం (ఎపి శాండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్)ను రాష్ట్ర సీఎం చంద్రబాబు గురువారం ఆవిష్కరించనున్నారు. క్షేత్ర స్థాయిలో అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత ఇసుకను చేర్చాలన్న చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా గనులు, భూగర్భ శాఖ అందరికీ అందుబాటులో, అనుకూలమైన విధానానికి రూపకల్పన చేసింది. ఫలితంగా ఇకపై ఇసుక ఎగుమతి కోసం బారులు తీరే లారీలు, దిగుమతి కోసం వేచిచూసే వినియోగదారులు కనిపించరు. గనులు, భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా నూతన పోర్టల్ గురించి వివరిస్తూ ప్రభుత్వం ప్రజలకు పూర్తి ఉచితంగానే ఇసుకను అందిస్తుందని, కేవలం నిర్వహణ, జీఎస్టి, సీనరేజ్ వంటి చార్జీలను మాత్రమే వసూలు చేస్తారని, దీనిలో ప్రభుత్వానికి ఎటువంటి విక్రయ అదాయం లేదని వివరించారు. పారదర్శకతతో కూడిన విధానం అమలు చేస్తున్నామని, శాండ్ పోర్టల్‌ను నిశితంగా పరిశీలిస్తే అన్ని ప్రశ్నలకు సమాధానం లభిస్తుందని తెలిపారు. వినియోగదారులు ఇసుక బుకింగ్ కోసం ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేదని, వారి గ్రామ, వార్డు సచివాలయాలలో చేయించుకోవచ్చని వివరించారు. ఉదయం 10.30 నుండి 12 గంటల వరకు కేవలం సచివాలయాల ద్వారా మాత్రమే బుకింగ్ జరుగుతుందని, 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎవరైన, ఎక్కడినుండైనా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విషయంలో ప్రజలు ఎదుర్కునే ఇబ్బందులను టోల్-ఫ్రీ నంబర్ 1800-599-4599, ఇమెయిల్-ఐడి:dmgapsandcomplaints@yahoo.com., ద్వారా కాని ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి ఫిర్యాధు పైనా తప్పని సరిగా చర్య తీసుకుని, సంబంధిత వ్యక్తులకు జిల్లా కలెక్టర్ల కార్యాలయాల నుండి తిరిగి సమాచారం అందిస్తారని అన్నారు. ఉచిత ఇసుక ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఐవిఆర్ఎస్ విధానం ద్వారా ప్రతి రోజు వినియోగదారుల నుండి అభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. విజిలెన్స్ మెకానిజంను పటిష్టం చేస్తున్నామని కఠిన చర్యలకు సైతం వెనకాడబోమన్నారు.
















# వరద బాధితులకు అండగా విరాళాలు

**అమరావతి, సెప్టెంబర్ 18 (ఆంధ్రపత్రిక):**వరద బాధితులకు అండగా నిలిచేందుకు దాతలు మేము సైతం అంటూ ముందుకొస్తున్నారు. బుధవారం నాడు ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసిన పలువురు.. ఆయనకు విరాళాలు అందజేశారు. గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.6,01,116 అందజేశారు. అమలాపురానికి చెందిన బోనం వెంకట చలమయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బోనం కనకయ్య రూ.5 లక్షలు అందజేశారు. నంద్యాలకు చెందిన ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎండీ ఎస్ దినేష్ రెడ్డి, కాలేజీ డీన్ బి సూర్యప్రకాశ్ రెడ్డి రూ.4 లక్షలు అందజేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నేతృత్వంలో ప్రజలు, వివిధ సంస్థల నుంచి సేకరించిన విరాళం రూ.2,95,000 అందజేశారు. నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధి జయకుమార్ రూ.2,50,000 అందజేశారు. మదనపల్లెకు చెందిన గోల్డెన్ వాలీ ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, కట్టా దొరస్వామి నాయుడు రూ.2 లక్షలు అందజేశారు. అనంతపురానికి చెందిన వి.సురేష్ నాయుడు రూ.లక్ష అందజేశారు. బీజేపీ మజ్దూర్ విభాగం నాయకులు నాగేశ్వరరావు రూ.10 వేలు అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన వారికి మంత్రి నారా లోకేష్ కృతిజ్ఞతలు తెలిపారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com